



నవతెలంగాణ

1 హన్మకొండ, వరంగల్, జయశంకర్, ములుగు, జనగామ, మహబూబాబాద్

గురువారం 02 మార్చి 2023



ఈ నెల10 నుంచి సదరం పరీక్షలు

నవతెలంగాణ-సుబేదారి

హనుమకొండ జిల్లాలో దివ్యాంగుల వైకల్య శాతం నిర్ధారణ కోసం ఈనెల పది నుంచి ఎంజీఎం లో సదరం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డీఆర్‌డిఏ పీడి ఆకవరం శ్రీనివాస్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4న మధ్యాహ్నం 1:00గంట నుంచి మీ సేవా కేంద్రాల ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఆర్థో, అంధత్వం, మానసిక వైకల్యం, వినికిడి లోపం ఉన్నవారికి ఈ స్లాట్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి కాంగ్రెస్ ఆర్థిక సహాయం

నవతెలంగాణ-మంగపేట

మండలంలోని కోమటిపల్లిలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ సీనియర్ నాయకుడు మాసిరెడ్డి వెంకట్ రెడ్డి, మార్పుల దయాకర్ రెడ్డి లు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం బాధిత కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కోమటిపల్లిలో కుర్యాల సోమయ్య, రాచకొండ కృష్ణ మృతిచెందగా కుటుంబానికి మాసిరెడ్డి వెంకటరెడ్డి రూ.3 వేల ఆర్థిక సహాయం 50 కేజీల బియ్యాన్ని అందించారు. నాయకులు పొదెం నగేష్, ఎర్ర బాల్లయ్య, గుండెబోయిన వెంకటేశ్వర్లు, రవిరెడ్డి, భూర్గుల సతీష్, సర్దన మల్లయ్య, ఎండి.పాష, దామెర యాకయ్య, కడారి మోహన్, శ్రీకాంత్, గొడిశాల యాకుబ్, గొడిశాల ముత్తయ్య, కొత్త సాయిలు పాల్గొన్నారు.



'కడియం' వర్సెస్ 'తాటికొండ'



- బస్తీమే సవాల్ అంటున్న ఇరువర్గాలు..

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం వేలేరు మండలం సోడాశపల్లిలో జరిగిన బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ బహిరంగసభలో 'కడియం', 'తాటికొండ' వర్గాలు బస్తీ మే సవాల్ అన్న చందంగా ప్రవర్తించడం చర్చనీయాంశంగా మారింది. సోడాశపల్లిలో జరిగిన బహిరంగసభలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పేరు ఎత్తగానే అనుచరులు గట్టిగా హర్షధ్వానాలు, ఈలలు కొట్టి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పేరు ఎత్తగానే ఆయన అనుచరులు హర్షధ్వానాలు చేశారు. ఈ బహిరంగసభ రెండు వర్గాల ఆధిపత్యం చూపించుకోవడానికి వేదికగా మారింది. సభ జరిగినంత సేపు 'కడియం' వర్గీయులు హల్చల్ సృష్టించారు. 'కడియం' మాట్లాడడానికి లేవగానే పెద్ద పెట్టున చప్పట్లు, ఈలలు కొట్టి హర్షం వ్యక్తం చేశారు. కొన్ని నిమిషాలపాటు ఇలా జరగడం వేదిక మీదున్న మంత్రి కేటీఆర్‌తోపాటు మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఆద్యంతం పరిశీలిస్తూనే వుండిపోయారు. ఈ వేదికపై 'కడియం', 'తాటికొండ' ఎవరికి వారు ఆకట్టుకునే ప్రయత్నం చేశారని, ఇందులో సబ్జెక్టుపరంగా 'కడియం' పైచేయి సాధించారని రాజకీయ పరిశీలకులు అంచనా వేశారు. క్షేత్రస్థాయిలో ఈ బహిరంగసభ జరిగిన తీరు నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో పార్టీ అధిష్టానం వైఖరి ఎలా వుండబోతుందన్న అంశం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఈ సభ విజయవంతానికి ఇద్దరు నేతలు తీవ్రంగా కృషి చేశారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సొంతూరు సోడాశపల్లి బహిరంగసభ ఈ ఇద్దరు నేతలకు బలప్రదర్శనగా మారడం గమనార్హం.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్టేషన్‌ఘన్‌పూర్ (ఎస్సీ) నియోజకవర్గానికి ప్రత్యేక స్థానముంది. ఈ నియోజకవర్గం నుండి విజయం సాధించిన కడియం శ్రీహరి టిడిపి హయాంలో వరుసగా 9 ఏండ్లపాటు జిల్లాలో ఏకైక మంత్రిగా కొనసాగి రికార్డు సృష్టించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా చరిత్రలో ఇలాంటి రాజకీయ నేపథ్యం ఏ మంత్రికి గతంలో లేకపోవడం గమనార్హం. జిల్లా నుండి ప్రతి మంత్రివర్గంలో ఇద్దరు లేదా ముగ్గురికి కేబినెట్‌లో అవకాశం దక్కేది. అటువంటిది టిడిపి హయాంలో 'కడియం' తొమ్మిదేండ్లపాటు ఏకైక మంత్రిగా కొనసాగారు. 'స్టేషన్'లో ఒకసారి విజయం సాధిస్తే రెండోసారి గెలవరనే ప్రచారం వుండేది. అలాంటిది 'కడియం', ఎమ్మెల్యే డాక్టర్ టి. రాజయ్య ఈ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టారు. వరుసగా గెలిచిన వారిలో వీరిద్దరున్నారు. ఎమ్మెల్యే పదవికి, కాంగ్రెస్‌కు రాజీనామా చేసి డాక్టర్ టి. రాజయ్య టిఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం 'కడియం' టిడిపికి రాజీనామా చేసి టిఆర్‌ఎస్‌లో చేరారు. ముందే చేరడం 'తాటికొండ'కు కలిసొచ్చింది. దీంతో ఎన్నికల్లో 'స్టేషన్' నుండి పోటీ చేసే అవకాశం ముందే హామి పొందిన 'తాటికొండ' దక్కించుకున్నారు. టిఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక తొలి డిప్యూటీ సిఎం పదవి స్టేషన్‌ఘన్‌పూర్ నుండి ప్రాతినిధ్యం వహించిన డాక్టర్ తాటికొండ రాజయ్యకు దక్కడం గమనార్హం. ఎంత అనూహ్యంగా డిప్యూటీ సీఎం పదవిని దక్కించుకున్నారో, అంతే అనూహ్యంగా పదవిని కోల్పోయారు. టిఆర్‌ఎస్ కేబినెట్‌లో బర్తరఫ్ అయిన మంత్రిగా 'తాటికొండ' నిలిచిపోయారు.

ఎక్కడ కోల్పోయాడో.. అక్కడే దక్కించుకొని..

స్టేషన్‌ఘన్‌పూర్ పార్టీ టికెట్‌ను 'కడియం'ను కాదని సాధించిన డాక్టర్ తాటికొండ రాజయ్య ఎమ్మెల్యే అయి తొలి డిప్యూటీ సిఎం పదవిని అధిష్టించినా, ఆ పదవిని కాపాడుకోలేకపోయారు. ఇదే నియోజకవర్గం పార్టీ టికెట్‌నాశించి భంగపడి వరంగల్ లోక్‌సభ ఎంపిగా భారీ మెజార్టీతో విజయం సాధించిన కడియం శ్రీహరి, డాక్టర్ తాటికొండ రాజయ్య స్థానంలో డిప్యూటీ సిఎంగా పదవిని అలంకరించడం ఎవరికీ అంతుబట్టలేదు. ఎంపి పదవికి రాజీనామా చేయడంతో 'కడియం'కు ఎమ్మెల్సీ పదవినిచ్చి కేబినెట్‌లో డిప్యూటీ సిఎంగా కొనసాగించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం తనకు రాజకీయ జన్మనిచ్చిందని 'కడియం' అంటే, నియోజకవర్గ ప్రజలు నాకు దేవుళ్లు అని 'తాటికొండ' అంటారు. వీరిద్దరి ఎత్తులు, పైఎత్తులతో 'స్టేషన్' రాజకీయాలు మహారంజుగా మారాయి. 'స్టేషన్'లో వచ్చే ఎన్నికల్లో ఎవరు మాస్టర్ అవుతారన్నది నియోజకవర్గంలో ఇప్పటి నుండి హాట్ టాపిక్‌గా మారింది.

బస్తీ మే సవాల్..

'కడియం', 'తాటికొండ' వర్గీయుల మధ్య సోడాశపల్లి బహిరంగసభ బస్తీ మే సవాల్‌గా మారింది. నేతలు ఈ నేతల పేర్లు చెప్పగానే పెద్ద ఎత్తున అరుపులు, కేకలు, ఈలలతో సభా ప్రాంగణం మోతమోగింది. 'కడియం' మాట్లాడడానికి లేవగానే కొన్ని నిమిషాలపాటు సభా ప్రాంగణం దద్దరిల్లింది. 'ప్లీజ్.. ప్లీజ్' అంటూ 'కడియం' ప్రజలను అభినయిస్తూ రాజకీయాలు మాట్లాడనని, అభివృద్ధికి సంబంధించి మాత్రమే మాట్లాడుతానంటూ ప్రసంగం కొనసాగించారు. తొలి పలుకుల్లోనే 'కడియం' రాబోయే రోజుల్లో కాబోయే ముఖ్యమంత్రి కేటీఆర్ అంటూ వ్యాఖ్యానించి అందరిని విస్మయపరిచారు. ముందు మాట్లాడే అవకాశం 'కడియం'కు రావడం, ఆ సమయాన్ని అలా ఆయన రాజకీయంగా సద్వినియోగం చేసుకున్నాడని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. సోడాశపల్లి గ్రామం ఎమ్మెల్సీ, రైతుసమితి అధ్యక్షులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్వగ్రామమైనా, ఈ బహిరంగసభ 'కడియం', 'తాటికొండ'ల బలాబలాలకు వేదికగా మారింది. ఈ సభ జరిగిన తీరు, ప్రజల స్పందన నియోజకవర్గంలోనే కాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.





గండ్ర వర్సెస్ గండ్ర



భూపాలపల్లిలో కొనసాగుతున్న మాటల యుద్ధం

అవినీతిపై బహిరంగ చర్చకు సవాళ్లు.. ప్రతి సవాళ్లు

నేడు అంబేద్కర్ సెంటర్ వేదికగా చర్చ జరిగేనా ?

రాజకీయ పార్టీలు సంయమనం పాటించాలి : జిల్లా ఎస్పీ సురేందర్ రెడ్డి

నేటి నుంచి 144 సెక్షన్ అమలు

నవతెలంగాణ-భూపాలపల్లి

జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణరావుల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. ఇరువురి పరస్పర ఆరోపణలతో రాజకీయం రసవత్తరంగా మారింది. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం జరిగిన రేవంత్ రెడ్డి సభలో గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిపై తీవ్రమైన అవినీతి అక్రమాలు, భూకబ్జాలకు పాల్పడుతున్నాడని ఆరోపణలు చేయడమే కాకుండా బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. ఎమ్మెల్యే గండ్ర సైతం తాను సిద్ధమని ప్రకటించారు. బుధవారం ఇరువురు నేతలు వేరువేరుగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. బీఆర్‌ఎస్ భవన్‌లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతితో కలిసి ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు. భూకబ్జాల ఆరోపణలపై ఆధారాలు ఉంటే నేడు అంబేద్కర్ చౌరస్తా సెంటర్ వద్ద ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సత్యనారాయణరావుకు సవాలు విసిరారు. ఆయిల్ ఫామ్ కోసం ప్రభుత్వం ఇచ్చే ఉత్సాహంతో తన కొడుకు గౌతమ్ రెడ్డి కంపెనీ పెడుతుంటే అక్రమ ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కాగా అన్ని రకాల ఆరోపణలకు ఆధారాలున్నాయంటూ గండ్ర సత్యనారాయణరావు వివరించారు. మీడియా మధ్యవర్తులుగా అక్రమాలు నిరూపించేందుకు సిద్ధమని నేడు అంబేద్కర్ చౌరస్తా వద్ద 11 గంటలకు సిద్ధంగా ఉంటానని విలేకరుల సమావేశం పెట్టి మరీ వెల్లడించారు. చర్చకు మీడియా ప్రతినిధులు జడ్జిలుగా వ్యవహరించాలని, ఇరు పార్టీల కార్యకర్తలు ఎవరికి ప్రాతినిధ్యం ఉండవద్దని తెలిపారు. పోలీసులు ఎలాంటి అడ్డంకులు సష్టించరాదని షరతు విధించారు. ఆధారాలు చూపించకుంటే రాజకీయ సన్యాసం తీసుకోవడమే కాకుండా ఆరోపణలు నిరూపిస్తే ఎమ్మెల్యే ఏం చేస్తారని ప్రశ్నించారు. ఇరువురి ఆరోపణలు నిరూపించుకునేందుకు అంబేద్కర్ చౌరస్తా వేదికగా మారనుందా ? అనేది చర్చనీయాంశంగా మారింది. ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేయడంతో జిల్లా కేంద్రం రాజకీయంగా వేడెక్కింది. రేవంత్ రెడ్డి సభపై బీఆర్‌ఎస్ నాయకులు అటు కాంగ్రెస్ నాయకులు ఒకరిపై ఒకరు రాళ్లు,బీరుబాటిల్స్,గుడ్లు, టమాటా లు విసురుకోవడం పలువురికి గాయాలు అవడంతో రెండు పార్టీల మధ్యన రాజకీయమంతా నివురుగప్పిన నిప్పులా మారింది. రాజకీయ ప్రత్యారోపణలతో నేడు ఏమి జరుగుతుందోనని జిల్లా ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది.

నేటి నుంచి 144 సెక్షన్ అమలు

జిల్లాలో రాజకీయ పార్టీలు సంయమనం పాటించాలని, ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా బల ప్రదర్శనకు దిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పి జె. సురేందర్ రెడ్డి అన్నారు. రేపటి నుండి వారం వరకు జిల్లా కేంద్రంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులు,గుంపులుగా ఎవరూ గుమిగుడవద్దని, జన జీవనానికి ఇబ్బంది కలిగించ వద్దని ఎస్పి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ....శాంతి భద్రతల పరిరక్షణ లో భాగంగా రాజకీయ పార్టీల నాయకుల సవాళ్లకు, బహిరంగ చర్చలకు పోలీసు శాఖ అనుమతి లేదని స్పష్టం చేశారు. ముందస్తుగా రేపు భూపాల పల్లి పట్టణంలో 144 సెక్షన్ విధించడం జరిగిందని అనవసరంగా ఎవరూ బయటకి రాకూడదని పేర్కొన్నారు. ఇరు పార్టీల మధ్య జరిగిన గొడవలు, దాడుల విషయంలో ఇరు పార్టీల కార్యకర్తలపై కేసులు నమోదు చేశామన్నారు. పజల శ్రేయస్సు దష్ట్యా బహిరంగ ప్రదేశంలో చర్చలకు ఎవరికి ఎటువంటి అనుమతి లేదని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించ వద్దని సూచించారు. నేడు నిర్వహించనున్న బహిరంగ చర్చ కార్యక్రమాన్ని విరమించుకోవాలని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరిని వదిలేది లేదని హెచ్చరించారు.



సుమారు రూ.10లక్షల విలువైన

గంజాయి పట్టివేత

ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నవతెలంగాణ-కాజీపేట

గంజాయి రవాణా చేస్తున్న నిందితులను కాజీపేట జీఆర్పి పోలీసులు అదుపులోకి తీసుకొని వారి నుండి గంజాయి స్వాధీనం చేసుకున్న సంఘటన బుధవారం జరిగింది. డీఎస్పీ మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గత సంవత్సరం నుండి విశాఖపట్నం వైపు నుండి వచ్చే రైళ్లను పోలీసులు ప్రత్యేకంగా తనిఖీ చేస్తున్నారు. మంగళవారం కాజీపేట రైల్వే జంక్షన్‌లో జీఆర్పి సీఐ రామ్మూర్తి, ఎస్సై అశోక్ కుమార్, సిబ్బందితో కలిసి ప్లాట్‌ఫారంపై తనిఖీలు చేపట్టారు. ఐదుగురు ఏడు బ్యాగులతో అనుమానంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని బ్యాగులను తనిఖీ చేశారు. వారి వద్ద గోధుమ రంగు ప్లాస్టర్‌తో చుట్టబడిన 134 కిలోల 67 గంజాయి ప్యాకెట్లు దొరికాయి. గంజాయి తరలిస్తున్న వారిలో మహారాష్ట్రకు చెందిన సంజయ్, అర్జున్, షిండే, రమ అర్జున్ షిండే , నందకుమార్ ఘవాలి ,మనీషా దనేష్ సావంత్ , నజెరిన్ మునజీర్ ఖాన్ ఉన్నట్టు గుర్తించారు. అందులో ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలను పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు పది లక్షల వరకు ఉంటుంది. ఐదుగురు పై కేసు నమోదు చేసి జైలుకు పంపారు. వారు విశాఖపట్నం వైజాగ్ నుంచి రైలులో గంజాయి రవాణా చేస్తు ముంబై లాంటి ప్రాంతాలకు గంజాయి తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిఆర్పి హెడ్ కానిస్టేబుల్ దయాసాగర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భగీరథ పైపులైన్ మరమ్మత్తు

ఎఫెక్ట్

నవతెలంగాణ - శాయంపేట

మండల కేంద్రంలోని సాం ఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మూల మలుపు వద్ద లీకేజీ అయినా భగీరథ పైపులైను సంబం ధిత కాంట్రాక్టర్ సిబ్బంది తో మరమ్మతు చేశారు. భగీరథ కందకంలో పడిన గేదె అనే కథనం నవతెలంగాణలో ప్రచురితమైన విషయం విధితమే. ఈ కథనానికి స్పందించిన అధికారులు సంబంధిత కాంట్రాక్టర్ తో బుధవారం మరమ్మతు పనులు చేయించి కందకాన్ని పూడ్చివేశారు. పోలీస్ స్టేషన్ ఎదురుగా లీకేజీ అయిన పైపులైను మరమ్మతు పనులు కూడా పూర్తి చేశారు.



నీటిని విడుదల చేయాలని రైతుల నిరసన

నవతెలంగాణ-చిట్యాల

డీబీఎం-38 కెనాల్ కాలువ నీటిని వెంటనే విడుదల చేసి పంటలు నష్టపోకుండా కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రం శివారు రైతులు కెనాల్ కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ రబి సీజన్లో నీరు లేక రైతుల మొక్కజొన్న, మిరప పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డిబిఎం 38 కాల్వ ద్వారా నీరు వెంటనే విడుదల చేయాలని కోరారు. సంబంధిత జిల్లా ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పిట్టల రమేష్, సాధుల రవీందర్, అల్లం రవీందర్, ఈగ రాములు, రాయకుమరు భద్రయ్య పాల్గొన్నారు.



బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నాం...

ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి

ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

నవతెలంగాణ-భూపాలపల్లి



నేడు ఉదయం 11.00గంటలకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు కోసమే టిడిపి నుండి కాంగ్రెస్ లోకి మారాడని అన్నారు. ఆయన శిష్యుడు గండ్ర సత్యనారాయణరావు ఎమ్మెల్యేగా గెలవాలని అధికార దాహం కోసం తహతహలాడుతున్నారని అన్నారు. బుధవారం బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన రాజకీయ ప్రస్థానం గురించి వివరించారు. 2018 ఎన్నికల్లో రాష్ట్రమంతా బీఆర్‌ఎస్ వైపు చూస్తున్న తరుణంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గా గెలిచి ప్రజల మన్ననలను పొందానని అన్నారు. అప్పటి వరకు కాంగ్రెస్ పార్టీల్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నామే తప్ప ఆస్తులు సంపాదించుకోలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా,ఎమ్మెల్సీగా గెలవడం కంటే ముందే చిట్యాల మండలంలోని గిద్ద ముత్తారం గ్రామంలో గ్రామ వాస్తవ్యులైన ముస్లిం సోదరుల వద్ద చట్టబద్ధంగానే భూమిని తీసుకున్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. చిట్యాల మండలం వరికోల్ పల్లి,కుమ్మరిపల్లి గ్రామాలలో నేను భూమి కబ్జా చేశాడంటూ ఆరోపణలు చేయడం సరికాదని, దమ్ముంటే ఆధారాలతో నేడు అంబేద్కర్ సెంటర్లో చర్చకు రావాలని అన్నారు. తాను తన సతీమణి, కొడుకు ప్రజల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలతో ముందుకు వెళు తున్నామన్నారు. అసత్యపు ఆరోపనలు ప్రజలు నమ్మరని అన్నారు. తాను మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు భూపాలపల్లి కుగ్రామంగా ఉండేదని, నేడు అంచలంచలుగా అభివద్ధిచెందిందన్నారు. భూపాలపల్లికి మెడికల్ కాలేజీ ఔటర్ రింగ్ రోడ్ మున్సిపల్ శాఖ జీవో కాఫీ తదితరవి తీసుకురాలేదా అని ప్రశ్నించారు. తమను, తమ పార్టీని విమర్శించే కనీస నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలు అభిప్రాయం మేరకే అభివద్ధి కోసం తాను పార్టీ మారినట్టు చెప్పారు. రానున్న రోజుల్లో మీ అబద్ధాలకు చరమగీతం పాడి భారీ మెజార్టీతో మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి మాట్లాడారు. టీడీపీలో భవిష్యత్తు లేదని ఊసరవెల్లిలాగా పార్టీని విడిచిన తర్వాత వారిపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. నిత్యం సమస్యల పరిష్కారానికి కషి చేస్తున్న తమపై అసత్యపు ఆరోపణలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేయడం జరిగిందని అన్నారు. సింగరేణి కార్మికులకు 1000 ఇల్లు కట్టించినట్టు చెప్పారు. రానున్న రోజుల్లో నియోజకవర్గ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి వైస్ చైర్ పర్సన్ కల్లపు శోభ రఘుపతిరావు,మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకట రాణి సిద్దు, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్, పిఎసిఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు శిరుప అనిల్, జక్కం రవికుమార్, ముంజపల్లి మురళి, బద్ది సమ్మయ్య, చల్ల రేణుక, పిల్లలమర్రి శారద నారాయణ, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్వెస్ట్ టాలెంట్ టెస్ట్ రాష్ట్ర స్థాయి ఒలంపియాడ్‌లో...

గోల్డ్‌మెడల్ సాధించిన సాన్విశ్రీ, స్నితిక





నవతెలంగాణ-వరంగల్

క్వెస్ట్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పరీక్షల్లో క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్, దేశాయిపేట బ్రాంచ్ విద్యార్థులు సాన్విశ్రీ, స్నితిక గోల్డ్‌మెడల్ సాధించారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధులు మాజీ ఎంపీ రాపోలు ఆనంద్ భాస్కర్, జ్యోతిష్యుడు దైవజ్ఞశర్మ, రెయిన్‌బో, క్రిష్ణవేణి స్కూల్స్ చైర్మన్ ఎం.ఎం.షరీఫ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. క్వెస్ట్ టాలెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన లీడర్స్ పరీక్షలో క్రిష్ణవేణి స్కూల్, దేశాయిపేట బ్రాంచ్ 3వ తరగతి విద్యార్థిని మామిడి సాన్విశ్రీ గోల్డ్‌మెడల్ సాధించగా, లీడర్స్ పరీక్షలో 1వ తరగతి విద్యార్థిని స్నితిక గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ సందర్భంగా గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ కళ్యాణ్‌రామ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు

అంగన్‌వాడీ హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలి





సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి

నవతెలంగాణ -తాడ్వాయి

అంగన్వాడి హక్కుల పరిరక్షణకై ఉద్యమించాలని సీపీఐ(ఎం) ములుగు జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి, అంగన్వాడి టీచర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి కె సమ్మక్క అన్నారు. ఐసీడీఎస్ పరిరక్షణకు, అంగన్వాడి టీచర్ హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం చేయాలన్న పిలుపు మేరకు తాడ్వాయి మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయం ముందు అంగన్వాడి టీచర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం ద్వారా ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసి అంగన్వాడి ఉద్యోగుల ఉపాధికి నష్టం కలిగించే చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. అంగన్వాడీలకు ఇతర ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రమోషన్ కల్పిస్తామని, డబుల్ బెడ్ రూములు ఇస్తామని, పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని 30శాతం పీఆర్‌సీ కల్పిస్తామని అనేక హామీలు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. 2022 మే నెలలో 1972 చట్ట ప్రకారం దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీలకు గ్రాట్యూటీ చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఆన్లైన్ పేరుతో అనేక యాప్ లు తెచ్చి అంగన్వాడీలపై పని భారం పెంచుతున్నారని అన్నారు. ప్రభుత్వం అంగన్వాడి వర్కర్ సమస్య లు పరిష్కరించకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీ టీచర్స్ సిఐటియు జిల్లా అధ్యక్షురాలు సరోజన, పద్మ కుమారి, ఉపాధ్యక్షురాలు జమున, భాగ్య, రమ, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు గొంది రాజేష్, దుగ్గి చిరంజీవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు దాసరి కష్ణ, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

భీమదేవరపల్లి : అంగన్వాడీలు వారి హక్కులను పోరాడి సాధించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు. భీమదేవరపల్లి ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ప్రాజెక్ట్ అంగన్వాడి టీచర్లు హెల్పర్లు ఆధ్వర్యంలో బుధవారం నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా ఐసిడిఎస్ ద్వారా పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు హెల్పర్లను ప్రభుత్వం చిన్న చూపు చూస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ చట్టబద్ధత లేకపోవడం బాధాకరమన్నారు. అంగన్వాడి కార్యకర్తలుగా ఉన్న పేర్లను టీచర్లుగా పేరు మార్చారే తప్ప ఎలాంటి అదనపు సౌకర్యాలు కల్పించలేదన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేస్తూ ఐసిడిఎస్ కు బడ్జెట్ పెంచాలన్నారు. నష్టం కలిగించే నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. కేంద్రం పెంచిన వేతనం టీచర్లకు 1500 హెల్పర్లకు 750 మినీ అంగన్వాడీలకు 1250 ఏరియర్స్‌తో కలిపి చెల్లించాలన్నారు. 2, 3 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో చేసే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ, జిల్లా సహాయ కార్యదర్శి పుల్ల అశోక్, మండల అధ్యక్షురాలు కర్నూజ జమున, నాయకురాలు రమాదేవి, స్వరూప, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు

మహదేవపూర్ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం మండలంలని ఐసీడీఎస్ కార్యాలయం ముంద అంగన్వాడీ టీచర్లు ఆయాలు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, అంగన్వాడీ టీచర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి జయప్రద, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సత్యవాణి పాల్గొని మాట్లాడారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె ఉద్ధతం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. శ్రీకళ, శోభ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభించాలి

జిల్లా కలెక్టర్ ఎస్ క్రిష్ణ ఆదిత్య

నవతెలంగాణ - ములుగు

రామప్ప లోని శివాలయం, గొల్లాల గుడి, భైరవ దేవాలయం అభివద్ధి పనులు త్వరితగతిన ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఎస్. క్రిష్ణ ఆదిత్య సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో పాలంపేట డెవలప్మెంట్ అథారిటీ టూరిజంశాఖ, సింగరేణి కాలరీస్ అధికారులతో యునిస్కో గుర్తింపు పొందిన రామప్ప అభివద్ధి పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రామప్ప దేవాలయం పరిధిలోని భూములను పరిరక్షించాలని అన్నారు. యునెస్కో నిబంధనలు పాటించడంతోపాటు స్థానిక నిబంధనలను అమలు చేయాలని పేర్కొన్నారు. రామప్ప దేవాలయ పరిది శివాలయం, గొల్లల దేవాలయమునకు కాంపౌండ్‌వాల్ నిర్మించాలని, భైరవ దేవాలయాన్ని అభివద్ధి పనులను ప్రారంభించాలని ఆదేశించారు. రామప్పలోని హెలిప్యాడ్ ఏరియాలోని పార్కింగ్ స్థలం లో షాప్ లు ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాలంపేట గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుటకు అధికారులు కషి చేయాలని అన్నారు. రాష్ట్ర జలవనరుల అభివద్ధి సంస్థ చైర్మన్ వి ప్రకాష్ మాట్లాడుతూ.. రామప్ప దేవాలయానికి ప్రతిరోజు వందల సంఖ్యలో భక్తులు వస్తున్నారని వారికి రవాణా ఇబ్బంది అవుతున్నందున హైదరాబాదు నుండి గానీ హనుమకొండ నుండి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం బస్సు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ వరంగల్ ఆర్టీసీ ఆర్ఎంతో చర్చించి చర్యలు తీసుకొననున్న ట్లు తెలిపారు. ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ జీఎం బి శ్రీనివాసరావు, జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ వై వి గణేష్, సూపర్ ఇండెంట్ ఏఎస్ఐ హైదరాబాద్ డాక్టర్ స్మిత ఎస్ కుమార్, ఇరిగేషన్ ఈ ఈ పి వెంకట కష్టారావు, జిల్లా టూరిజం అధికారి శివాజీ, ఏడి హెరిటేజ్ మల్లు నాయక్, టూరిజం ఏఎస్ఐ మల్లేశం, వెంకటాపూర్ తహసిల్దార్ పి మంజుల, కలెక్టరేట్ ఏవో విజయభాస్కర్, సూపరింటెంట్ విశ్వ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




10వ తరగతి విద్యార్థుల అంతర్గత మూల్యాంకనం

నవతెలంగాణ-వెంకటాపురం



జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలమేరకు మండల పరిధిలోని 10వ తరగతి విద్యార్థుల అంతర్గత మూల్యాంకనం పత్రాల పరిశీలన కార్యక్రమం బుధవారం చేపట్టారు. జిల్లాపరిషత్ ప్రాథమిక పాఠశాల, కేజీబీవీ, ఏజిహెట్, భారతి విద్యానికేతన్ పాఠశాలలను అధికారుల బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో అలుబాక ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, గుణ, శేషనరసింహారావు, జయరాం హాజరై విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు.



అనుదినం జనస్వరం

నవతెలంగాణ



2 జయశంకర్-భూపలపల్లి, ములుగు, హనుమకొండ

గురువారం 02 మార్చి 2023

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి:

నవతెలంగాణ-ఐనవోలు

మండలంలోని ఉడుత గూడెం గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ బరిగేల ఆరోగ్యం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. జడ్పీ వైస్ చైర్మన్ గజ్జల శ్రీరాములు హాజరై మాట్లాడారు. కంటి వెలుగును అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెరుగు కిరణ్‌కుమార్, పార్టీ గ్రామ అధ్యక్షులు తోట రాజేంద్రప్రసాద్, వార్డ్ సభ్యులు తాటికాయల ఆనందం, మిద్దపాక నాగమణి, చిదురాల మమత, బరిగెల కుమారస్వామి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కేటీపీపీ ఉద్యోగుల సమ్మె @ 6వ రోజు

నవతెలంగాణ-గణపురం

కేటీపీపీ ఉద్యోగులు తమ వేతన సవరణ-2022 కోసం చేస్తున్న ఆందోళన ఆరవరోజు బుధవారం కూడా కొనసాగింది. కేటీపీపీ ఉద్యోగులు, కార్మికులు, ఇంజనీర్లు, ఆర్టిషన్లు భారీ సంఖ్యలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేటీపీపీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఉద్యోగులకు వేతన సవరణ-2022 వెంటనే అమలు చేయకుంటే తెలంగాణ స్టేట్ పవర్ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ఆలయ అభివద్ధికి కృషి చేయాలి : శ్రీధర్‌రావు

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

31 డివిజన్ పరిధి శ్రీ అభయాంజనేయ స్వామి కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలని శ్రీ అభయాంజనేయ స్వామి కాలనీ అధ్యక్షుడు పెరుకూరి శ్రీధర్‌రావు కోరారు. బుధవారం హన్మకొండలోని సర్క్యూట్ గెస్ట్ హౌస్‌లో చీఫ్‌విప్, ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో కొండ ప్రాంతమైన ప్రభుత్వ అసైన్డ్ భూమి దాదాపు రెండు ఎకాలు ఉందని అన్నారు. అభయాంజనేయ స్వామి దేవస్థానం అభివద్ధికి, కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణంకు ఆ స్థలం కేటాయించాలని కోరారు. కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన చీఫ్‌విప్ సమస్యలు పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో, సంబంధిత అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నర్సింగ్, కత్తి రమేష్ ఓమ ప్రకాష్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

'సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

నవతెలంగాణ-గణపవరం

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అభినవ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పోలిస్‌స్టేషన్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అపరిచిత వ్యక్తులు మాయమాటలు చెప్పి బోల్తా కొట్టే ప్రయత్నం చేస్తారన్నారన్నారు. వాటికి దూరంగా ఉండాలన్నారు. సెల్ ఫోన్‌కు ఏదైనా మెసేజ్ వస్తే వాటిని క్లిక్ చేయవద్దని క్లిక్ చేస్తే మీ ఓటిపి ని అడిగి అకౌంట్లో ఉన్న డబ్బులను ఖాళీ చేసే అవకాశం ఉందన్నారు. అపరిచిత మెసేజ్‌లు, లింక్‌లు క్లిక్ చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రతన్ సింగ్, పోలీసులు శ్రీవిద్య, నేతాజీ, సతీష్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్ : మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో, పలిమెల మండలం సర్వాయిపేట పాఠశాలలో ఎస్ఐ లు అరుణ్చ భవాని సేన్ ఆధ్వర్యంలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీ చెప్పవద్దని, మోసపూరిత సందేశం నమ్మి గుర్తుతెలియని వ్యక్తులకు ఆధార్ బ్యాంకు వివరాలు తెలియజేవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 కి కాల్ చేయాలని సూచించారు. పోలీసులు, పాఠశాల హెచ్‌ఎం ఆకుల అశోక్, ఉపాధ్యాయులు, సిఆర్పిఎఫ్ పోలీసులు విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్లం పానకం ధ్వంసం

నవతెలంగాణ-మహదేవపూర్

పలిమెల మండలంలోని సర్వాయిపేటలో బుధవారంఎస్సై అరుణ్ ఆధ్వర్యంలో బెల్లం పానకం ధ్వంసం చేసి గుడుంబా సీజ్ చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు సర్వాయిపేటలోని దుర్గం లింగమూర్తి ఇంట్లో తనిఖీలు నిర్వహించగా తయారు చేస్తున్న గుడుంబాను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం జరిగింది. తనిఖీలలో సుమారు 400 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వసం చేయడం జరిగింది. పది లీటర్ల గుడుంబాను సీజ్ చేసి వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలలో స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

బైరి నరేష్‌కు రక్షణ కల్పించాలి : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

హేతువాది, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు బైరి నరేష్‌పై బీజేపీ, దాని అనుబంధ సంస్థల కార్యకర్తలు మూకుమ్మడిగా పోలీస్ వాహనంలోకి చొరబడి విచక్షణారహితంగా దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని, నరేష్‌కు రక్షణ కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దోగ్గెల తిరుపతి కోరారు. బుధవారం హనుమకొండ రాంనగర్ సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో తిరుపతి మాట్లాడారు. తమ సిద్ధాంతాల నమ్మకాలను చట్టానికి లోబడి ప్రచారం చేసుకునే హక్కు పౌరులకు రాజ్యాంగం కల్పించిందన్నారు. పోలీస్ సిబ్బంది రక్షణతో పోలిస్ వాహనంలో ఉండగానే, వాహనాన్ని అడ్డగించి నరేష్‌పై దాడి చేయడం దుర్మార్గమన్నారు. మతోన్మాదుల రాష్ట్రంలో ప్రశాంత వాతావరణానికి భంగం కల్గించే ఈ తరహా దాడులను ప్రజాస్వామ్యవాదులంతా ప్రతిఘటించాలన్నారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యల పట్ల క్షమాపణ కూడా కోరినా దాడికి పూనుకోవడం సరికాదన్నారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నోముల కిషోర్, జిల్లా ఉపాధ్యక్షులు మంద సుచందర్, జిల్లా సహాయ కార్యదర్శిలు వేలు సుమన్, ఓర్సు చిరంజీవి, యం. సురేష్, విజయ్‌కుమార్, హర్ష సతీష్, అశోక్, ప్రసాద్, నాగరాజు, రాజు, మురళి పాల్గొన్నారు.

ధరల పెంపుతో మోయలేని భారాలు :సీపీఐ

నవతెలంగాణ-హనుమకొండ

గ్యాస్ ధరలు పెంచి సామాన్యులపై మోయలేని భారం మోపుతున్నారని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి,రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి అన్నారు. పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని కోరుతూ బుధవారం కాళోజి సెంటర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు గ్యాస్ ధర రూ.340 ఉంటే ప్రస్తుతం రూ.1125కు చేరిందని, రూ. 1200 చెల్లించే స్థితికి రావడం ప్రధాని నరేంద్ర మోడీ పనితీరుకు నిదర్శనం అన్నారు. అధికారంలోకొస్తే 100 రోజులలో నిత్యాసరాల ధరలు నియంత్రించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రగల్భాలు పలికి ధరలు నిరంతరం పెంచుతూ ఆర్థికభారాలు మోపుతోందన్నారు. కార్పొటు శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించుంటే గత పాలకులకు పట్టిన గతి బీజేపీకి పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా సమితి సభ్యులు జక్కు రాజు గౌడ్,కొట్టెపాక రవి, మాలోతు శంకర్, రాస మల్ల దీనా, కండె నరసయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి సంతోష్, రవితేజ, యువజన జిల్లా కన్వీనర్ ప్రశాంత్ యాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భూ కబ్జాలు ఆధారాలతో సహా నిరూపిస్తా

- నేడు ఉదయం 11 గంటలకు అంబేద్కర్ సెంటర్ వద్ద బహిరంగ చర్చకు సిద్ధం
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణరావు



నవతెలంగాణ-భూపాలపల్లి

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి భూ కబ్జాలు, అవినీతి, అక్రమాలను ఆధారాలతో సహా నిరూపిస్తానని, తన సవాల్ కు సిద్ధమని, నేడు ఉదయం 11 గంటలకు స్థానిక అంబేద్కర్ సెంటర్‌కు బహిరంగ చర్చకు సిద్ధమని టీపీసీసీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జీ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అవినీతిపరున్ని కాదని నిరూపించుకోవడానికి తన సవాల్‌ను స్వీకరించి అంబేద్కర్ సెంటర్ కు రావాలని అన్నారు. రేవంత్ రెడ్డి ఈ చర్చకు రాడు ఇద్దరమే వస్తాం... గండ్ర దంపతులిద్దరే రావాలని, అక్కడ అన్నీ మీడియా ముందే తేల్చుకుందామని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే అనుచరులు పనికట్టుకొని అధికార దురాహంకారంతో ఎమ్మెల్యే అనుచరులు ఫ్లెక్సీలు కటౌట్లు తీయకుండా మున్సిపల్ అధికారులను ఒత్తిడి చేశారన్నారు. కాంగ్రెస్ నాయకులు కటౌట్ కడుతుంటే వచ్చి దాడి చేయడం అత్యంత దుర్మార్గమని అన్నారు. మున్సిపల్ అధికా రులు పోలీసులు ఎమ్మెల్యేకు వత్తాసు పలుకుతూ కావాలనే గొడవపడ్డారన్నారు. రేవంత్ రెడ్డి పాదయాత్రలో అల్లర్లు సృష్టించి రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేయించారన్నారు. హరీష్ రావు, కవిత, కేటీఆర్ వచ్చినపుడు కాంగ్రెస్ నాయ కులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ లో ఉంచారని అన్నారు. మరి బీఆర్ఎస్ నాయకులు దాడి చేస్తారని పోలీసులకు సమాచారం ఉన్న పోలీసు అధికారులు ఎందుకు వారిని ముందస్తుగా అరెస్టు చేయలేదని మండిపడ్డారు. దాడిలో ఎస్ఐకి గాయాలు అయిన తమ కార్యకర్తలపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేశారని అన్నారు. దాడులు గనుక చే యాలనుకుంటే నియోజకవర్గంలో మీరు తిరగలేరని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో జరిగిన రేవంత్ రెడ్డి సభ సందర్భంగా బీఆర్ఎస్ కటౌట్లను తీసివేయాలని మున్సిపల్ అధికారులను కోరినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ఇదే విషయాన్ని జిల్లా ఎస్పీ, డిఎస్పి, సిఐలకు తెలిపామన్నారు. అయినా పట్టించుకోకుండా దాడి చేయించారని ఆరోపిం చారు. ఇకనైనా వారి పద్ధతి మార్చుకోవాలని పార్టీలకు అతీతంగా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రేగొండ మండలం రామన్నగూడెం తండా గ్రామ వాసి చందు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని తక్షణ సాయం కింద రూ.లక్ష అందజేశారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యులు చల్లూరి మధు, కౌన్సిలర్ దాట్ల శ్రీను, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పిప్పాల రాజేందర్, బుర్ర కొమురయ్య, అంబాల శ్రీను, ఉడుత మహేందర్, తోట రంజిత్, రజినీకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వసతి గృహ సమస్యల పరిష్కారానికి కృషి : డీఆర్డీఓ

నవతెలంగాణ-గోవిందరావుపేట



మండల కేంద్రంలోని బాలికల వసతి గృహ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ములుగు జిల్లా డీఆండీఓ నాగ పద్మజ అన్నారు. పల్లె నద్రలో భాగంగా మంగళవారం రాత్రి వసతి గృహంలో విద్యార్థినిలతో బస చేశారు. బుధవారం ఉదయం వార్డెన్ సరితతో కలిసి వసతి గృహ పరిసరాలను పరిశీలించి సమస్యలను వార్డెన్ సరిత, సర్పంచ్ లక్ష్మితో కలిసి అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులను పిలిచి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తీర్ణత సాధించి ఉత్తమంగా రాణించాలన్నారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్. పంచాయతీ కార్యదర్శి శంకర్ సిబ్బంది పద్మజ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ ప్రదేశాలను ఎంపీడీఓ సందర్శన

నవతెలంగాణ-మహదేవపూర్



మహదేవపూర్ మండలంలోని కుదురుపల్లి, ఎడపల్లి గ్రామ పంచాయతీలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధుల కింద ఏర్పాటు చేసిన నర్సరీ ప్రదేశాలను బుధవారం ఎంపీడీవో ఏం శంకర్‌నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలో పాలితిన్ బ్యాగులో విత్తిన విత్తనాలలో కొన్ని మొలకెత్తనందున మార్కెట్లో లభ్యం అయ్యే విత్తనాలను కొనుగోలు చేసి తిరిగి విత్తాలని సూచించారు. నర్సరీ టార్గెట్ మేరకు 100శాతం మొక్కలు పెంచే విధంగా గ్రామపంచాయతీ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నర్సరీలో మొక్కలకు ప్రతిరోజు రెండుమార్లు వాచర్ సహాయంతో నీరును పట్టించాలని అన్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రమవుతున్నందున మొక్కలపై షేడ్ నెట్ ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఎడపెల్లి, కుదురుపెల్లి పంచాయతీ కార్యదర్శి ఇందిరా, ఏపీఓ రమేష్, వనసేవకులు, తదితరులు పాల్గొన్నారు.

'వాణి విద్యానికేతన్'లో ఘనంగా స్వయం పరిపాలనా దినోత్సవం

నవతెలంగాణ-రేగొండ



మండల కేంద్రంలోని వాణి విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవంను విద్యార్థులు ఘనంగా జరుపుకు న్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులే విద్య బోధకులుగా మారి వివిధ పాఠ్యాంశాలను తోటి విద్యార్థులకు బోధించారు. డీఈఓగా గాజర్ల హర్షిత్‌గౌడ్, డిప్యూటీ డీఈఓగా మహమ్మద్ సమ్రీన్, ప్రధానోపాధ్యాయులుగా సాధనపల్లి సుశాంత్ వ్యవహరించారు. అనంతరం విద్యార్థి ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పడే కష్టాలను తాము ఈ కార్యక్రమంతో తెలుసుకున్నామన్నారు. అనంతరం పాఠశాల మేనేజ్మెంట్ అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్వు రజిని కుమార్, ఉపాధ్యాయులు రవిందర్, దేవేందర్, సుమన్, శోభన్, ఐలయ్య, మాలత, సంధ్య, చైతన్య, షైమ, కవిత, శతి, ఉజ్వల పాల్గొన్నారు.

డాక్టర్ ప్రీతి, రక్షిత మృతి కారకులను శిక్షించాలి

- బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బోట్ల కార్తీక్

నవతెలంగాణ - ములుగు



డాక్టర్ ప్రీతి, రక్షిత మరణాలకు కారకులైన వారిని వెంటనే శిక్షించి ఎన్కౌంటర్ చేయాలని బీఎస్పి జిల్లా అధ్యక్షులు బోట్ల కార్తీక్ అన్నారు.జిల్లా కేంద్రంలో బీఎస్‌పి ములుగు నియోజకవర్గ అధ్యక్షులు పసులాది ముఖేష్ ఆధ్వర్యంలో బుధవారం ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం కార్తిక్ మాట్లాడుతూ డాక్టర్ ప్రీతి మరణానికి కారకులైన హెచ్‌ఓడి, కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌ను ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం, సస్పెండ్ చేయకపోవడం పేదల మరణాల పట్ల ప్రభుత్వానికి పట్టింపు లేదనడానికి ఇదే నిదర్శనం అన్నారు. ఒకపక్క అంబేద్కర్ జపం చేస్తూ మరోపక్క పేద విద్యార్థుల మరణాలను చిన్నచిన్న సంఘటనలు మాత్రమే అని మంత్రి కేటీఆర్ అనడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్‌కు ఏమాత్రం పేద ప్రజల మీద ప్రేమ ఉన్న తక్షణమే ప్రీతి మరణానికి కారకులైన సైఫ్ ని ఎన్కౌంటర్ చేయాలన్నారు. జయముఖీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి రక్షిత మరణానికి కారణమైన తోటి విద్యార్థిని కూడా ఎన్కౌంటర్ చేయాలని, కళాశాలను పూర్తిగా బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ ములుగు జిల్లా ఉపాధ్యక్షులు అన్నం మోహన్ కుమార్, జిల్లా కోశాధికారి మహేష్ సురేష్, ములుగు నియోజకవర్గ అధ్యక్షులు పసులాది ముఖేష్, జిల్లా నాయకులు జన్ను శ్రీకాంత్, బివిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

23న కొమరంభీమ్ విగ్రహం ఆవిష్కరణ

నవతెలంగాణ-కన్నాయిగూడెం



మండల కేంద్రంలో ఈనెల 23వ తేదీన కొమరం భీం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంను విజయవంతం చేయాలని తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోడం బాబు గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోడం కృష్ణా ప్రసాద్ కోరారు. బుధవారం మండలంలోని కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణ కార్యనిర్వహణ అధ్యక్షుడు ఆలం రాంబాబు ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. కొమరం భీమ్ జంగిల్ జమీన్ అనే నినాదంతో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకం గా ఆదివాసీల హక్కుల చట్టాల అమలుకై కొమరం భీమ్ పోరాడారని అన్నారు. ఈ కార్యక్రమంలో అలెం ప్రభాకర్ ,మురళి యాలం, బొగ్గం బాబు, పీర్ల శ్రీనివాస్ పీర్ల ప్రవీణ్ ఆలయం నాగేష్ వాసం మధుకర్ కోరం,సమ్మయ్య కోరగట్ట నాగేష్ ,గుండ్ల పాపారావు తూరం చుక్కారావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మయ్యనాయక్‌కు డాక్టరేట్

నవతెలంగాణ-భూపాలపల్లి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గిద్దెముత్తారం గ్రామానికి చెందిన శీలోకు సమ్మక్క లచ్చునాయక్ దంపతులు కుమారుడు శీలోతు సమ్మయ్య నాయక్‌కు జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సి టీ(జేఎన్టీయు) గౌరవ డాక్టరేట్ పట్టాను అందజేసింది. జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్శిటిలో ఎంటెక్ పూర్తి చేసి, అదే జేఎన్టీయూలో ప్రొఫెసర్ డాక్టర్ గోపాల్ ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స అండ్ ఇంజనీరు విభాగంలో సమ్మయ్యనాయక్ పరిశోధన చేశారు. జేఎన్టీ యూలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజీనీరు విభాగంలో డాక్టర్ గోపాల్ రావు చేతులు మీదుగా బుధవారం గౌరవ డాక్టరేట్ పట్టాను పొందారు. సమ్మయ్య నాయక్‌ను భార్య శీలోతు రాజేశ్వరి, బంధువులు లక్ష్మీ, రాకేష్, డాక్టర్ భూక్య శంకర్ నాయక్, మిత్రులు భూపాలపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు పానుగంటి హరీక శ్రీనివాస్, భానోతు రజితా జుమ్మలాల్, తోట రమేష్, శ్రీనాథ్ రెడ్డి, ప్రసన్న, డాక్టర్ స్వర్ణలత, లక్ష్మణ్ రావు, శంకర్ అభినందించారు.



పట్టా సర్టిఫికెట్లు అందజేత

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండలంలోని 4 గురు లబ్దిదారులకు జీఓ-58 కింద ప్రభుత్వ భూముల్లో 125 గజాల లోపు స్థలంలో కట్టుకున్న నివాస గృహాలకు బుధవారం రిజిస్ట్రేషన్ పట్టా సర్టిఫికెట్లు ఎంపీపీ రాణి బాయ్ సహకార బ్యాంకు చైర్మన్ తిరుపతిరెడ్డి, కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ పద్మ డిప్యూటీ తాసిల్దార్ కృష్ణ అందజేశారు. ఇందులో మహాదేవపూర్‌లో ఇద్దరికీ కాళేశ్వరంలో ఇద్దరికీ ఇచ్చినట్టు డీటీ తెలిపారు.

రేవంత్ రెడ్డి సభకు వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఒకరుమృతి
- మరొకరి పరిస్థితి విషమం

నవతెలంగాణ-గణపురం

భూపాలపల్లిలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపట్టిన బహిరంగసభకు హాజరై ఇంటికి వస్తున్న క్రమంలో కారు బైక్ ఢీకొని బాదావత్ చందు (32) అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గాంధీనగర్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం రేగొండ మండలం రామన్న గూడెం తండాకు చెందిన బాదావత్ చందు, ఇస్లావత్ శ్రీను ఇద్దరు ద్విచక్ర వాహనంపై రేవంత్ రెడ్డి. సమావేశానికి హాజరయ్యారు. రాత్రి ఇంటికి వెళుతున్న క్రమంలో గాంధీనగర్ గ్రామానికి రాగానే అతివేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనానికి ఢీకొట్టింది. దీంతో చందు, శ్రీను కింద పడగా అప్పుడే మిరప లోడుతో వస్తున్న బొలోరో వాహనం చందుపైనుండి వెళ్లడంతో చందు అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు శ్రీనును వరంగల్ తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

గండ్ర దంపతుల సహకారంతో అభివృద్ధి : సర్పంచ్ బి రమేష్

నవతెలంగాణ - శాయంపేట

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ చైర్పర్సన్ గండ్ర జ్యోతి సహకారంలో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు సర్పంచ్ భూక్య రమేష్ అన్నారు. మండలంలోని సూర్య నాయక్ తండాలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులను బుధవారం సర్పంచ్ రమేష్ ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ. 10 లక్షలతో సిసి రోడ్లు, రూ.20 లక్షలతో జీపీ భవన నిర్మాణానికి మంజూరు చేసి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. గ్రామంలో పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డ్, స్మశాన వాటిక, గ్రామ నర్సరీ, క్రీడా ప్రాంగణం నిర్మించినట్లు తెలిపారు. సిసి రోడ్లు, సైడ్ కాలువలు, గ్రావెల్ రోడ్ల నిర్మాణం చేపట్టి ఇబ్బందులు తొలగిస్తామన్నారు. మాజీ ఎంపిటిసి రెడ్యానాయక్ పాల్గొన్నారు.



ప్రభుత్వ గుర్తింపు కార్డు తప్పనిసరి

- ఎన్నికల అధికారి విజయభాస్కర్ రెడ్డి

నవతెలంగాణ - శాయంపేట

పెద్దకోడపాక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునే సంఘ సభ్యులు విధిగా ప్రభుత్వ గుర్తింపు కార్డు తీసుకొని రావాలని ఎన్నికల అధికారి విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దకోడపాక గ్రామంలోని రైతు వేదిక లో గురువారం నిర్వహించనున్న మత్స్య సొసైటీ ఎన్నికల కోసం బుధవారం సిబ్బంది పోలింగ్ బూతులు తయారు చేయగా ఆయన సందర్శించి పరిశీలించి మాట్లాడారు. మత్స్య సొసైటీలో 13 గ్రామాల నుండి 1166 మంది సంఘ సభ్యులు ఉన్నట్లు తెలిపారు. 9 డైరెక్టర్ల స్థానాల కోసం 39 మంది అభ్యర్థులు బరిలో నిలిచినట్లు తెలిపారు. ఈనెల 2న ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1:00వరకు ఎన్నికలు నిర్వహించి, మధ్యాహ్నం ఒకటిన్నర నుండి ఓట్ల లెక్కింపు చేసి ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు. దీని కోసం నాలుగు పోలింగ్ బూతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటింగ్ వినియోగించుకునే సభ్యులు సొసైటీ గుర్తింపు కార్డు, ఆధార్, ఓటర్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, పట్టా పాస్ పుస్తకం జిరాక్స్, డ్రైవింగ్ లైసెన్స్, ప్రభుత్వం జారీ చేసిన 17 రకాల గుర్తింపు కార్డులో ఏదైనా ఒకటి తీసుకొని రావాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో కోవిడ్ నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఒక్కో ఓటరు బ్యాలెట్ పేపర్లో తొమ్మిది అభ్యర్థులపై గుర్తులు పెట్టాలని, 9 కంటే ఎక్కువ గుర్తులు పెట్టినట్లయితే ఆ ఓటు చెల్లదని తెలిపారు. మత్స్య సొసైటీ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సంఘ సభ్యులు సహకరించాలని ఆయన కోరారు.




31డివిజన్‌లో ఎసీఎంహెచ్ఓ పర్యటన

నవతెలంగాణ-సుబేదారి

జీడబ్ల్యూఎంసీ పరిధి 31డివిజన్‌లో బుధవారం నూతన సీఎంహెచ్‌వో రాజేష్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు మాట్లాడుతూ డివిజన్ లోని కాలనీలు పరిశుభ్రతగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. తడి, పొడి చెత్త సేకరణ, దోమల నివారణ తదితర సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది కల్గకుండా చూసుకోవాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. డివిజన్‌కు వచ్చిన నూతన సీఎంహెచ్ఓ రాజేషను కార్పొరేటర్ రాజు సత్కరించారు. శానిటైజర్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, డివిజన్ జవాన్ ఇంద్రసేన , మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

10/10 జీపీఏ సాధించాలి : మండల ప్రత్యేక అధికారి

నవతెలంగాణ-మంగపేట



ఉపాధ్యాయుల ప్రత్యేక తరగతుల ద్వార పదవతరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించాలని మండల ప్రత్యేక అధికారి తుల రవి అన్నారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల్లో అర్హులైన ఉపాధ్యాయులు ఇచ్చే ప్రత్యేక శిక్షణ ద్వారా విద్యాబోధన చేస్తూ వార్షిక పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించాలన్నారు. ఉపాధ్యాయులు వసతి గృహాల్లోని విద్యార్థులకు మెను ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. ఇంచార్జ్ ఎంపీడీఓ పి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రాజేందర్, ప్రధానోపాధ్యాయుడు కల్తి శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజశేకర్, సంపత్, జవహర్ లాల్, వార్డెన్ అశోక్ పాల్గొన్నారు.

'మానేరు మీదుగా ఆర్టీసీ బస్సు నడపాలి'

నవతెలంగాణ-మల్హర్‌రావు

పేద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి టూ మండల కేంద్రమైన తాడిచెర్ల మానేరుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తిస్థాయిలో అయినందున మంథని నుంచి వయా ఖమ్మంపల్లి బ్రిడ్జి మీదుగా తాడిచెర్ల,మల్లారం,పెద్దతూండ్ల గ్రామాల వరకు ఆర్టీసీ బస్సును నడిపించాలని మండల యూత్ కాంగ్రెస్ నాయకులు బొబ్బిలి రాజు గౌడ్, ఆర్ని ఉదయ్ పటేల్ కోరారు. బుధవారం ఎంపీపీ చింతలపల్లి మల్హర్ రావు ఆదేశాల మేరకు మంథని డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఖమ్మంపల్లి మీదుగా బస్సును నడపడం ద్వారా ప్రయాణికులకు దూరభారం తగ్గుతుందని వారు తెలిపారు.

చేనేత శిక్షణ శిబిరాన్ని నాబార్డ్ అధికారుల సందర్శన

నవతెలంగాణ-మహదేవపూర్



మహదేవపూర్ మండల కేంద్రంలో తస్సరు కాలనీలోచేనేత కార్మికులకు ఏర్పాటుచేసిన శిక్షణ కేంద్రాన్ని నాబార్డ్ అధికారులు బుధవారం సందర్శించారు ఇక్కడ ఏర్పాటు చేసిన నేషనల్ కలర్ డిజైనింగ్ మంజూరు చేసిన నూతన షెడ్లను పరిశీలించారు. ఇక్కడ జరుగుతున్న కార్యక్రమాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. డీజీఎం సోమ సుందరం, ఏజీఎం చంద్రశేఖర్, సొసైటీ అధ్యక్షులు గొర్రె బాబు, ఇతర అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి ముగ్గు..

నవతెలంగాణ-వేలేరు



మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో బీరప్ప గుడి నిర్మాణం కోసం దస్తరి వంశీ, వారి తల్లి ఉమ రెండు గుంటల భూమిని వంశీ తండ్రి దస్తరి రవీందర్ తండ్రి పెద్ద రాజయ్యల స్మారకార్థంగా ఇచ్చారు. బుధవారం గొల్ల కురుమ కులస్థుల సమక్షంలో గుడి నిర్మాణానికి ముగ్గు పోశారు. అడగగానే రెండు గుంటల భూమి ఇచ్చిన వంశీ దంపతులను, వంశీ తల్లి ఉమను గొల్ల, కురుమ కులస్థులు సన్మానించి ధన్యవాదాలు చెప్పారు. సర్పంచ్ గూడ కవితా-రాజ్ కుమార్, ఉపసర్పంచ్ అల్లం సతీశ్, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు నాగులమ్మ మహాజాతర ఆహ్వానం

నవతెలంగాణ - ములుగు



జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్యను బుధవారం శ్రీ రామ కృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగ రమేష్ ట్రస్ట్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలసి పూల బొకే అందజేశారు. అనంతరం మంగపేట మండలం రాజుపేట (లక్ష్మీ నర్సాపురం)లో మార్చి 7 నుంచి 11 వరకు అంగరంగ వైభవంగా జరిగే శ్రీ నాగులమ్మ మహా జాతరకు రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాడిశ నవీన్, ఆదినారాయణ,ఇందారపు రమేష్,జానపట్ల జయరాజు,మునిగేల మహేష్,కనుకుంట్ల నాగరాజు,బోడ ప్రవీణ్, పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎంపీపీ



నవతెలంగాణ-సంగెం

మండలంలోని వీఆర్ఎన్ తండాలో ఎంఎన్ఆర్ఇజిఎస్ పథకంలో భాగంగా 20 లక్షలతో నూతన సీసీ రోడ్డు పనులను ఎంపీపీ కందగట్ల కళావతి నరహరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో రోడ్లకు బీఆర్ఎస్ హయంలోనే మహర్దశ వచ్చిందని అన్నారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కృషితో మండలంలో అనేక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. మండలంలో ప్రతీ గ్రామంలో సిమెంట్ రోడ్లు వేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గుగులోతు బిచ్చు నాయక్, కక్కెర్ల కుమారస్వామి, ఎంపీటీసీ గుగులోతు వీరమ్మ, గ్రామ పార్టీ అధ్యక్షుడు వీరన్న, గ్రామ రైతు కోఆర్డినేటర్ జలంధర్, గోపిసింగ్, వార్డు సభ్యులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి ఇంటర్నల్ మార్కుల పరిశీలన



నవతెలంగాణ-చెన్నారావుపేట

మండల కేంద్రంలోని సిద్ధార్థ, గుడ్ షెఫర్డ్ పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి వి.రత్నమాల ఆధ్వర్యంలో మండల ఇంటర్నల్ టీం ఫ్లోరెన్స్, పాపమ్మ బృందం పదవ తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులకు సంబంధించిన ఫార్మటివ్, కో-కరికులర్ రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులుకు పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ నెల 8 వరకు ఇంటర్నల్ మార్కుల వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నల్ టీం సభ్యులు రవి, జగన్మోహన్, ఇంద్ర కరుణాకర్ రెడ్డి, సంతోష్ కుమార్, రవీందర్, ప్రిన్సిపాల్ కరుణాకర్ రెడ్డి,జోసెఫ్, ఉపాధ్యాయులు జగదీష్, రమేష్, రవీందర్, విష్ణు, చారి, ప్రదీప్, రోజా, వేణు, భద్రు, శ్రీనివాస్, గణేష్, సీఆర్పీలు సంపత్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ వారోత్సవాలను జయప్రదం చేయండి

పీఓడబ్ల్యు పిలుపు



నవతెలంగాణ-మహబూబాబాద్

స్త్రీ పురుష సమానత్వం కోసం మనువాదానికి వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని పిఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన పోయిన అనసూయక్క పిలుపు నిచ్చారు. పిఓడబ్ల్యూ జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారంమహబూబాబాద్ పట్టణంలోని బట్టు అంజయ్య భవనంలో జిల్లా ఉపాధ్యక్షురాలు మంద పద్మక్క అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అనసూయక్క మాట్లాడుతూ 1910లోక్లారా జెట్కిన్ నాయకత్వంలో జరిగిన రెండవ అంతర్జాతీయ సోషలిస్టు మహిళ మహాసభలో ఈ అంశాన్ని చర్చించి 1908 మార్చి 8 నాటి ఆ పోరాట సందేశాన్ని స్ఫూర్తిని ప్రపంచమంతా వ్యాప్తి చేసే లక్ష్యంతో ఆ రోజుని అంతర్జాతీయ మహిళా పోరాట దినంగా ప్రకటించిందని అన్నారు.అదేస్ఫూర్తితో పురుష ఆధిపత్య స్త్రీ కరుణకు వ్యతిరేకంగా మార్చి ఒకటి నుండి 8 వరకు వారోత్సవాలను జరపాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బొల్లం సోమక్క, సామ రజిత, ఎండి కవిత, దర్గాక్క, రమణమ్మ, సారు కవిత తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

సీఐటీయూ జిల్లా నాయకులు బొల్లం అశోక్, ఇసంపల్లి సైదులు



నవతెలంగాణ-తొర్రూరు

అంగన్వాడి సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా నాయకులు బొల్లం అశోక్, ఇసంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం తొర్రూర్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి వివేకానంద సెంటర్ మీదుగా బస్టాండ్ వరకు పెద్ద వంగర, నెల్లికుదురు, తొర్రూర్ మండలాల పరిధిలో ఉన్న అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్లో మానవహారం చేశారు. అనంతరం వారిని ఉద్దేశించి బొల్లం అశోక్, సైదులు, అంగన్వాడి యూనియన్ నాయకురాలు పసుల స్వరూపలు మాట్లాడారు. ఎన్నికల ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలకు అనేక హామీలు ఇవ్వడం జరిగిందని వాటిని నేటికీ అమలుపరచడంలో మాత్రం ప్రభుత్వాలు విఫలమయ్యాయని వారు ఆరోపించారు. గత 40 సంవత్సరాలుగా ఐసిడిఎస్‌లో పని చేస్తూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్న వీరికి కనీస వేతనం పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలు ఏవి ప్రభుత్వం కల్పించలేదని ఈ సందర్భంగా వారు గుర్తుకు చేశారు. మన పక్కనే ఉన్న రాష్ట్రాలు అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారు. అదేవిధంగా హెల్త్ కార్డులు ఇస్తున్నారు. కేరళ రాష్ట్రంలో రిటర్మెంట్ బెనిఫిట్స్,పెన్షన్, పండగ బోనస్ తదితర సౌకర్యాలు కూడా కల్పిస్తున్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం అంగన్వాడీల పట్ల నిర్ల క్ష్యం వహిస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను ఏర్పాటు చేసిందని, అది కార్మికుల పట్ల గుదిబండగా తయారయ్యాయని వారన్నారు. ఇప్పటికే ఐసిడిఎస్‌కు నష్టం కలిగించే జాతీయ నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి, ఐసిడిఎస్‌కు నిధులు తగ్గించి అంగన్వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఉందని, ఇలాంటి చర్యలు మానుకొని ఐసిడిఎస్‌ను రక్షించాలని, అంగన్వాడీలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని లేనియెడల సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు అందరినీ కలుపుకొని పెద్దఎత్తున ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని వారు ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాలు సుకన్య, యాకలక్ష్మి, పద్మారాణి, శైలజ, సరస్వతి, వీరలక్ష్మీ, సరోజ, మంజుల, సుభద్ర, మనోదర, అలివేలు, రజిత, వసంత, లీలావతి, ప్రమీల, జ్యోతి, సరళ, లక్ష్మి, సుకన్య రాజేశ్వరి, సిఐటియు నాయకులు జమ్ముల శ్రీను, ఎండీ యాకుబ్, యాకన్న, సుమన్, అమీర్ పాల్గొన్నారు.

వైయస్సార్ విగ్రహాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

ముత్తినేని సోమేశ్వరరావు టీపీసీసీ మాజీ సభ్యులు



నవతెలంగాణ-తొర్రూరు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని కూల్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టిపిసిసి మాజీ సభ్యుడు ముత్తినేని సోమేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం అవుతపురం గ్రామంలో పేదల పెన్నిధి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేయడం సిగ్గుచేటన్నారు. వైయస్సార్ అమలు చేసిన సంక్షేమ పథకాలతోనే పేదలు లబ్ధి పొందుతున్నారని అన్నారు. తెలంగాణలో సంక్షేమ పథకాలు ఉన్నాయంటే రాజశేఖర్ రెడ్డి పుణ్యమేనని, రైతులకు ఉచిత విద్యుత్, రైతులకు రుణమాఫీ చేసిన ఘనత వైయస్ రాజశేఖర్ రెడ్డిదేనని అన్నారు. పేద విద్యార్థుల చదువుల కోసం కార్పొరేట్ స్థాయి విద్య అవకాశాన్ని అందించిన మహానుభావుడు అని కొనియాడారు. పేద ప్రజల ఆరోగ్యం కోసం వారికి అండగా నిలిచి ఆరోగ్య శ్రీ ప్రవేశపెట్టి ఉచిత వైద్యం కల్పించారని తెలిపారు. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలిచారని, నిరుపేద వర్గాల అందరికీ సమానంగా ఇల్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్ల ఇచ్చిన వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడం పిరికి మాలిన చర్య అని అన్నారు. వైయస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెవిటి సధాకర్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, జిల్లా నాయకులు కందాడి అచ్చిరెడ్డి,చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, తాళ్లపెల్లి బిక్షం గౌడ్, ఓబిసి మండల అధ్యక్షుడు దీకొండ శ్రీనివాస్ గౌడ్, బీసీ జిల్లా కార్యదర్శి నల్లమాస సమ్మయ్య గౌడ్, యూత్ నాయకులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం : మాలోతు సాగర్



నవతెలంగాణ-మట్టెవాడ

అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాల జారీని వేగవంతం చేయాలని మంత్రి వర్గ ఉప సంఘం అధికారులను ఆదేశించడం చాలా సంతోషదయకంగా ఉందని సిపిఎం సాయి పేట ఏరియా కమిటీ జిల్లా కార్యదర్శి మాలోత్ సాగర్ అన్నారు. ఖిలా వరంగల్ మండల్ సిపిఎం పార్టీ రంగశాయిపేట ఏరియా కమిటీ ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పేదలకు అనుకూలమైన విధానాన్ని తీసుకోవాలని, త్వరగా పేదోళ్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. రంగశాయిపేట ఏరియా కార్యదర్శి మాలోతు సాగర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకొని ఉన్నవారందరికి పట్టాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్న ప్రభుత్వానికి ప్రత్యేకంగా సిపిఎం పార్టీ రంగశాయిపేట ఏరియా కమిటీ నుండి ధన్యవాదలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని చాలా మంది ఇండ్లు లేక కిరాయిలు కట్టలేక ప్రభుత్వ స్థలాలు జక్కాలొద్ది, బెస్తం చెరువులలో గుడిసెలు వేసుకొని పది మాసలుగా నివాసం వుంటు జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఎప్పటికైనా ప్రభుత్వం జక్కలొద్ది, బెస్తం చెరువులలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రంగశాయిపేట ఏరియా కమిటి సభ్యులు మాలోతు ప్రత్యూష, గణేపాక ఓదెలు, జ్యోతి, సాంబమూర్తి, సోషల్ మీడియా కార్యదర్శి గజ్జ చందు, శాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యునిపై మోయలేని భారం : ఎమ్మెల్యే చల్లా



నవతెలంగాణ-సంగెం

మరోసారి గ్యాస్ ధరలు పెంచిన కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై మోయలేని భారం వేసిందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు.బుధవారం మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు గ్యాస్ ధర 340 రూపాయలు ఉండేది. నేడు కేంద్ర ప్రభుత్వం పెంచడంతో 1125 రూపాయలు చేరిందని, రూ. 1200 చెల్లించే స్థితికి రావడం కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ పనితీరుకు నిదర్శనం అన్నారు. నిత్యావసరాల ధరలు నియంత్రించడంలో విఫలమైన బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఏమి మేలు చేస్తుందని ప్రశ్నించారు. నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులోకి తీసుకువస్తామని పలు బహిరంగ సభల్లో తెలపడంతో ప్రజలు సంతోషపడ్డారని, కానీ క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్నా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు నిరంతరం పెంచుతూ ప్రజల సంక్షేమం మరిచి కార్పోటు శక్తులకు ఆర్థిక విధానాలను అనుకూలంగా మలిచి ఈ దేశ సంపదను దోచిపెడుతున్నారన్నారు. సామాన్య ప్రజలు ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటే విధంగా ఉండడంతో రెండు పూటలా భోజనం చేయలేని స్థితి నెలకొందని, కోట్లాది మంది దారిద్రంతో జీవనం కొనసాగిస్తున్నా బిజెపి ప్రభుత్వం ధరలను తగ్గించక నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని, లేని పక్షంలో బిఆర్ఎస్ తరపున పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. గత పాలకులకు పట్టినగతి బిజెపికి పడుతుందని తెలిపారు.పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా ఈ నెల 3వ తేదీన అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.

ఆయిల్ ఫామ్ సాగుతో ఆర్థిక అభివృద్ధి

వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పరశురాం నాయక్



నవతెలంగాణ-పాలకుర్తి

ఆయిల్ ఫామ్ సాగుతో రైతులు ఆర్థిక అభివృద్ధితో పాటు అధిక ఆదాయాన్ని పొందవచ్చని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అజ్మీర పరశురాం నాయక్ సూచించారు. బుధవారం మండలంలోని విసునూరు గ్రామానికి చెందిన పిన్నింటి మోహన్ రావు హరిజన కాలనీ శివారులో గల తన వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటుచేసిన ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్‌ను పరశురాం నాయక్ ఆయిల్ ఫామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రైతులు వరి,మొక్కజొన్న పంటలపై సాగు చేసేందుకు దృష్టి పెడుతున్నారని తెలిపారు. వాటికి ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్ ఫామ్ ను సాగు చేసుకోవాలని సూచించారు. ఆయిల్ ఫామ్ సాగు చేసుకునే ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, బీసీ రైతులకు 90శాతం,ఇతరులకు 80శాతం రాయితీలపై మొక్కలను సరఫరా చేస్తామని తెలిపారు. ఎకరాకి 57 మొక్కల చొప్పున ప్లాంటేషన్ చేయాలని సూచించారు. ఒక్కో మొక్కకు 20 రూపాయలతో పాటు డ్రిప్పు కోసం జీఎస్టీతో నిమిత్తం లేకుండా డిడి చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు బుర్క కుమారస్వామి, కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, మండల వ్యవసాయ అధికారిని పెద్దిరెడ్డి వరలక్ష్మి, ఏఈఓ ముత్తినేని వెంకటేష్, ఏటీఎం మహేష్ రైతులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి : సర్పంచ్

నవతెలంగాణ-కొడకండ్ల

గ్రామ ప్రజలు ఇంటి పన్ను నల్ల పన్ను సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పాటు నివ్వాలని సర్పంచ్ పసునూరి మధుసూదన్ అన్నారు. బుధవారం గ్రామపంచాయతీలో సర్పంచ్ మధుసూదన్ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని సకాలములో నల్ల పన్ను ఇంటి పన్ను చెల్లించి అభివద్ధి సహకరించాలని కోరారు. బ్లాక్ ఆఫీస్ చౌరస్తా నుండి పెట్రోల్ బంక్ వరకు నాలుగు లైన్ల రోడ్డు కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందని త్వరలోనే పనులు పూర్తిచేసి రెండు నెలలు మంత్రి గారితో ప్రారంభోత్సవం చేయడం జరుగుతుందని నిధులు కేటాయించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు గ్రామపంచాయతీ పాలకమండలి పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-కొడకండ్ల

మండల కేంద్రంలోని ఒకటవ నెంబర్ అంగన్వాడి సెంటర్‌కు నిర్మించిన నూతన భవనాన్ని ఎంపీపీ ధారావజ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్ల ద్వారా గర్భిణీలకు బాలింతలకు ప్రభుత్వం పోషక పదార్థాలను అందివ్వడం జరుగుతుందని గర్భిణీలు బాలింతలుఈసెంటర్ ద్వారా అందించే పౌష్ఠికరమైన ఆహార పదార్థాలు భుజించడం వల్ల బిడ్డ ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, మార్కెట్ చైర్మన్ రాము, ఎంపీటీసీ విజయలక్ష్మి, స్థానిక సర్పంచ్ మధుసూదన్, నాయకులు అమరేందర్ రెడ్డితో పాటు టిఆర్ఎస్ నాయకులు, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కొడకండ్ల

రెండో విడత కార్యక్రమం ద్వారా ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వ నిర్వహించే ఉచిత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ధారావత్ రమాదేవి మోహన్ నాయక్ అన్నారు. బుధవారం కడగుట్ట తండా గ్రామపంచాయతీలో ఆమె రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులందరూ ఉచిత కంటి వెలుగు కార్యక్రమాన్ని చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భారతి వార్డు సభ్యులు శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించగలరు

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-బచ్చన్నపేట

గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించగలరని పిఆర్టియు జిల్లా అధ్యక్షులు మహిపాల్ రెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో హైద్రాబాద్, రంగారెడ్డి మరియు మహబూబ్ నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వఖ్యాతిథులుగా జిల్లా అధ్యక్షులు కొల్ల మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యాదర్శి నూకల ఎల్లారెడ్డి హాజరై పీఆర్టీయూ అధికారిక అభ్యర్థి శ్రీ గుర్రం చెన్న కేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలుపించాలన్నారు. పొచ్చన్నపేట, నారాయణపురం, కొన్నే, ఇటుకాలపల్లి, కట్కూరు, కొడవటూర్, కేశిరెడ్డిపల్లి హైస్కూల్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఇ.సంతోష్ కుమార్, రాష్ట్ర భాద్యులు యాదగిరి, రామ చంద్రం, రాం రెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను ప్రారంభించిన సర్పంచ్

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

కేసముద్రంస్టేషన్ గ్రామ పంచాయతీ శివారు జమలాపురం వద్ద ఉపాధి కూలీల ప్రయోజనం కొరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్న పనులను సర్పంచ్ బట్టు శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం కూలీల ప్రయోజనం కోసం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు కూలీలు ముందుకు రావాలని కోరారు. ఉపాధి పనులు కల్పించాలని కోరిన జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే పనులు జరుగుతున్న చోట కూలీలకు సరైన వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ మిట్ట గడుపుల ఆనందం, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, ఉపాసన కూలీలు పాల్గొన్నారు.

విమార్ట్ సూపర్ మార్కెట్ ప్రారంభం

నవతెలంగాణ-దంతాలపల్లి

మండల కేంద్రంలో అత్యాధునిక వసతులతో ఏర్పాటుచేసిన విమార్ట్ సూపర్ మార్కెట్‌ను బుధవారం జిల్లా వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీపీ ఉమా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు, ప్రజలకు నాణ్యమైన వస్తువులు అందుబాటులోకి తీసుకురావడానికి సూపర్ మార్కెట్‌ను ప్రారంభించడం మంచిదన్నారు. అన్ని రకాల వస్తువులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉమా మల్లారెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ వల్లాద్రి మల్లారెడ్డి, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు పెండ్యాల నరేష్, ఎంపీటీసీ నెమ్మది యాకయ్య పాల్గొన్నారు.

ప్రమాదాలపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-తొర్రూరు

ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా స్పందించాలి అన్న విషయంపై డాక్టర్ మధు, డీఎస్పీ చంద్రభానులో అవగాహన కల్పించారు. బుధవారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని ఎల్‌వైఆర్ గార్డెన్‌లో తొర్రూర్ సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో రోడ్డు సేఫ్టీ, ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే ఎలా స్పందించాలి అన్న పలు అంశాలపై వారు అవగాహన కల్పించారు. తొర్రూరు నుండి 15 మంది వాలంటీర్లకు, స్థానిక పోలీసులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు డి.ఎస్.పి రఘు బాబు, సిఐ సత్యనారాయణ, ఎస్ఐ గంగ్రాతి సతీష్, రాజు, తొర్రూరు సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

నవతెలంగాణ-జనగామ డెస్క్

మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అమరుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ లక్ష్య సాధన పోరాటంలో అమరులు చూపిన ఆచరణ, నిజాయితీ, నిబద్ధత అంకితభావం, త్యాగనిరతిలు వెలకట్టలేనివని గుర్తుచేస్తూ జాతి బావి తరాల భవిష్యత్తు కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలిపెట్టి అసువులు బాసిన మాదిగ అమరవీరుల త్యాగాలను వృథాగా పోనివ్వమని, వారి నెత్తుటి సాక్షిగా అమరుల ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణను సాధించి, జాతి అభ్యున్నతే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తామని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. వీహెచ్‌పీఎస్ మండల కన్వీనర్ గడ్డం సోమరాజు అధ్యక్షత జరిగిన ఈ నివాళి కార్యక్రమంలో ఉద్యమకారుడు జేరిపోతుల ఉపేందర్ మాదిగ పాల్గొని మాట్లాడారు. మాదిగ అమరుల ఆశయాల సాధన కోసం జాతిని ఏకం చేస్తూ కృష్ణ మాదిగ నాయకత్వంలో పాలకుల మోసాన్ని ఎండగడుతూ ఐక్యంగా ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ గ్రామ అధ్యక్షుడు గట్టగళ్ళ బాబు మాదిగ, వీహెచ్‌పీఎస్ గ్రామ గౌరవ అధ్యక్షులు కుంటి వెంకటయ్య , ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్ నేతలు రాగల్ల చంద్రశేఖర్ మాదిగ, ప్యాట మహేందర్ మాదిగ, నర్సింగ కుమార్, గట్టగళ్ళ రాజయ్య మాదిగ, ప్రభాకర్ మాదిగ, గట్టగల్ల మహేందర్ మాదిగ, ముత్యాల అజయ్ మాదిగ, గట్టగల్ల క్రాంతి మాదిగ, బిక్షపతి మాదిగ, కడవెరుగు ప్రవీణ్ మాదిగ, భాస్కర్ మాదిగ, సోమయ్య, పవన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టెవాడ : వరంగల్ తూర్పు ఎంజిఎంలో మహాజన కార్మిక యూనియన్ ఇంచార్జి చుక్క మహేందర్ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ అమర వీరులకు పూల మాలలు వేసి కొవ్వొత్తులతో నివళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ వరంగల్ తూర్పు కోఆర్డినేటర్ ఈర్ల కుమార్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సుదీర్ఘంగా 29 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ పోరాటం నిరంతరం కొనసాగిస్తూ ఈ ఉద్యమ ప్రయాణంలో ప్రాణాలర్పించిన మాదిగ అమరవీరులు 1998 సంవత్సరంలో అమరణ దీక్షలో అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం ఎర్రగుంట్లపల్లికి చెందిన తెల్లబండ్ల రవి మాదిగ తన ప్రాణాలను వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించారు. 2009 మార్చి 1 తేది నా సోనియా గాంధీ హైదరాబాద్‌కు రావడం వలన అడ్డుకోవడంతో పాటు హైదరాబాదు గాంధీభవన్‌లోకి ఎమ్మార్పీఎస్ నాయకులు వెళ్ళినారు. అందులో ఉన్నటువంటి పొన్నాల సురేంద్ర మాదిగ, దామోదర్ మాదిగ, మహేష్ మాదిగ, ప్రభాకర్ మాదిగలు గాంధీభవన్‌కి నిప్పుపెట్టి ఆ గాంధీభవన్లోనే ప్రాణాలర్పించినా మాదిగ అమరవీరులు అదేవిదంగా మళ్ళీ2017సంలో తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్‌లో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిలో భాగంగా ఓ ప్రాణం అర్పించిన వర్గీకరణ వీరవనిత భారతి మాదిగ వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించారు.వాళ్ళని స్మరించుకుంటూ మాదిగ వీరులకు జోహార్లు అర్పిస్తూ వారి యొక్క త్యాగలను వృథాకానీయం అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వల మెడలు వంచి ఎస్సి వర్గీకరణ సాధించి తిరుతామని ఈర్ల కుమార్ మాదిగ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం కార్మికుల యూనియన్ నేతలు చుక్క మహేందర్, జన్ను యాకయ్య, మంద సుమలత, సింగారపు ప్రభాకర్ మాదిగ, సిలువేరు కర్నాకర్, కుమ్మరి రాధా, సంపత్,డెక్క కుమార్, లింగమ్మ, లలిత, రాణి, సుగుణ, ఎంఎస్పీ నాయకులు కలకొట్ల గిరి మాదిగ కోట రాజు మాదిగ, జన్ను యేసేపు రాజ్, దేవునూరి రవీందర్ మాదిగ, పెండ్యాల శివ, బోట్ల శ్రీకాంత్ మాదిగ, బోట్ల నీకోన్ మాదిగ పాల్గొన్నారు.





పాలకుర్తి : అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్, పివిహెచ్పిఎస్ అనుబంధ సంఘాల నాయకులతో కలిసి బుధవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి రాష్ట్ర నాయకులు చెరిపెల్లి యాదగిరి స్వామి అమరవీరుల చిత్రపటానికి పూల మాలనేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబిసిడి వర్గీకరణ లక్ష్యసాధనలో భాగంగా అమరుల ఆశ సాధనకు కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకష్ణ ఆదేశాల మేరకు నడుచుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జలగం నరేష్, గుగ్గిల రాజు, మెడ కొమురయ్య , మంద వెంకన్న, నరసయ్య, అనపర్తి యాకయ్య, గుగ్గిల అనిల్,యాదయ్య పాల్గొన్నారు.

కొత్తగూడ : మాదిగ అమరవీరుల త్యాగాల సాక్షిగా ఏబిసిడి వర్గీకరణ సాధిస్తామని మహాజన సోషలిస్టు పార్టీ కొత్తగూడ మండల ఇంచార్జి మిడతపల్లి యాకయ్య మాదిగ అన్నారు.బుధవారం మండల కేంద్రంలో మాదిగ అమరవీరులైన సురేంద్ర మాదిగ, దామోదర్, మహేష్, ప్రభాకర్, భారతి మాదిగల చిత్రపటం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యాకయ్య మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరుల త్యాగాలు ఎంతో గొప్పవని,ఆ త్యాగాలను గుర్తుంచుకొని మాదిగ మాదిగ ఉపకులాల ప్రజలందరూ ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో పోరాడి సాధించుకోవాలన్నారు. అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయకుండా కాలయాపన చేస్తూ మాదిగలను మోసం చేస్తున్నదని విమర్శించారు. మాదిగల ఉద్యమం మహా ఉద్యమంగా మారకముందే మందకృష్ణ మాదిగను చర్చలకు పిలిచి ఎస్సీల వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి గంగారం మండల ఇంచార్జ్ తీగల ప్రేమ్ సాగర్ మాదిగ, బాల్య శంకర్, ఎం ఎస్ ఎఫ్ మాజీ మండల అధ్యక్షులు కొట్టే శ్రీనివాస్, గూడెల్లి రవి,బన్నీ, ప్రిన్స్, తీగల సజన, నాగలక్ష్మి, రేణుక ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

బీజేపీ రాష్ట్ర నాయకులు పెదగాని సోమయ్య



నవతెలంగాణ-తొర్రూరు

వరంగల్ మెడికో డాక్టర్ ప్రీతి నాయక్ మృతి పట్ల సిట్టింగ్ జడ్జితో పూర్తిస్థాయిలో న్యాయ విచారణ జరిపించాలని బిజెపి రాష్ట్ర నాయకులు పెదగాని సోమయ్య డిమాండ్ చేశారు.బుధవారం వారి స్వగ్రామం పాలకుర్తి నియోజకవర్గం మొండ్రాయి గిర్నితండాలో బిజెపి నేతలు వారి తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి పెదగాని సోమయ్య మాట్లాడుతూ ర్యాగింగ్ గురించి ఫిర్యాదు చేసిన వెంటనే ప్రభుత్వం స్పందించి ఉంటే ఇంత ధారుణం జరిగేది కాదని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్, హెచ్వోడి లు కాలయాపన చేయడం ద్వారా సమస్య మరింత జటిలం అయి ప్రీతి మరణానికి దారి తీసిందిని పేర్కొన్నారు. ఈఘటనపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి ర్యాగింగ్ పేరుతో వేధించి ఆమె మరణానికి కారకుడైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మెడికల్ విద్యార్థినిలకు రక్షణ కల్పించలేని మంత్రి హరీష్ రావు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు సుంకరనేని కోటేశ్వర్, జిల్లా నాయకులు పరుపాటి రాం మోహన్ రెడ్డి,కొడకండ్ల మండలం అధ్యక్షుడు పులిగిల్ల ఉపేందర్, తొర్రూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు పల్లె కుమార్, తొర్రూరు రూరల్ మండలం అధ్యక్షుడు బొచ్చు సురేష్, నాయకులు ధరావత్ రాయుడు, సాయి, ధరావత్ అజయ్, తదితరులు పాల్గొన్నారు.

స్వేరోస్ ఆధ్వర్యంలో ప్రీతికి ఘన నివాళులు

నవతెలంగాణ-పర్వతగిరి

ర్యాగింగ్ భూతాన్ని తరిమేద్దాం ఆడపిల్లలను కాపాడుకుందాం అనే నినాదంతో ర్యాగింగ్ భూతానికి బలైన డాక్టర్ దరావత్ ప్రీతికి స్వేరోస్ ఇంటర్నేషనల్ పర్వతగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక సర్పంచ్ చింతపట్ల మాలతి ప్రీతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చింతపట్ల మాలతి మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తు ఉన్న ఆడబిడ్డ ర్యాగింగ్ భూతానికి బలవడం చాలా బాధాకరమన్నారు. స్వేరోస్ ఇంటర్నేషనల్ వరంగల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గారే జయరాజ్ మాట్లాడుతూ ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టాలని ఆడపిల్లలను కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు చిన్నపాక శ్రీనివాస్, ఉపసర్పంచ్ రంగు జనార్ధన్, ఇస్లావత్ తండా సర్పంచ్ రమేష్, మంక్య తండా సర్పంచ్ ఈర్యానాయక్,గిరిజన సంఘం నాయకులు తేజవత్ రమేష్, బిఆర్ఎస్ మహిళా నాయకులు బరిగెల విజయ, బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు జంగిలి యాకయ్య, యువజన నాయకులు ఇస్లావత్ హరీష్, స్వేరోస్ ఇంటర్నేషనల్ పర్వతగిరి మండల అధ్యక్షుడు కాసర్ల రాజు, సీనియర్ నాయకులు భూక్య ప్రవీణ్, మచ్చ రవి, బానొత్ రమేష్, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రోత్సాహక పథకం పొడిగింపు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

దివ్యాంగులు జీవితాల్లో స్థిరపడేందుకు రాష్ట్ర దివ్యాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బ్యాంకుల ద్వారా సబ్సిడీతో ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో జనగామ జిల్లాలోని 12 మండలాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలో 13 యూనిట్లు 100శాతం రాయితీతో మంజూరు చేసినట్లు జిల్లా సంక్షేమ అధికారి జయంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 21-55 సంవత్సరాల మధ్య వయసు కలిగిన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను శిక్షించాలి

నవతెలంగాణ-కొడకండ్ల

మండలంలోని రేగుల గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడం జరిగిందని నిందితులను వెంటనే శిక్షించాలని వైఎస్ఆర్సిపి నాయకులు కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మెత్తింటి సోమేశ్వర రావు మాట్లాడుతూ పోలీసులు నిందితులను పట్టుకొని వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సురేష్ నాయక్, పాలకుర్తి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ నాయక్, బిక్షపతి, రాహుల్, వెంకటరెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుండగులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-పర్వతగిరి

పిసిసి అధ్యక్షుడి రేవంత్ రెడ్డి పై దాడికి పాల్పడిన దుండగులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి అని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు తొర్రి పద్మ డిమాండ్ చేశారు.మండలంలోని ఏనుగల్‌లో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి పై దాడి అప్రజాస్వామికమని రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీకి ఓటమి భయం పట్టుకుందని అన్నారు.రేవంత్ రెడ్డి పై కోడిగుడ్లు రాళ్ల దాడి చేసిన దుండగులను పట్టుకుని వెంటనే క్రిమినల్ కేసులు తగు చర్య తీసుకోవాలని, బిఆర్ఎస్ పార్టీకి త్వరలోనే చరమ గీతం పాడుతారన్నారు.బిఆర్ఎస్ నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, పాదయాత్ర వల్ల వచ్చే ఆదరణ చూసి ఓర్వలేకనే ఇలాంటి దాడులకు తెగబడుతున్నారని బీఆర్ఎస్ నాయకులకు ప్రజల నుండి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

గోపికి సొసైటీ చైర్మన్ పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని ఏబి తండా సర్పంచ్ మాలోతు ప్రమీల భర్త గోపి పెర్కవేడు సమీపంలో బుధవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న పర్వతగిరి సొసైటీ చైర్మన్ మనోజ్ కుమార్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం చికిత్స పొందుతున్న గోపిని పరామర్శించారు. అలాగే వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

ఆర్బీఎస్ జిల్లా డైరెక్టర్‌కు జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న పరామర్శ



నవతెలంగాణ-చెన్నారావుపేట

మండల పరిధిలోని అక్కల్ చెడ గ్రామానికి చెందిన రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్ తోటి శ్రీనివాస్ తండ్రి తూటి సమ్మయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పి ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి కో-ఆప్షన్ సభ్యులు ఎండి.రఫీ, సర్పంచ్ కుండె మల్లయ్య, నాయకులు జున్నుతుల రాంరెడ్డి, కంది కృష్ణ చైతన్య రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో కుక్కలు బెడద

ఒకేరోజు ఐదుగురిని కరిచిన కుక్కలు



నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఒకే రోజు కుక్కలు ఐదుగురిని కరిచిన సంఘటన గ్రామంలో నెలకొంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన శీలం రామ్మాయమ్మ, శీలం సమ్మన్న, జ్యోతి తదితరులను కుక్కలు గాయపరచడం జరిగింది. అలాగే పశువులను కూడా కరవడంతో గ్రామ రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో కుక్కల బెడద ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య తీవ్రంగా మారింది. మండలంలోని పట్టణ కేంద్రాలలో కుక్కలను హెూమ్ క్వరంటైన్ తరలించారు. కానీ గ్రామాలలో ఆ విధంగానే ఉండడంతో వీటి ప్రభావం ఎక్కువై గ్రామస్తులు గాయపరుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పట్టణాల మాదిరిగానే గ్రామాలలో కూడా కుక్కల బెడద నుండి రక్షించాలని గ్రామస్తులు వేడుకున్నారు. గ్రామంలో ఐదుగురిని కరవడంతో హుటా హుటిన ఎంజీఎంకు తరలించారు. స్థానిక సర్పంచ్ శీలం లింగన్న గౌడ్ వారిని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

నవతెలంగాణ
4
మహబూబాబాద్, జనగామ, వరంగల్
గురువారం 02.03.2023





అంగన్వాడీల సమ్మె విజయవంతం



నవతెలంగాణ-గూడూరు

అంగన్వాడీల మొదటి రోజు సమ్మెలో భాగంగా గూడూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి టీచర్లు సమ్మెలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. గూడూరు ప్రధాన కూడలి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి తిరుపతమ్మ ప్రాజెక్టు నాయకురాలు రఫియా బేగం, స్వరూప రాణి, సరస్వతి, పద్మ, విజయ, శహీదాబేగం, సమ్మక్క, దుర్గా భవాని అనిత, పారిజాతం, రజని, భారతి, సమ్మక్క, స్వప్న అంగన్వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-దంతాలపల్లి

మండల కేంద్రంలో ఈజీఎస్ నిధులు రూ 5 లక్షలతో చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను బుధవారం జిల్లా వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ ఉమామల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే రెడ్యానాయక్ సహకారంతో మండలంలోని అన్ని గ్రామాల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రైతు సమన్వయ సమితి మండల కో ఆర్డినేటర్ వల్లాద్రి మల్లారెడ్డి, కిషోర్ కుమార్, అంకం సోమేశ్వర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలకు తరలిన నాయకులు

నవతెలంగాణ-జనగామ

మార్చి ఒకటి నుండి మూడవ తేదీ వరకుమిర్యాలగూడ పట్టణంలో నిర్వహించు తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మూడో మహాసభలకు జనగామ జిల్లా నుండి బుధవారం ఆ సంఘం ప్రతినిధులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యులు అజ్మీర సురేష్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులపై ముఖ్యంగా విద్యార్థులపై జరుగుతున్న దాడులు దౌర్జన్యాలు అరికట్టాలని, గిరిజన తండాలలో అభివృద్ధి కోసం ప్రత్యేక తండాల అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని తదితర అంశాల పైన చర్చించి ఈ మహాసభలో తీర్మానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-పాలకుర్తి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని వర్ధన్ ఆశ్రమం నిర్వాహకులు కత్తుల లక్ష్మీ రవీందర్ సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ జనగాం, వర్ధన్ ఆశ్రమం ఆధ్వర్యంలో ఎంపాల బుచ్చిరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పదివేల విలువ చేసే క్రీడ సామాగ్రిని విద్యార్థిని, విద్యార్థులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు పాయం శోభారాణి, వర్ధన్ ఆశ్రమం నిర్వాహకురాలు కత్తుల లక్ష్మీ రవీందర్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని, క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. అమ్మాయిలు క్రీడల పట్ల ఆసక్తి చూపి క్రీడల్లో రాణించి ప్రస్తుతం జరుగుతున్నటువంటి ర్యాగింగ్ భూతానికి అడ్డుకట్ట వేయాలని పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. రోటరీ క్లబ్ జనగామ, వర్ధన్ ఆశ్రమం ఆధ్వర్యంలో సేవలు చేస్తానని విలువైన సామాగ్రిని అందజేస్తానని, జిల్లాలోని అత్యధికంగా విద్యార్థినీ, విద్యార్థులు ఉన్న పాఠశాల పాలకుర్తి కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఓరుగంటి రమేష్, బల్లుల ఉపేందర్, అన్నావజుల నరసింహమూర్తి పాల్గొన్నారు.

సామాన్యులపై బీజేపీ గ్యాస్ బండ భారం

జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు పాగాల సంపత్ రెడ్డి

నవతెలంగాణ-జనగామ

గ్యాస్ బండ ధరలు పెంచి కేంద్ర బిజెపి ప్రభుత్వం సామాన్యులపై పెనుభారం మోపుతుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జడ్పీ చైర్మన్ పాకాల సంపత్ రెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక జడ్పీ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యవసర సరుకుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి అన్నారు. వీటిని అదుపు చేయడంలో కేంద్ర బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.కమర్షియల్ గ్యాస్ బండ ధర రూ. 351 ఇంట్లోవాడే గ్యాస్ ధర 50 రూపాయలకు పెంచిందన్నారు. దీంతో పేద మధ్యతరగతి ప్రజలకు పెనుభారమవుతుందన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలు అంబానీ ఆదానీలకు దోచి పెట్టే విధంగా ఉన్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా ఈ నెల 3 వ తేదీన ఆయా మండల కేంద్రాలతో పాటు నియోజకవర్గ జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. మూడవ తేదీ శుక్రవారం నిర్వహించు నిరసన కార్యక్రమాలకు బీఆర్ఎస్ శ్రేణులతో పాటు మహిళలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.ఈ సమావేశంలో సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు పోకల శివకుమార్, జనగామ మున్సిపల్ కౌన్సిలర్ బండ పద్మ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు యాదగిరి, మహిళ అధ్యక్షురాలు రేఖ, జనగామ పిఎసిఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండ యాదగిరి రెడ్డి, సినియర్ నాయకులు నామాల బుచ్చయ్య, కట్ల సదానందం, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల హామీలను విస్మరించిన ప్రభుత్వం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

అంగన్ వాడీల హామీలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు విమర్శించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్ వాడీ టీచర్లు, వర్కర్స్ కదంతొక్కారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎం.శారద అధ్యక్షతన బుధవారం కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పెన్షన్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధ సౌకర్యాలను కలిగించాలనే డిమాండ్లతో డివిజన్ కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు.ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 3రోజుల పాటు ఆందోళన కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. అంగన్ వాడీలకిచ్చిన హామీల విస్మరించిన నేపథ్యంలో, సమస్యలను పరిష్కరించాలని అనేక మార్లు ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లినప్పటికీ, కాలయాపన చేస్తున్నదన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచడంలో విఫలమైందని మండిపడ్డారు. వేతనాలు ఎంతో పెంచామని చెబుతూ, పనిభారాన్ని మోపుతూ, వెట్టిచాకిరి చేయిస్తూ, శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని అన్నారు. ప్రధానంగా రూ. 26వేల కనీస వేతనం అందించాలని అన్నారు. నూతన విద్యా విధానంతో ఐసీడీఎస్ నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర బీజేపి తెచ్చిందని, దేశంలో సామాన్య, పేదప్రజల ఉపయోగకరమైన అంగన్ వాడీ కేంద్రాలను తొలిగించే ప్రయత్నం చేస్తేచూస్తూ ఊరుకోమని,న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకూ ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ విజయ లక్ష్మి అనిత,పద్మ,సుగుణ, మంజుల, సుజాత, కవిత, శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు పై దాడిని నిరసిస్తూ నిరసన

నవతెలంగాణ-చిన్నగూడూరు

ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రాధా బాయ్, డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో రోడ్డుపై బైఠాయించి న్యాయం చేయాలంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వాళ్ల మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుడు పై దాడి చేసిన బీఆర్ఎస్ నాయకుల పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులపై మరోసారి ఇలాంటి దాడులు చేస్తే ఊరుకునేది లేదని అన్నారు. ఎస్సై రవికుమార్ సంఘటన స్థలానికి చేరుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కాంగ్రెస్ నాయకులు నిరసన విరమింపచేశారు. అనంతరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేష్, నాయకులు బిక్కు నాయక్, కిరణ్, సుధాకర్, మోహన్, వెంకన్న, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కే.వెంకటరమణకు సన్మానం



నవతెలంగాణ-మట్టెవాడ

సిపిఆర్‌పైన వైద్యాధికారులకు హైదరాబాదులో జీవీకే- ఈఎంఆర్ఐ మేడ్చల్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే.వెంకటరమణకు సోమవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం జరిగింది. వరంగల్ జిల్లాలో జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో ఒక వృద్ధుడు అపస్మారక స్థితికి వెళ్లి గుండె నొప్పితో బాధపడుతున్న సందర్భంలో అతనికి సిపిఆర్ సేవలందించి వెంటనే ఎంజీఎం వరంగల్ ఆసుపత్రికి తరలించి అతని ప్రాణాలు కాపాడిన సందర్భాన్ని పురస్కరించుకొని శిక్షణ కార్యక్రమంలో తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మాత్యులు తన్నీరు హరీష్‌రావు, మున్సిపల్ ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు, మల్లారెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వి, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ శ్వేతా మహంతిల చేతుల మీదుగా వరంగల్ డిఎంహెచ్వోను శాలువాతో సన్మానించి ప్రశంసా పత్రం అందించారు. ప్రతి వ్యక్తి సిపిఆర్ నేర్చుకొని ఎదుటి వ్యక్తులకు సేవలందించాలని కోరారు. ఈ సందర్భంగా అక్కడ శిక్షణ పొందిన వారందరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్రోకర్‌గాళ్ల మాటలు ప్రజలు నమ్మవద్దు

మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



నవతెలంగాణ-జనగామ డెస్క్

బ్రోకర్ గాళ్ళ మాటలు ప్రజలు నమ్మవద్దు, వాళ్ళ మాటల వినడానికే బాగుంటాయి... కానీ వాస్తవంలో వాళ్ళు చేసేదేమీలేదు... వాళ్ళ మాటలు నమ్ముకుంటే నట్టేట మునిగినట్లే అని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు అన్నారు. బుధవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గం లింగాలఘనపూర్ మండలం నేల పోగుల,నెల్లుట్ల గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మనఊరు-మనబడి కార్యక్రమంలో భాగంగా గ్రామ పాఠశాలలో చేపట్టిన పనులకు మంత్రి ప్రారంభోత్సవాలు చేశారు. మొత్తం 23 లక్షల 44 వేల రూపాయలతో నేల పోగుల గ్రామ పాఠశాల ఆధునీకరణ, మౌలిక వసతులు, పెయింటింగ్స్, గ్రంథాలు వంటి అనేక సదుపాయాలకు ఈ రోజు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. నాకు ఈ గ్రామం పై ప్రత్యేక ప్రేమ ఉంది. నా శిష్యులు, నా దగ్గర పని చేసే వాళ్ళు ఈ గ్రామం వాళ్ళే ఉన్నారు. అందుకే నేను ఈ గ్రామానికి కావల్సినన్ని నిధులు ఇచ్చాను. ఇంకా అడుగుతున్నారు. వాటిని పరిశీలిస్తాను. కొందరు పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు. తుపాకీ రాముడు లాగా బండి సంజయ్, రేవంత్ రెడ్డిలు పిచ్చి కుక్కల్లా మొరుగుతున్నారని విమర్శించారు. లుచ్చా మాటలు మాట్లాడుతున్నారని, సీఎం కేసీఆర్, కేటీఆర్‌లను తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలకు అందుతున్న వివిధ పథకాలను మంత్రి ప్రజలకు వివరించారు.ప్రజలు గతంలో జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని విశ్లేషించుకోవాలన్నారు. ఇక్కడ నేలపోగుల స్కూల్‌కి నిధులు ఖర్చు పెడుతున్న కేసరి లక్ష్మీనారాయణ వారి కుటుంబాన్ని అభినందిస్తున్నాను. నేల పోగుల గ్రామానికి 2 కోట్ల నిధులు ఇస్తాను. అవసరాన్ని బట్టి మరిన్ని నిధులు ఇస్తానని మంత్రి తెలిపారు. 40 ఏళ్ళ రాజకీయ జీవితంలో నాకు ఇద్దరే ఇద్దరు సీఎంలు నచ్చుతరు. ఒకరు ఎన్‌టీఆర్ ఇంకొకరు కెసిఆర్ అని అన్నారు.

స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మాట్లాడుతూ ఒక్కో స్టూడెంట్ మీద నెలకు రూ.60 వేలు ప్రభుత్వం ఖర్చు చేస్తుందని, లక్ష్మీనారాయణ తన ఉదారతను చాటు కుంటూ తన సొంత డబ్బులను కోటి రూపాయలను ఖర్చు చేశారని వారికి అభినందనలు తెలిపారు.

జిల్లా కలెక్టర్ సి హెచ్. శివలింగయ్య మాట్లాడుతూ మనఊరు-మనబడి కార్యక్రమంలో భాగంగా మొదటి విడత 176 స్కూల్స్‌ని ఎంపిక చేసి 80 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నామని, ఇందులో ఇప్పటికే 80 స్కూల్స్‌లో అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయని, నేల పోగుల గ్రామ పాఠశాలలో మంచి సదుపాయాల కల్పన జరుగుతుందని, మంచి సుశిక్షితులైన టీచర్స్ ఉన్నారని, ఈ విద్యాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దూసరి గణపతి, ఎంపిపి చిట్ల జయశ్రీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి, ఎంపిటిసి నర్సయ్య, ఎంపిడివో సీతారాం, తహశీల్దార్ అంజయ్య, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాగేందర్, భాగ్యలక్ష్మి, గంగధర్, ఆంజనేయులు, విష్ణు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవుతాపురంలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

అర్థరాత్రి దుండగుల దురాగతం

నిందితులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-పెద్దవంగర

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల పరిధిలోని అవుతాపురం ప్రధాన కూడలి వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ విగ్రహాన్ని మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు జేసీబీతో పూర్తిగా ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన ఓ పార్టీ నాయకులు స్థానిక మంత్రి ప్రోద్బలంతోనే ఈ దశ్చర్యకు పాల్పడ్డారంటూ వైఎస్సార్ టీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దురాగతానికి నిరసనగా గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో పార్టీ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్సై కుమారస్వామి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా ఇటీవల వైఎస్ఆర్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్రకు గ్రామంలో వైఎస్ఆర్ అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు.పాదయాత్ర 3800 కిలో మీటర్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో గ్రామ చౌరస్తాలో వైఎస్ఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుండగా బీఆర్ఎస్-వైఎస్ఆర్ సీపీ కార్యకర్తల మధ్య తీవ్రవాగ్వాదం చోటు చేసుకుంది. అయినా వైఎస్సార్ టీపీ నాయకులు గ్రామంలో వైఎస్ఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

15 రోజులకే నేలకూల్చారు...

మండలంలో షర్మిల పాదయాత్ర సందర్భంగా ఫిబ్రవరి 16న గ్రామ ప్రధాన కూడలిలో వైఎస్ఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మొదటగా అధికార పార్టీ కార్యకర్తలు అడ్డుకున్నప్పటికీని వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు, మహిళలు నిలువరించి విగ్రహాన్ని గ్రామంలో ఆవిష్కరించారు.మంత్రి ఎర్రబెల్లి కనుసన్నల్లోనే విగ్రహం ధ్వంసం జరిగిందని వైయస్సార్ టీపీ శ్రేణులు ఆరోపిస్తున్నారు. దీనికి మంత్రి ఎర్రబెల్లే పూర్తి బాధ్యత వహించాలన్నారు. కాగా గ్రామంలో విగ్రహం ఏర్పాటు చేసిన 15 రోజులకే మంగళవారం అర్ధరాత్రి దుండగులు జేసీబీ సహాయంతో నేలకూల్చడం పట్ల పలు పార్టీల నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు.



నిందితులను కఠినంగా శిక్షించాలి...

వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ధ్వంసం చేసిన నిందుతులకు కఠినంగా శిక్షించాలని వైఎస్ఆర్టిపి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు బానోత్ సుజాత మంగీలాల్, జనగామ జిల్లా అధ్యక్షుడు గౌరబోయిన సమ్మయ్య, నియోజకవర్గ కోఆర్డినేటర్ వెంకట్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నాయకులు వైయస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడితే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాగా విగ్రహం ధ్వంసం చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో జనగాం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది శ్రీహరి, యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, మోహన్, కొడకండ్ల మండల అధ్యక్షుడు గుగులోత్ వెంకన్న, దేవరుప్పుల అధ్యక్షుడు కండే అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్విట్టర్‌లో స్పందించిన వైఎస్ షర్మిల...

వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని అర్ధరాత్రి దుండగులు కూల్చడం నీచమైన చర్య అని వైయస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసంపై ఆమె ట్విట్టర్‌లో స్పందించారు. దయలేని దయాకర్ రావే దగ్గరుండి మరీ తన గుండాలతో చేయించిన పని అని ఆరోపించారు. గుండాలకు నాయకుడు ఎర్రబెల్లి అని, మహిళలు స్వయంగా కట్టించిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ : లక్ష్మీనారాయణ

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని టీపీసీసీ సభ్యులు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ, బ్లాక్



కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యా నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అవుతాపురంలో వైయస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, సీనియర్ నాయకుడు తోటకూర శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజలు ఇలాంటి ఘటనలను హర్షించరని, తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకులు రామిరెడ్డి, సురేష్, కృష్ణమూర్తి గౌడ్, కుమార స్వామి, ప్రభాకర్, ధరావత్ రాజేష్ నాయక్, సోమాచారి, పూర్ణచందర్, బాలాజీనాయక్, వెంకన్న పాల్గొన్నారు.

వైయస్ విగ్రహాన్ని కూల్చడం అవివేకం

పాలకుర్తి : వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని కూల్చడం అవివేకమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణతో కలిసి ఆయన మాట్లాడుతూ పెద్దవంగర మండలం అవుతాపురం గ్రామం వద్ద డా.వైయస్ రాజశేఖర రెడ్డి విగ్రహ కూల్చివేతదారులపై కఠిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవాదల్ నాయకులు గుగ్గిళ్ల ఆదినారాయణ, ఎస్సీసెల్ జిల్లా నాయకులు జలగం కుమార్, బిసిసెల్ అధ్యక్షులు బైకాని ఐలేష్, ఎస్టీసెల్ అధ్యక్షులు లావుడ్య భాస్కర్ నాయక్, ఎస్సీసెల్ అధ్యక్షులు గాదెపాక భాస్కర్, యూత్ ఉపాధ్యక్షులు గోనె మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు నారగాని ఎల్లయ్య, మండల నాయకులు బైరు భార్గవ్, యువజన నాయకులు బత్తిని అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రైతులు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

నవతెలంగాణ-కాశిబుగ్గ

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అధిక దిగుబడి సాధించాలని వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మన అగ్రిటెక్ ఎండి పాషికంటి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్మార్ట్ అగ్రికల్చర్ మెగాఎక్స్పో కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి, ఉన్నత శ్రేణి కార్యదర్శి బివి రాహుల్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశమని, ఉమ్మడి వరంగల్ జిల్లా అన్ని పంటలకు నిలయమన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక పరికరాలవల్ల తక్కువ శ్రమతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చు అన్నారు. ప్రభుత్వం రైతులకు అనేక సంక్షేమ పథకాలు, రాయితీలు కల్పిస్తూ వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించిన పాషికంటి రమేష్ రైతులపై మక్కువతో మన అగ్రిటెక్ ద్వారా చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు.

మైనార్టీ అభ్యర్థులకు ఉచిత తరగతులు

నవతెలంగాణ-వరంగల్

తెలంగాణా రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ, హైదరాబాద్ వారు గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 పోటీ పరీక్షల కోసం మైనార్టీ అభ్యర్థులకు వరంగల్ జిల్లాలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించుటకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇట్టి శిక్షణ తరగతులు (60) రోజులు కంబైన్డ్ (గ్రూప్ 1, 2) కోచింగ్, (45) రోజులు (గ్రూప్-4 కోచింగ్, నిర్వహించబడును. ఆసక్తి గల అర్హులయిన మైనారిటీ (ముస్లిములు, క్రైస్తవులు, సిక్కులు, బుద్ధులు, జైనులు, పారసీకులు) అభ్యర్థులు అవసరమైన సర్టిఫికేట్ కాపీలను జత చేస్తూ తమ దరఖాస్తులను జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి కార్యాలయము, వరంగల్ జిల్లా, బి.2 క్వార్టర్స్, సర్క్యూట్ గెస్ట్ హౌస్ ఎదురుగా, ఎక్సైజ్ కాలని రోడ్, హనుమకొండ నందు మార్చ్ 30 లోగా సమర్పించాలని, మరిన్ని వివరములకు సెల్ నంబర్ : 9963978386, 0870-2980533లను సంప్రదించాలని వరంగల్ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి విక్రమ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నీళ్లు రాక పంటలు ఎండిపోతున్నాయ్

నవతెలంగాణ-ఐనవోలు

వర్ధన్నపేట నియోజకవర్గం ఐనవోలు మండలం వనమాల కనపర్తి గ్రామ పరివాహక పొలాలు ధర్మసాగర్ రిజర్వాయర్ నుండి నీళ్లు రాకపోవడంతో చుట్టుప్రక్కల గ్రామాల వరి పంట, మొక్కజొన్న పంటలు ఎండిపోయిన పరిస్థితిని ఉందని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, కౌలు రైతులు పెట్టుబడులు పెట్టి ఎన్నో ఇబ్బందులు పడి పంటలు చేతికి వచ్చే సమయానికి కాలువ నుండి నీళ్ళు రాకపోవడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయని స్థానిక ఎమ్మెల్యే స్పందించి వెంటనే చర్య తీసుకుని ధర్మసాగర్ రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేయించాలని రైతులు కోరుతున్నారు. ఈ పరిస్థితుల్లో కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితిని ఎదుర్కొంటున్నామన్నారు.

కరెంటు కోసం పడిగాపులు కాస్తున్నామన్నారు. కరెంటు సరిగా రాదు వచ్చిన కరెంటుకు బిల్లులు కట్టమని కరెంటు అధికారులు ఆటోమేటిక్ స్టార్టర్లను తీసుకొని వెళ్లారని తెలిపారు. అటు కెనాల్‌లో నీళ్ల రాక ఇటు కరెంటు సరిగా రాక రైతులం అనేక ఇబ్బందులు పడుతున్నామని వెంటనే రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

పరీక్ష సామగ్రి అందజేత

నవతెలంగాణ-చెన్నారావుపేట

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో లీడ్ లైబ్రరీ ఫౌండేషన్ అధ్యక్షులు కాసుల రవికుమార్, శిల్ప జగదీష్, ములుక సాంబయ్య ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి, ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలును విద్యార్థులకు బుధవారం అందించారు. అనంతరం రవి కుమార్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో లైబ్రరీని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. పదవ తరగతి పరీక్షలలో అందరూ విద్యార్థులు 10/10 గ్రేడింగ్ విద్యార్థులు సాధించాలని తెలిపారు. పేదరికానికి యుద్ధం చదువే ఆయుధం అన్నారు. ములుక సాంబయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ పాఠశాల విద్యార్థులకు తన వంతు సహకారంను అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిని, ఉపాధ్యాయులు కిషోర్, శ్రీనివాస రెడ్డిఅనుపమ, నిర్మలదేవి, విజయలక్ష్మి సరోజ మరియు సీఆర్పీ సంపత్ పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి పై దాడి హేయమైన చర్య

నవతెలంగాణ-గార్ల

హత్ సే హత్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం భూపాలపల్లిలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పాదయాత్ర కార్నర్ మీటింగ్‌లో బీఆర్ఎస్ పార్టీ కిరాయి గుండాలు జరిపిన దాడిని హేయమైన చర్య అని మాజీ ఎంపిపి, ముల్కనూరు ఎంపిటీసి మాళోత్ వెంకట్ లాల్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.కృష్ణగౌడ్అన్నారు.స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రేవంత్ రెడ్డిని నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేకనే ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మొన్న హన్మకొండలో యూత్ కాంగ్రెస్ నాయకుడు పవన్‌పై, నిన్న భూపాలపల్లిలో జరిపిన దాడి కాంగ్రెస్ పార్టీ పై ప్రజలలో వస్తున్న జనాదరణను చూసి తట్టుకోలేకనే ఓటమి భయంతో అధికార పార్టీ గుండాలు దాడులకు పాల్పడుతున్నారని భవిష్యత్‌లో ఇలాంటి దాడులు పునరావృతం ఐతే కాంగ్రెస్ పార్టీ తగిన గుణపాఠం చెప్పుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల నాయకులు పి.బిక్ష పతి, వై.శ్రీనివాస్, జి.నాగేష్, మోహన్ నాయక్, హస్మాత్, ధీకొండ రాము తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ



నవతెలంగాణ-గార్ల

బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతి బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎంపిపి మూడ్ శివాజీ చౌహాన్, తహశీల్దారు ఈ.రాము అన్నారు. మండలంలోని చిన్న కిష్టాపురం పంచాయతీ కేంద్రంలో బిఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి బుధవారం భూమి పూజా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి శివాజీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం నేడు కల్పించబడిన హక్కులే ప్రతి ఒక్కరికి రక్షణగా నిలుస్తున్నాయని అన్నారు. భారత రాజ్యాంగ విలువలను భావితరాలకు అందించేందుకు నేటి యువత అంబేద్కర్ బాటలో పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్, ఎల్ హెచ్‌పిఎస్ జిల్లా,మండల అధ్యక్షులు వాంకుడోత్ మంగీలాల్, గంగావత్ అశోక్,వార్డు సభ్యులు బిక్య, పంచాయతీ కార్యదర్శి సరిత, గ్రామ పెద్దలు గంగావత్ హరి కిషన్ నాయక్, మాన్ సింగ్, బలరాం, ఫుల్ సింగ్, బిక్షపతి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



నవతెలంగాణ-గార్ల

అంగనవాడీలకు ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగ భద్రత, పెన్షన్, ఇఎస్ఐ, ఉద్యోగ వేతనాల హామీలను నిలబెట్టు కోవాలని అంగన్ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూని యన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి సరోజ డిమాండ్ చేశారు.అంగన్ వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన మూడు రోజుల సమ్మెలో భాగంగా బుధవారం డోర్నకల్ ఐసిడియస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జీవో 14,19,8 నెంబర్ లను సవరించి, వేసవి కాలంలో ప్రభుత్వ పాఠశాల లతో సమానంగా వేసవి సెలవు లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అంగన్ వాడి ఉద్యోగులకు కళ్యాణ లక్ష్మీ, ఆసరా తదితర సంక్షేమ పథకాలను అమలు చేయాలని,ఖాళీగా ఉన్న పోస్ట్ లను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ముందు గా పట్టణం లో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గార్ల, డోర్నకల్, కురవి మండలాల యూనియన్ నాయకులు బి.నీలాదేవి,తాళ్లూరి పద్మ,రోయ్య విక్టోరియా,ఉపేంద్ర,వసంత,రుక్కమ్మ, సుజాత,బి.కష్ణ కుమారి, సంధ్య,ఇందిర, విజయ,మహాలక్ష్మి, తార, డోర్నకల్, గార్ల మండలాల సిఐటియు నాయకులు దాసరి మల్లేశం, కందునూరి శ్రీనివాస్ లు, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయ పునఃప్రతిష్ఠలో పాల్గొన్న మంత్రి



నవతెలంగాణ-రాయపర్తి

మండలంలోని తిరుమలాయపల్లి గ్రామంలో నాలుగు వందల సంవత్సరాల స్థల చరిత్ర కలిగిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఐదు రోజుల నుండి నిర్విరామంగా సాగుతున్న సంబరాలు అంబరాన్నంటాయి. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో కలిసి బుధవారం వేడుకల్లో పాల్గొని స్వామివారి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. తదుపరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆరుట్ల రామకృష్ణ చార్యుల ఆధ్వర్యంలో గోపురం, ధ్వజ స్తంభ ప్రతిష్ఠను అత్యంత జాగ్రత్తగా ప్రణాళిక బద్ధంగా చేపట్టారు. శాంతి పూజ చేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. రాయపర్తి ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి ముందుండి చరిత్రాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి కష్టనష్టాలకు ఓర్చి ఎంతటి పనైనా చేయడానికి సిద్ధంగా ఉంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనంత ప్రసాద్, ముద్రబోయిన వెంకన్న, మైబ్ రెడ్డి, గుడి యుగేందర్ రెడ్డి, వశపాక కుమారస్వామి, యాదగిరి, శేఖర్, నరసింహ రెడ్డి, సోమిరెడ్డి, ఎల్లగౌడ్, వశపాక సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పై ఆదరణ ఓర్వలేక దాడులు : కాంగ్రెస్

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపట్టిన హత్ సే హత్ జోడో యాత్ర సందర్భంగా వస్తున్న ప్రజాదరణ ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని ఉమ్మడి జిల్లా మాజీ ప్రధానకార్యదర్శి సతీష్ అన్నారు. బుధవారం నియోజక వర్గ కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర పోలీసులు అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. చిల్లర రాజకీయాలు చేస్తూ, తనకు రాజకీయ జన్మనిచ్చిన తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీయని మరిచి, గతాన్ని మరిచి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి వ్యవహరిస్తున్నారని, తమ నాయకుడు రేవంత్ రెడ్డిపై దాడిని ప్రజలు గమనిస్తున్నారని, రాబోవు రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తక్షణమే దాడులు చేసిన వారిపై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉదయం పత్రిక
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5 జయశంకర్-భూపాలపల్లి, ములుగు, హనుమకొండ
గురువారం 02 మార్చి 2023

సీతారామ కళ్యాణానికి తలంబ్రాల సేకరణ

నవతెలంగాణ-గణపురం

భద్రాచలం శ్రీ సీతారాముల కళ్యాణానికి కోటి అక్షింతల కార్యక్రమం ధర్మారావుపేట శివాలయంలో శ్రీ ఉమా మహేశ్వర సేవ సమితి ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. కమిటీ నిర్వాహకులు ఆకుల సుభాష్, ఆధ్వర్యంలో సీతారామ కళ్యాణానికి తలంబ్రాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో దూలం శంకర్, ఆకుల దామోదర్, బెనికె రాజు, దూలం రమేష్,పుజారి మల్లయ్య, వాల కిరణ్,వనికల కృష్ణ, మామిడి రాజు, వనికల వసంత, ఆకుల సుజాత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.





విలువతోకూడిన విద్య అందించాలి : ఎమ్మెల్యే

నవతెలంగాణ-మహదేవపూర్

పోటీతత్వంలో విలువలతో కూడిన విద్యను అందించాలని మాజీ మంత్రి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం రాత్రి మహదేవపూర్ మండల కేంద్రంలోరైసింగ్ స్టార్ ప్రైవేట్ స్కూల్లో మొదటి సంవత్సర వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐ పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతర కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండ్ మంజులా రెడ్డి, జెడ్పీటీసీ అరుణ శ్రీనివాస్, ఎంపీపీ రాణి బాయి, ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోటరాజబాబు, రాష్ట్ర కిసాన్ సెల్ కన్వీనర్ సేగ్ భూషణ్, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు శ్రీనివాసరెడ్డి, శ్రీశైలం, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



ఎంసెట్, నీట్ మెటీరియల్ పంపిణీ

నవతెలంగాణ - ములుగు

బండారుపల్లి మోడల్ స్కూల్లో కళాశాల ప్రధాన ఉపాధ్యాయులు శోభారాణి అధ్యక్షతన బుధవారం ప్రజా సేవకులు భూక్య దేవ్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై ఇంటర్ విద్యార్థులకు ఎంసెట్, నీట్ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవ్‌సింగ్ మాట్లాడారు. జీవిత లక్ష్యాన్ని ఎంచుకొని భవిష్యత్తు బాటలు వేసుకోవాలని అన్నారు. సామాజికవేత్త దొంతి విజేందర్ రెడ్డి కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదవండి : భూక్య దేవ్ సింగ్

గోవిందరావుపేట : డాక్టర్ ఇంజనీర్ జీవితంలో ఏదో ఒకటి సాధించాలని లక్ష్యంతో విద్యార్థులు చదవాలని సామాజికవేత్త విశ్రాంత మునిసిపల్ కమిషనర్ భూక్య దేవ్‌సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని చల్వాయి గ్రామంలో మోడల్ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఎంసెట్, నీట్ స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిజాముద్దీన్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దేవ్ సింగ్ హాజరై మాట్లాడారు. ములుగు గడ్డ మీద పుట్టిన ప్రతి బిడ్డ తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు.

పరీక్షలకు తప్పనిసరిగా హాజరు కావాలి

డీఐఈఓ పి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-ములుగు

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మార్చి 4 న నైతికత-మానవ విలువలు, 6న పర్యావరణ విద్యపై పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తప్పనిసరిగా అందరూ హాజరు కావాలని డీఐఈఓ పి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ విద్య కమిషనర్ ఆదేశాల మేరకు ములుగు జిల్లాలోని 31 కళాశాలల్లో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. అన్ని కళాశాలల ప్రిన్సిపాల్ లు ఈ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. జవాబు పత్రాలను అన్ని పరీక్ష కేంద్రాలకు పంపించడం జరిగిందన్నారు. ప్రశ్న పత్రం ఆదేశాలు నెట్ నుండి డౌన్లోడ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులందరికీ హాల్ టికెట్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఉదయం10. గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1.గంట వరకు పరీక్షలు ఉంటాయన్నారు. మొత్తం2195 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. వారంతోపాటు గతంలో ఈ పరీక్షలు హాజరు కాని విద్యార్థులు కూడా సంబంధిత ప్రిన్సిపాల్ ని సంప్రదించి పరీక్షలు రాయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.





ఆర్థికంగా,రాజకీయంగా ఐక్యతతో ఎదగాలి

మున్నూరు కాపు సంఘం

మండల అధ్యక్షులుగా రామకృష్ణ పటేల్, ప్రధాన కార్యదర్శిగా హరిప్రసాద్ పటేల్ ఎన్నిక

నవతెలంగాణ-గోవిందరావుపేట

మున్నూరు కాపులు ఐక్యతతో ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా ఎదగాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పకాకుల అశోక్ పటేల్, జిల్లా ఇన్చార్జి పిట్టల మధుసూదన్ పటేల్లు అన్నారు. గోవిందరావుపేట మండలం మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ ని బుధవారం ఏకగ్రీవం ఎన్నుకున్నారు. మున్నూరు కాపు సంఘం మాజీ మండల అధ్యక్షుడు సురవరం వెంకటరామయ్య అధ్యక్షతన మండల కేంద్రంలోని వైశ్య భవనంలో సమావేశం ఏర్పాటు చేసి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ మండల అధ్యక్షుడిగా అల్లూరి నాగేశ్వరరావు, మండల అధ్యక్షులుగా అనిశెట్టి రామకృష్ణ పటేల్, ప్రధాన కార్యదర్శిగా హరిప్రసాద్ పటేల్, కోశాధికారిగా మేకల యాదగిరి స్వామి పటేల్, ఉపాధ్యక్షులుగా పొట్ల సంపత్, పటేల్, నామ్ పూర్ణచందర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ తెల్ల హరిప్రసాద్, అల్లూరి నాగేశ్వరరావు, చల్వాయి పైడాకుల కృష్ణమూర్తి, పైడిమల్ల మహేందర్, గోవిందరావుపేట అధ్యక్షులు భద్రయ్య, జెట్టి శోభన్, చామతి సాంబశివరావు, మేకల యాదగిరి, విక్రమ్, జీవన్, కృష్ణమూర్తి, సంఘం ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్షుడు బలయ్య పిఏసిఎస్ డైరెక్టర్ సోమయ్య, సంఘం నేతలు,సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలను అధికారుల తనిఖీ

నవతెలంగాణ - తాడ్వాయి

మండలంలోని మేడారంలో ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఈ శ్రీధర్, ఏటూరు నాగారం ఐటీడీఏ పీఓ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని అన్ని రకాల రిజిస్టర్లను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థుల యాక్షన్ ప్లాన్ అమలు, సి గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, ఆహార మెనూ, పాఠశాలలో మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు 100శాతం10/10 జీపీఏ సాధించాలని తెలిపారు. వెనుకబడిన సి గ్రేడ్ కు సంబంధించిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి ఉత్తమ శ్రేణిలో పాస్ అయ్యేలా కృషి చేయాలన్నారు. వార్షిక పరీక్షలు ఇంకా నెల సమయం ఉండగా, విద్యార్థులకు ప్రత్యేక దృష్టితో బోధించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు సరోజిని, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ పోచం, ఏటీడీఓ దేశీ రామ్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అంబులెన్స్ దగ్ధం

నవతెలంగాణ -తాడ్వాయి

షార్ట్ సర్క్యూట్తో 108 అంబులెన్స్ దగ్ధమైన సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటుచేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం మండలానికి అత్యవసర మాడల సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో పార్కు చేసి ఉంచిన అంబులెన్స్ షార్ట్ సర్క్యూట్తో దగ్ధమైంది. అంతకు ముందు రోజు రిపేర్ కు పోయి వచ్చినట్లు తెలిసింది. షార్ట్ సర్క్యూట్ కావడంతో అంబులెన్స్ కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది కూడా వచ్చినట్టు సమాచారం. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తాడ్వాయి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిసి రోడ్డు పనులను ఎంపీపీ ప్రారంభం

నవతెలంగాణ - ములుగు

ములుగు జిల్లా కేంద్రం లోని శుభాష్ కాలనీలో, బుందవన కాలనీలో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి సుధీర్ యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ములుగు జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి ములుగు పట్టణానికి రూ.28లక్షలు మంజూరు చేశారని, ములుగు లోని అన్ని కాలనీలో త్వరలో పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ మెంబర్ ఎండీ రియాజ్ మీర్జా, ఎంపీటీసీ గొర్రె సమ్మయ్య, మండల కో ఆప్షన్ మెంబర్ యాసిన్, బీఆర్ఎస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు మేర్గు సంతోష్, వార్డ్ మెంబర్ అజయ్, సుభాష్, అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు అన్ని సౌకర్యాలు సిద్ధం చేయాలి

గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక అధికారి ఈ శ్రీధర్



నవతెలంగాణ - ములుగు

పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు రాయడానికి అన్ని సౌకర్యాలు సిద్ధం చేయాలని తెలంగాణ గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక అధికారి ఈ శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజన సంక్షేమ విద్యా సంస్థలను తనిఖీ చేసేందుకు ప్రధాన కార్యాలయ అధికారులను నియమించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా బుధవారం ఈ శ్రీధర్, ఐటీడీఏ పీఓ అంకితతో కలిసి ములుగు జిల్లాలోని జగ్గన్నపేట బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. ఎస్ఎస్సీ యాక్షన్ ప్లాన్ అమలు, సి గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, మెనూ అమలు, పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు మొదలైన వాటిపై హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులతో ఆరా తీశారు. సిలబస్ పూర్తి చేయడం, స్లిప్ పరీక్షలు నిర్వహించడం,ఎస్ఎస్సి విద్యార్థుల పనితీరు, రోజువారీ కార్యకలాపాల అమలుపై హెడ్ మాస్టర్, సబ్జెక్ట్ టీచర్లతో సంభాషించారు. సి గ్రేడ్ విద్యార్థులను ఏ లేదా బి గ్రేడ్‌లోకి తీసుకురావడానికి, ప్రత్యేక తరగతుల నిర్వహణ, యోగా, వ్యాయామం తదితర వాటిపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎస్ఎస్సీ విద్యార్థులకు వార్షిక పరీక్షలు రాయడానికి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థుల రోజువారీ కార్యకలాపాలపై ఆరా తీశారు. వార్షిక పరీక్షలకు ఒక నెల సమయం ఉందని, ఏదైనా సబ్జెక్టుపై ఏదైనా సందేహాలు ఉంటే సందేహ నివృత్తి కోసం సంబంధిత ఉపాధ్యాయులను సంప్రదించడానికి వెనుకాడవద్దన్నారు. మెరుగైన ఆత్మగౌరవ, లక్ష్యాలను సాధించడం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ డిడి వై పోచం, ఏటీడీఓ జి. దేశిరామ్, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుమార్ సేవలు మరువలేనివి



నవతెలంగాణ-గోవిందరావుపేట

కాంగ్రెస్ పార్టీ ములుగు నియోజకవర్గంలో నల్లెల్ల కుమారస్వామి సారథ్యంలో జైత్రయాత్ర కొనసాగించిందని పార్టీని బలంగా తయారు చేశారని ఆయన సేవలు మరువలేనివని కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కొమరం ధనలక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పధిగా పార్వతి అధ్యక్షతన కుమారస్వామి సంతాప సభ జరిగింది. ముఖ్యఅతిథిగా ధనలక్ష్మి హాజరై మాట్లాడారు. నల్లెల్ల కుమారస్వామి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో, ములుగు జిల్లా సాధనలో తన వంతు పాత్ర పోషించి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిలో కీలకంగా మారారన్నారు. సీతక్క గెలుపులో ప్రధాన పాత్ర పోషించిన కుమారస్వామి మరణం చాలా బాధాకరం అని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాలడుగు వెంకటకృష్ణ, జెట్టి సోమయ్య, పెండెం శ్రీకాంత్, ఎంపీటీసీ గోపిదాసు ఏడుకొండలు, సర్పంచ్ లావుడియా లక్ష్మీ- జోగ నాయక్, మిరియాల కృష్ణ, జంపాల చంద్రశేఖర్, కటాపూర్ సర్పంచ్ రేగ కల్యాణి, పోలేబోయిన సజన, మద్దాలి నాగమణి, పులుసం లక్ష్మి గోడిశాల వజ్రమ్మ, కళ్ల ప్రమీల, మిరియాల లక్ష్మీ ఈక రజిని, తదితర నాయకులు పాల్గొన్నారు.

తాడ్వాయి ఏజెన్సీలో 'అప్పయ్య' విస్తృత పర్యటన

మిషన్ భగీరథ అధికారులపై ఫైర్



నవతెలంగాణ -తాడ్వాయి

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై గిరిజన ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకొనేలా వివిధ గ్రామాల అధికారులు పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా వైద్యాధికారి, మండల అభివృద్ధి అధికారి సత్యాంజనేయ ప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని గంగారం గ్రామపంచాయతీలో ఎంపీడీఓ సత్య ఆంజనేయ ప్రసాద్, సర్పంచ్‌తో కలిసి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించిన సంగతి విదితమే. అనంతరం బుధవారం గంగారం, పంబాపూర్, కాటాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. మొదట గంగారం గ్రామపంచాయతీలో ఈజీఎస్ ద్వారా జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. అన్నారం పెద్ద చెరువును దాని పారకం, పూడికతీత, నీటి పారకం కాల్వల మరమ్మతులు తదితర అంశాలపై గ్రామస్తులతో చర్చించారు. అక్కడి నుండి పంబాపూర్ గ్రామపంచాయతీకి చేరుకొని సమస్యలపై ఆరాతీశారు. అనంతరం కాటాపూర్ నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్ కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కాటాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల సందర్శించి పదవ తరగతి విద్యార్థుల అభ్యసనం పరిశీలించారు. 100శాతం 10/10 జీపీఏ సాధించాలన్నారు. ఆంధుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని ప్రధానోపాధ్యాయులు ఎండి జాఫర్ అలీ, ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రానికి చేరుకొని అంగన్వాడీ సూపర్వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ ఏఈలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. మండలంలో మిషన్ భగీరథ నీరు ఒక్కరోజు వస్తే పది రోజులు రావడంలేదని గ్రామస్తులు ఆరోపణల మేరకు మిషన్ భగీరథ ఏఈని ప్రశ్నించారు. రాబోయే వేసవికాలంలో మిషన్ భగీరథ ఏఈ విధిగా విధులు నిర్వహిస్తే గ్రామస్తుల మంచినీటి ఇబ్బందులు ఎదుర్కొంటారని, మిషన్ భగీరథ అధికారులపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



వైద్యం అనేది ఆపన్న హస్తం

త్రిదండి చిన్న జీయర్ స్వామి

నవతెలంగాణ - హన్మకొండ

వైద్యో నారాయణ హరి అనే నానుడి లాగే వైద్యం అనేది ఆపన్న హస్తం అని ప్రముఖ స్వామీజీ చిన జీయర్ స్వామి అన్నారు. బుధవారం డాక్టర్ తరుణ్ ఆహ్వానం మేరకు హనుమకొండ బాలసముద్రంలోని చక్రస్థ ఆసుపత్రికి శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల ఆరోగ్యంగా ఉంటే దేశం బాగుంటుందని అన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడడం కోసం శ్రమించడం లేకుండా కృషి చేయాలని లాభ పేక్ష లేకుండా వైద్యం చేయాలని కోరారు. తాము కూడా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లను రోగులకు విశాల ధరణి సేవలు అందిస్తున్నామని అన్నారు. చక్రస్థ హాస్పిటల్ చైర్మన్ ఏవి మోహన్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ తరుణ్ కుమార్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, చంద్రిక రెడ్డి జనరల్ సర్జన్ తదితరులు పాల్గొన్నారు

శ్రీ చెన్నకేశవ స్వామి జాతర కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-దామెర

దామెర మండలంలోని కోగిలవాయి గ్రామంలో మార్చి 5 నుండి జరిగే శ్రీ శ్రీ చెన్నకేశవ స్వామి జాతర కమిటీని సర్పంచ్ గట్టు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. జాతర కమిటీ చైర్మన్‌గా మేకల వంశీ, వైస్ చైర్మన్గా వేణు, తంగెళ్ల రాజును ఎన్నుకున్నారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. కావాల్సిన అన్ని సౌకర్యాలను గ్రామపంచాయతీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోల్కొండ సాంబయ్య, మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ అక్బర్, ఎంపీటీసీ సంగాజిబోయిన మౌనిక కిరణ్, కారోబార్ నరేష్ ,వార్డు సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు

నవతెలంగాణ-మహదేవపూర్

మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జీవాలకు బుధవారం డాక్టర్ మల్లేశ్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, మేకల గొర్రెల పెంపకం దారులు, తదితరులు పాల్గొన్నారు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-దామెర

దామెర మండలం వెంకటాపూర్‌లో రూ.15 లక్షల విలువైన సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ పుల్లం రజిత సంపత్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాగితాల శంకర్, ఎమ్మార్పీఎస్ మాదిగ,మండల దళిత బంధు చైర్మన్ గొగ్గెల కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, దాడి మల్లయ్య ,ఉపసర్పంచ్ గోల్కొండ సురేందర్, జడిశాల బాబురావు ,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

'పేదలకు వరం సీఎం సహాయ నిధి'

నవతెలంగాణ -తాడ్వాయి

పేద ప్రజల లకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి అని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దండుగుల మల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని కాటాపూర్ లో కుసుమ వెంకటేశ్వర్లుకు లక్ష రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన వారు చెక్కులను పొందుటకు మండలంలో తమ బృందాన్ని కలిసి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. మండల కో ఆప్షన్ మెంబర్ దిలావర్ ఖాన్, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బందెల చంద్రయ్య, ముద్దాపు రాజశేఖర్ , బిడ్డ మోహన్ రావు, మాజీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ వహీద్, నాయకులు దంగు సత్యనారాయణ, సురేందర్, వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిపై దాడి అమానుషం : కాంగ్రెస్

నవతెలంగాణ-గణపవరం

అధికార పార్టీకి పోలీసులు తొత్తుగా వ్యవహరిస్తున్నారని రేవంత్ రెడ్డిపై దాడి అమానుషమని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రేపాక రాజేందర్ వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్. ధ్వజమెత్తారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. భూపాలపల్లి పట్టణంలోని స్థానిక అంబేద్కర్ సెంటర్లో కాంగ్రెస్ పార్టీ హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా నిర్వహించిన పబ్లిక్ కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే అనుచరులు బీఆర్ఎస్ గుండాలు రాళ్లు కోడిగుడ్లతో దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. రామన్న రోజుల్లో బీఆర్ఎస్ ఓటమికి ఇది నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అవినీతి అక్రమాలను ఎండగడతామని భయంతోనే దాడులకు దిగారన్నారు. వచ్చే ఎన్నికలు వచ్చినా ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డిని భూపాలపల్లి ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దుడపాక శంకర్, ఎంపీటీసీ కళ్లేపు సాగర్, సర్పంచులు ఓద్దుల విజయ అశోక్ రెడ్డి, మాదం మమత సుధాకర్, గణపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు ఓరుగంటి కృష్ణ,మండల సీనియర్ నాయకులు మాజీ జెడ్పీటీసీ ముత్యాల రాజయ్య, మాజీ ఎంపీపీ రామేశ్వర్‌రావు, దూడపాక దుర్గయ్య ,పున్నం, తదితరులు పాల్గొన్నారు

చిట్యాల : రేవంత్ రెడ్డి దాడి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కుట్రలో భాగమేనని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుట్ట తిరుపతి జిల్లా నాయకులు మధుసూధన్ రెడ్డి మూలంశంకర్‌గౌడ్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారం ఎవరికి సొంతం కాదని అధికారం ఉంది ఏదైనా జరుగుతుందని అనుకోవడం పొరపాటేనని అన్నారు. రేవంత్ రెడ్డి సభలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో జనసందోహాన్ని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే అతని అనుచరులతో దాడి చేయించడం హేయమైన చర్య అన్నారు. రాయన్న పల్లెల్లో బీఆర్ఎస్ కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నాయకులు చిలుకల రాజకొముల పిఏసిఎస్ మాజీ వైస్ చైర్మన్ బుర్ర శ్రీనివాస్ సిహెచ్ రాజమోలి ఎంపీటీసీ దెబ్బటి అనిల్ దొడ్డి కిష్టయ్య రవీందర్ భద్రయ్య కుమార్ మల్లేష్ భగవాన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్నర్ సమావేశంపై ఎమ్మెల్యే అనుచరులు దాడి చేయడాన్ని హేయమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అభివర్ణించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పాల్గొన్న కార్నర్ సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర అనుచరులు దాడి చేయడాన్ని నిరసిస్తూ బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడు, ప్రతిపక్షాల సభలు, సమావేశాలు నిర్వహించుకునే హక్కు రాజ్యాంగం కల్పించిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక అధికార పార్టీ అనుచరులు విచక్షణారహితంగా దాడి చేయడం సిగ్గుచేటన్నారు. భూ కబ్జాలు ఎమ్మెల్యే నీచాలు వినితోనే, సీకరించుకుండా దాడి చేయించడం సరికాదన్నారు. మరోసారి ఇలాంటి దాడులు పునరావృతం అయితే ఒప్పుకునేది లేదని హెచ్చరించారు. నాయకులు మారపల్లి రవీందర్, నిమ్మల రమేష్, మామిడిపల్లి సాంబయ్య, వైనాల కుమారస్వామి, వలి హైదర్, రాజ్ కుమార్, రఘుపాల్, రాజేందర్, కట్టయ్య, కుమార్, రజనీకాంత్, శంకర్, శీను, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలనా దినోత్సవం





నవతెలంగాణ-వేలేరు

ఎంపీపీఎస్ వేలేరు, కన్నారం పాఠశాలల్లో స్వయం పరిపాలన దినోత్సవంను హెచ్ఎంలు బానోతు లీలావతి, హనుమానాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీఎస్ వేలేరు లో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎంగా రిషికేష్, కన్నారంలో శ్రీరాం, ఎంఈఓగా ప్రత్యూష వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఉపాధ్యాయులు సదానందం, లీల రాణి, సుజాత, మాధవి, విజయ,వి మాధవి, కుమురంశ్, కమల, రమ, శ్వేత పాల్గొన్నారు

రాజధానుల ముట్టడిని జయప్రదం చేయాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ

నవతెలంగాణ-గోవిందరావుపేట

ఎస్సీ వర్గీకరణ పోరు లో భాగంగా ఈనెల 15న రాజధానుల ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మహజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మంద కృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పసర గ్రామంలో ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మహజన సోషలిస్టు పార్టీ ములుగు జిల్లా ఇన్చార్జి జరుగు పైడి అధ్యక్షతన జిల్లా ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. బీజేపీ అధికారంలోకొస్తే 100 రోజులలో వర్గీకరణ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేసిందని అన్నారు. మోదీ ప్రభుత్వానికి కావలసిన బిల్లులన్నీ పాస్ చేసుకుంటూ ఎస్సీ వర్గీకరణ బిల్లు మూలన పెట్టిందని అన్నారు. వర్గీకరణ విషయంలో నమ్మక ద్రోహానికి పాల్పడిన పార్లమెంట్ ప్రస్తావన లేదని అన్నారు. బీజేపీ వైఖరికి నిరసనగా ఈనెల 15న రెండు తెలుగు రాష్ట్రాల రాజధానులను దిగ్బంధం చేస్తామని, విజయవంతానికి పాదయాత్రలు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్, ఎంఎస్పీ ములుగు జిల్లా నాయకులు మడిపెల్లి శ్యాం బాబు, నెమలి నరసయ్య, వావిలాల స్వామి,జన్ను రవి, ఎంఎస్ ఫ్ రాష్ట్ర నాయకులు మహేష్, ఎంఎస్ఎఫ్ ములుగు జిల్లా కన్వీనర్ వాసం పెళ్లి చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనే లక్ష్యం : ఎమ్మార్పీఎస్

నవతెలంగాణ- హనుమకొండ

ఎస్సీల హక్కులు, ఆత్మగౌరవ కోసం దండోరా ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల ఆశయ సాధనే తమ ధ్యేయమని ఎమ్మార్పీఎస్ టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఐలపురం రాజేష్ ఖన్నా అన్నారు. బుధవారం మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం హనుమకొండ అంబేద్కర్ సెంటర్లో ఘనంగా నిర్వహించి అమరులు నివాళులర్పించారు. అనంతరం రాజేష్ ఖన్నా మాట్లాడుతూ దేశంలో అనేక సామాజిక కులపర పోరాటాలకు దండోరా ఉద్యమమే స్ఫూర్తిగా నిలిచిందని అన్నారు. అమర వీరులైన తెల్ల బంద రవి మాదిగ, పొన్నాల సురేంద్ర మాదిగ, దామోదర్ మాదిగ ,మహేష్ మాదిగ,ప్రభాకర్ మాదిగ భారతి మాదిగ తదితరుల ఆశయాలను కొనసాగించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ ప్రభుత్వాలు ఏనాడు ప్రధానమైన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధ సాధనకై 28 సంవత్సరాలుగా సుదీర్ఘ పోరాటం చేస్తూ ఇప్పటివరకు 18 మంది అమరులయ్యారన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం వచ్చేపార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మేడ స్వామి ,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి విజయ్ కుమార్ ,రాష్ట్ర నాయకులు బొచ్చు మొగిలి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగారపు సుమన్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు జన్ను సంజీవ్ ,హనుమకొండ మండల అధ్యక్షులు మంద రాజశేఖర్ , తదితరులు పాల్గొన్నారు.



పీఆర్ డీఈని సస్పెండ్ చేసి కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలి : ఎమ్మార్పీఎస్

నవతెలంగాణ-ఆత్మకూర్

అధికార పార్టీకి కొమ్ముకాస్తున్న పంచాయతీరాజ్‌శాఖ డీఈ లింగా రెడ్డిని సస్పెండ్ చేసి కాంట్రాక్టర్ ఓదెల రమేష్ లైసెన్సును కలెక్టర్ వెంటనే రద్దు చేయాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్ను దినేష్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం ఆత్మకూరు మండలంలో జరుగుతున్న పనులను ఎమ్మార్పీఎస్ నేతలు పరిశీలించారు. అనంతరం గూడెప్పాడ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దినేష్ మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలో అభివృద్ధి కంటే అవినీతి అక్రమాలే ఎక్కువ అయ్యాయన్నారు. ఇందుకు ఆత్మకూరు మండల కేంద్రంలో కాకతీయుల కాలం నాటి కాలువ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించింది. ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా 12 ఇంచులకు బదులు కేవలం 4 నుండి 6 ఇంచుల వరకే మందం పోయడమే నిదర్శనం. అవినీతి పీఆర్ డీఈ లింగా రెడ్డి వర్కింగ్ లేకుండానే చేసి జరుగుతున్న పనులను చూసి కూడా పట్టించుకోకపోవడం వెనుకున్న అంతరార్థం ఏమిటని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నవతెలంగాణ దినపత్రికలో వరుస కథనాలు అవినీతిపై వచ్చిన వార్తల వాస్తవమేనని ఎమ్మార్పీఎస్ నేతలు చెప్పారు. జిల్లా ఉన్నత అధికారులు స్పందించి డీఈని సస్పెండ్ చేయడంతో పాటు కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేసేంతవరకు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. విలేకరి దూషించిన కాంట్రాక్టర్ రమేష్ లైసెన్స్ రద్దు చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. జిల్లా ఎమ్మార్పీఎస్ కన్వీనర్ గద్దల సుకుమార్ మాదిగ,ఎంఎస్‌పి జిల్లా ఇంచార్జి మంద రాజు మాదిగ,ఆర్ కన్వీనర్ శ్రీనివాస్ మాదిగ,ఎంఎస్ రాష్ట్ర నాయకులు పాముల సుబ్బయ్య,ఎమ్మార్పీఎస్ మాజీ కన్వీనర్ గోవింద కిరణ్ మాదిగ,ధర్మసాగర్ కన్వీనర్ కళ్యాణ్ మాదిగ,ఆత్మకూరు మండ రవి మాదిగ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'మహనీయుల విగ్రహాలు గోరి వద్ద పెట్టాలనుకోవడం సిగ్గుచేటు'

నవతెలంగాణ-సుబేదారి

మహనీయుల విగ్రహాలు గోరి వద్ద పెట్టాలనుకోవడం సిగ్గుచేటని తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు అంబాల ఆనంద్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. జిల్లా పరిధి బాపుపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్ ,ఎంపీటీసీ ఉద్దేశ పూర్వకంగా అంబేద్కర్ విగ్రహ నిర్మాణం గోరి వద్ద చేపట్టేందుకు యత్నిస్తున్నారన్నారు. రోడ్డు ప్రక్కన గోరి ఇల్లు మధ్యలో విగ్రహాన్ని నిర్మిస్తే ఎలా అని ప్రశ్నించారు. గ్రామ నూతన గ్రామపంచాయతీ వద్ద గాని, వాటర్ ప్లాంట్ వద్ద విశాలమైన ప్రదేశంలో విగ్రహప్రతిష్ట చేయాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు అంబాల ఆనంద్, ఎల్కతుర్తి మండల అధ్యక్షులు అంబాల ఆర్యరాజ్, చందు, భావుపేట గ్రామ యువత బట్టిని ప్రదీప్ గౌడ్, దాట్ల మానిరెడ్డి, గంగరాబోయిన ప్రవీణ్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.


ఛత్రపతి శివాజీ ఆశయాలను అందించాలి


నవతెలంగాణ - నడికూడ

ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని స్థాపించి బావి తరాలకు శివాజీ మహారాజ్ స్ఫూర్తిని, ఆశయాలను అందించాలని బీజేపీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. బుధవారం మండలంలోని కౌకొండ గ్రామంలోని సంఘం కౌకొండలోని కౌకొండ గ్రామంలో సమావేశమై చర్చించారు. పోరాట యోధుడి నేటి పాలకులకు ఆదర్శం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని స్థాపించాలన్నారు. ఇందుకు రాజకీయ పార్టీలకు అతీతంగా, అందరి భాగస్వామ్యం ఉండాలన్నారు. అన్ని సంఘాల నాయకులు, ప్రజాప్రతి నిధులు సహకరించాలన్నారు. మండల పెద్దపరిమి ఆల్లే రవీందర్ భావాని, సంఘం జిల్లా సలహాదారులు పేర్ల లింగ మూర్తి, మండల ప్రధాన కార్యదర్శి శంకరయ్య, గ్రామ అధ్యక్షులు శరత్‌బాబు, ప్రధాన కార్యదర్శి రత్నాకర్, ఉపాధ్యక్షులు శంకర్‌రావు పాల్గొన్నారు.

నవతెలంగాణ







డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు అదనపు మాప్ అప్ ప్రకటన విడుదల

నవతెలంగాణ-మట్టెవాడ

బీఎస్సీ అలాయిడ్ హెల్త్ సైన్సెస్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు అదనపు మాప్ అప్ విడత వెబ్ కౌన్సిలింగ్‌కు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 2వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 4వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు అర్హులైన అభ్యర్థులు కళాశాలల వారీగా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. కళాశాల వారిగా మిగిలిపోయిన సీట్ల వివరాలను వెబ్సైట్‌లో చూసుకోవచ్చు. మరింత సమాచారానికి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్.తెలంగాణ.జీవో.ఇన్ వెబ్ సైట్లో సంప్రదించాలని యూనివర్సిటీ వర్గాలు ఒక ప్రకటనలో వెల్లడించారు.

పారదర్శకంగా ఎరువులు అందించాలి : తహశీల్దార్ రమేష్ బాబు

నవతెలంగాణ-పెద్దవంగర



రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ఎరువులు, విత్తనాలు అందించాలని తహశీల్దార్ రమేష్ బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మన గ్రోమోర్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాల విక్రయాలకు సంబంధించిన పలురికార్డులను, స్టాక్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతుల అవసరాల మేరకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. యూరియా కొరత లేకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మన గ్రోమోర్ మేనేజర్ మంచినీళ్ల సురేష్, ఫీల్డ్ ఆఫీసర్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రక్షిత కుటుంబాన్ని కళాశాల యాజమాన్యం ఆదుకోవాలి

విద్యార్థి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా



నవతెలంగాణ-నర్సంపేట

ఇటీవల ఆత్మహత్య చేసుకొన్న రక్షిత విద్యార్థినీ కుటుంబానికి జయముఖి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ముగ్దుంపురం గ్రామంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, డీవైఎఫ్ఐ పట్టణాధ్యక్షులు గడ్డమీద బాలకృష్ణ మాట్లాడుతూ ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న రక్షిత అనే విద్యార్థినీ వ్యక్తిగత కారణాలతోనే కాకుండా కళాశాల యాజమాన్యం లాంగ్ ఆబ్సెంట్, బ్యాక్‌లాగ్ ఉన్నాయని డబ్బులు తీసుకరావాలని వొత్తిడి చేశారన్నారు.రక్షిత మృతికి కళాశాల యాజమాన్యం బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాలలో అధిక ఫీజులు, అకారణంగా విధించే ఫీజులను వసూళ్ళ చేయడం మానుకోవాలన్నారు. విద్యార్థులపై వేధింపుల చర్యలకు స్వస్తి పలుకాలని డిమాండ్ చేశారు. వెంటనే విద్యార్థినీ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించకపోతే ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దినేష్, రాకేష్, కార్తీక్, దేవ, ప్రశాంత్, రవీందర్, కృష్ణ, ప్రమోద్, రఘు, వినయ్, రాము తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మంత్రి

నవతెలంగాణ-దేవరుప్పుల



మండల కేంద్రంలోని భార్గవి గార్డెన్స్‌లో కామారెడ్డి గూడెం బిఆర్ఎస్ నాయకుడు మరాఠీ యాదగిరి-అండాళ్ కుమారుడు సురేష్-నవ్య వివాహానికి బుధవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హజరై వారిని ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్, మాజీ అధ్యక్షులు మొలుగూరి రమేశ్,జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి చింత రవి, ఉప సర్పంచ్ మరాఠీ కృష్ణ,మాజీ సర్పంచ్ చింత సోమయ్య,గ్రామ అధ్యక్షులు ఎళ్ళబోయిన గిరి యాదవ్,మండల అధికార ప్రతినిధి సుడిగేల హనుమంత్, బిఆర్ఎస్ నాయకులు తాటిపెల్లి మహేష్, బిళ్ల యాదవ రెడ్డి, లోడంగి వెంకటేశ్వర్లు, శీల తిరుమలేశ్, జక్కుల కుమార్, మొలుగూరి సోమ నర్సయ్య,గుండుసోమేశ్వర్,మోలుగూరి నర్సయ్య, మొలుగూరి శేఖర్ పాల్గొన్నారు.

అన్యాయం చేస్తే సహించేది లేదు

ఇందిరమ్మ ఇండ్ల సాధన కమిటీ నాయకులు

నవతెలంగాణ-జనగామ



జనగామ పట్టణంలోని ఇండ్ల పట్టాలు ఉన్న మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులకు అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదని మూడో విడత ఇందిరమ్మ ఇండ్ల సాధన కమిటీ నాయకులు కొమ్మగోని రాజు అన్నారు. చిట్యాల ఐలమ్మ నగర్ డబల్ బెడ్ రూమ్‌ల వద్ద మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారుల రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 17వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కొమ్మగోని రాజు మాట్లాడారు. సర్వే పేరుతో కాలయాపన చేస్తూ గత కాంగ్రెస్ ప్రభుత్వం 2012 -13 సంవత్సరంలో మూడో విడత ఇందిరమ్మ పథకం ద్వారా పట్టాలిచ్చి స్థలాలు చూపించడం మరిచారన్నారు. ఇంటి స్థలాలను చూపించి డబుల్ బెడ్ రూమ్ నిర్మించి ఇవ్వాల్సిన ప్రభుత్వ అధికారులు సర్వేల పేరిట కాలయన చేస్తున్నారన్నారు. తమకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధన కమిటీ నాయకులు ఉప్పల సంతోషిని, భవాని, కరుణ, పెంటల ఉమారాణి, శీలం లీల తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

నవతెలంగాణ-పాలకుర్తి

వైయస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసి కూల్చిన దుండగులను వెంటనే శిక్షించాలని వైయస్సార్ డిపి తెలంగాణ స్టూడెంట్ కోఆర్డినేటర్ లాకావత్ విజయ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం పాలకుర్తిలో ఆయన మాట్లాడుతూ వైయస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైయస్ షర్మిల ప్రజాప్రస్థానం పాదయాత్రలో భాగంగా 3800 కిలోమీటర్ల సందర్భంగా పెద్ద వంగర మండలం అవుతాపూర్‌లో ఏర్పాటు చేసిన దివంగత ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేశారని తెలిపారు. విగ్రహ ఏర్పాటుతో జీర్ణించుకోలేని దుండగులు గత రాత్రి ఎవరో గుర్తుతెలియని దుండగుల్ల వ్యవహరించి ఆ విగ్రహాన్ని ధ్వంసం చేశారని విజయ్ నాయక్ అన్నారు. బిఆర్ఎస్ నాయకులు గుండా గిరీలు చేసి విగ్రహం ధ్వంసం చేశారని ఆరోపించారు.

బియ్యం పట్టివేత



నవతెలంగాణ-కేసముద్రం రూరల్

కేసముద్రం మండలం కల్వల గ్రామ శివారులో ఈనెల 1న మధ్యాహ్నం పోలీసులు తనిఖీ చేస్తుండగా బొలెరోలో ఇద్దరు వ్యక్తులు 50 బస్తాలు(25 క్వింటాల) బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. ఈ బోలెరోలో వర్ధన్నపేటకు చెందిన నేతావత్ యాకయ్య, అంగోతు సుమన్ ఈ బియ్యాన్ని తరలిస్తున్నారు. వీరితో పాటు మాలోత్ సంతోష్, మూడ్ ప్రవిన్‌లు వర్ధన్నపేటకు చెందిన నలుగురు కలిసి బియ్యం వ్యాపారం చేస్తున్నట్లు, వీరుతాళ్ళపూసపల్లిలో గండి భద్రయ్య వద్ద ఈ బియ్యాన్ని ఖరీదు చేసి వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వాహనం సీజ్‌చేసి ఐదుగురుపై కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలి : శర్మ

నవతెలంగాణ-పెద్దవంగర

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా వృద్ధి చెందాలని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కేసీఆర్ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సహకారంతో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణతో పాటుగా, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ఇంచార్జ్ సీసీ పద్మ, యాదవ సంఘం అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీతీ ఆత్మకు శాంతి చేకూరలని కొవ్వొత్తుల ర్యాలీ

నవతెలంగాణ-గార్ల

వేధింపులకు గురై మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుని మరణించిన డాక్టర్ ప్రీతీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరలని మండల ఆరోగ్య కేంద్రం అధ్వర్యంలో స్థానిక నెహ్రూ సెంటర్‌లో బుధవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సీనియర్ వైద్య విద్యార్థి సైఫ్ వేధింపులకు గురి చేస్తున్న పట్టించుకోని హెచ్‌ఓడి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు రాజ్‌కుమార్ జాదవ్ జడ్పీటీసీ జాటోత్ ఝాన్సీ లక్ష్మీ, స ర్పంచ్ అజ్మీర బన్సీలాల్, కందునూరి శ్రీనివాస్, యం.వెంకట్ లాల్, కె.శ్రీనివాస్, జి.లక్ష్మణ్ నాయక్, ఎ.సత్యవతి, సిహెచ్.మౌనిక,ఆర్. విమల్ కుమార్ జైన్, బి.నాగేశ్వరావు, జి.సక్రు, యం.శివ, యం.శాంతి కుమార్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మరో స్వతంత్ర ఉద్యమ పోరాటానికి యువత ఆలోచించాలి

పీవైఎల్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు జి.సక్రు

జిల్లా అధ్యక్షులు పాపయ్య

నవతెలంగాణ-బయ్యారం



ప్రగతి శీల యువజన సంఘం (పివైఎల్) మండల నిర్మాణ జనరల్ కౌన్సిల్ బుధవారం బాలాజీపేటలో అమరుడు బండారి శ్రీను పొడుపుగంటి యాకయ్య నగర్‌లో నిర్వహించడం జరిగింది. ఈ నిర్మాణ జనరల్ కౌన్సిల్లో పివైఎల్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు జి సక్రు, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సామ పాపయ్య ముఖ్యవక్తలుగా పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్య కాంక్షలు రగిలించి చెరసాలలో బంధించిన విప్లవమే జీవితంగా ఉద్యమమే ఊపిరిగా తన 24 వ ఏటనే ప్రాణాన్ని తణప్రాయంగా అర్పించారని, చంద్రశేఖర్ ఆజాద్ దేశభక్తికి నిలువెత్తు నిదర్శనమైన స్నేహానికి చెరగని చిరునామా ఆదర్శవంతమైన నాయకత్వానికి మారుపేరుగా పరిపూర్ణమైన వ్యక్తిగా అసలు సిసలైన ఉద్యమ బహుట ఎగిరేసి బ్రిటిష్ ముష్కరులను గడగడలాడించి బ్రిటిష్ ముష్కరులను ఎందరినో హతమార్చి తనకు తానుగా తన ప్రాణాల్ని భరతమాత దాస్య శృంకాల విముక్తికై అర్పించుకున్నారని అన్నారు. చంద్రశేఖర్ అజాద్, భగత్ సింగ్, రాజగురు సుఖదేవ్, అల్లూరి లాంటి విప్లవ వీరులు నడిచిన నేలలో ఉరికోయలను ముద్దాడడం అక్రమంపై ఉక్కు పాదం మోపడమే తెలిపిన పోరాటం విప్లవ యోధుల బాటలో మనం వారి లక్ష్యాలను ఆచరించడం సదాసహితుకం అయ్యారని అన్నారు. వారి ఆశయాలను నేడు ప్రతీ యువతరం నడుము బిగించవలసిన సమయం అసన్నమైందని మరో స్వతంత్ర ఉద్యమ పోరాటానికి ఈ దేశ యువత ఆలోచించాలని వారన్నారు.నేడు యువతరాన్ని 5జి స్పీడ్‌తో పాలకులు చెడగొడుతున్నారని అరచేతుల్లో సెల్ ఫోన్లతో ప్రపంచాన్ని చూపిస్తూ నిలిచిత్రాలకు పబ్జి గేమ్లకు వాట్సప్ ట్విట్టర్ ఫేస్బుక్లో ఎందుకు పనికిరాని వారిగా చేస్తూ సెల్ఫోన్లకు బానిస అయ్యే విధంగా యువత చెడిపోయే విధంగా వారి భవితవ్యం ఎంతవరకు నాశనం చేయాలో అంతవరకు చెడగొడుతున్నారని అన్నారు. పాశ్చాత సంస్కృతికి అలవాటు చేస్తూ విష బీజాలను వారి మెదడులో నింపుతూ పాలకులువారి జీవితాన్ని సర్వనాశనం చేస్తున్నారన్నారు. యువత నేడు ఉద్యోగాలు లేక ఉపాధి అవకాశాలు లేక చిల్లరైన దొరకక కన్నవారికి భారం గాక హమాలీలుగా కార్మికులుగా శ్రామికులుగా రోజువారి వేతన కూలీలుగా మారి 75 సంవత్సరాల స్వతంత్ర భారత వనిలో ఇంకా బికారీలుగా రోడ్లపై రోడ్ల వెంబడి తిరుగుతున్న చిల్లర కోసం ఈ ఆశించవలసిన దుస్థితికి నేడు యువత దిగజారిందని వారన్నారు. అందుకే యువత నేటి ఈ అసాంఘిక అసమాన శక్తులపై అవగాహన ఎంతైనా పెంచుకోవాలి యువతరాన్ని సంఘటిత పరిచి ప్రగతిశీల యువకులుగా ఈ సామ్రాజ్యవాదం మదమెక్కిన మత గజ్జాలను మావంటివలె ఆదరించి సర్వశక్తులు గల వీరులుగా విప్లవ ధీరులుగా తీర్చిదిద్దడానికి ప్రగతిశీల యువజన సంఘం పోరాడాలని పిలుపు నిచ్చారు.ఈ జనరల్ కౌన్సిల్ కు ముందుగా పివైఎల్ జెండాను పివైఎల్ సీనియర్ నాయకులు ఏర్ని వెంకటేశ్వర్లు జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడిబోయిన రమేష్, సురేష్, జలగం అన్వేష్, సుమన్, సూరబోయినలక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మిలియన్ మార్చ్ స్ఫూర్తితో తెలంగాణను కాపాడుకోవాలి

నవతెలంగాణ-నర్సంపేట



మిలియన్ మార్చ్ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోవాలని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలో ఈ నెల 10న తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ బచావో సదస్సును జయప్రదం చేయాలని ముద్రించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలను వంచించి పాలన సాగిస్తున్నాడన్నారు. అమరుల త్యాగాలను, ఉద్యమ ఆకాంక్షలను మరిచి అక్రమ సంపాదన, ఆధిపత్య రాజకీయాల కోసం ప్రజల ప్రయోజనాలను తాకట్టుపెడుతున్నాడని విమర్శించారు.నిరుద్యోగులకు ఉద్యోగాల అవకాశాలను కల్పించకుండా వారి ఆత్మహత్యలకు కారకుడైయ్యాడని ఆరోపించారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చి నాలుగురన్న లక్షల కోట్ల అప్పులు చేసి భారాన్ని మోపుతున్నాడని దుయ్యపట్టారు.ఈ పరిస్థితిల్లో కేసీఆర్ నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ఉద్యమ శక్తులు ఏకమై మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. 10న నిర్వహించనున్న సదస్సుకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ జావెద్, బొనగాని రవీందర్, వరంగల్ జిల్లా అధ్యక్షులు గుంటి రామచందర్, కార్యదర్శి వెలిశాల రాజేష్, గుంటి సంజీవ, ఎండీ.సంధాని, ఎండీ.యాకూబ్, ఎండీ. నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీ జయప్రదం చేయండి : జంగారెడ్డి

నవతెలంగాణ-జనగామ

కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, కూలీల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5వ తేదీన దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున నిర్వహించు ధర్నా కార్యక్రమంకు రైతులు కార్మికులు కూలీలు పెద్ద ఎత్తున తరలిరావాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పీజంగారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారంజిల్లా కేంద్రంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లా సదస్సు సిఐటియు జిల్లా అధ్యక్షులు బొట్ల శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సింగారపు రమేష్, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పీ.జంగారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామిని తుంగలో తొక్కింది. కనీస మద్దతు ధరల చట్టం చేస్తానని అమలు చేయలేదు. రైతుల ఆత్మహత్యల పరంపర ఆపడానికి ఈ బడ్జెట్‌లో ఏరకమైన కేటాయింపులు చేయలేదు.పైగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ)కు కేటాయించాల్సిన నిధులను పూర్తిగా తగ్గించి వేశారు. పత్తి కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం ఏచర్యలు తీసుకోవడంలేదు.ఫలితంగా మధ్య దళారీలు రైతుల నుండి కనీస మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. ఎరువుల సబ్సీడిని కుదించడం వల్ల రైతాంగానికి, ఆహార భద్రతకు తీవ్ర ముప్పు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలలో పేదలకు ఉపాధిని చూపిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు కోత పెట్టిందని అన్నారు. కనీస 100 రోజులు పని కల్పించాలంటే 2 లక్షల 25 వేల కోట్లు అవసరమవుతుంది. కానీ కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం కంటే నిధులు తగ్గించిందన్నారు. బ్రిటిష్ కాలం నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న 27 కార్మిక చట్టాలను రద్దుచేసి పనిగంటల విధానాన్ని పెంచి కార్మికులు యూనియన్ పెట్టుకునే అవకాశాన్ని లేకుంటే చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల నడ్డి వీరుస్తున్నారని సుప్రీంకోర్టు చెప్పిన విధంగా కనీసవేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసనగా ఏప్రిల్ 5న ఢిల్లీ కార్మిక కర్షక బహిరంగ సభ ఉంటుందని కేంద్ర ప్రభుత్వ విధానాలపై కార్యాచరణ ప్రకటించారు. మార్చి 17 మండల సదస్సులు జరపాలని, జిల్లాలోని అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున కరపత్రాలు, పోస్టర్లు, కార్నర్ మీ టింగ్స్, పాదయాత్రలు నిర్వహించి మార్చి 24,25 తేదీలలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార జీపు జాత ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సదస్సులో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మోకు కనకారెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదునూరి వెంకట్రాజం, సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందు నాయక్, సిఐటియు జిల్లా కోశాధికారి చుంచు విజేందర్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అన్నబోయిన రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పోతుకనూరి ఉపేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాసహాయ కార్యదర్శిగంగాపురం మహేందర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామావత్ మీట్యా నాయక్ సిఐటియు నాయకులు జోగు ప్రకాష్ తాండ్ర ఆనందం కచ్చ గళ్ళ వెంకటేష్ రైతు సంఘం నాయకులు ఉరుసు కుమార్ సమ్మయ్య కరుణాకర్ వీరితోపాటు పెద్ద ఎత్తున రైతులు కార్మికులు వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

యువత ఏజెన్సీ ప్రజల అభివృద్ధికి సహకరించాలి

ఏజెన్సీ ప్రజలకు అండగా పోలీసులు - మహబూబాబాద్ ఎస్పీ శరత్ చంద్ర పవార్

నవతెలంగాణ-కొత్తగూడ



ఏజెన్సీ గ్రామాల యువత ఉన్నత చదువులు చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించి ఏజెన్సీ ప్రజల అభివృద్ధికి సహకరించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం మహబూబాద్ జిల్లా గంగారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ మెగా వైద్య శిబిరంలో 1200 మందికి 29 మంది వివిధ విభాగాల డాక్టర్లచే వైద్య పరీక్షలు నిర్వహించారు. అంతే కాకుండా ఐఎంఏ మహబూబాబాద్, బ్లూ క్రాస్ కలిసి 25 వేల రూపాయల విలువైన జనరిక్ మెడిసిన్‌లను,రోటరీ క్లబ్ నర్సంపేట ఆధ్వర్యంలో పదివేల రూపాయల విలువైన జనరిక్ మెడిసిన్‌ను డొనేట్ చేశారు. ఈ మెగా వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ శరత్ చంద్రపవార్ మాట్లాడుతూ ఏజెన్సీలోని అమాయక గిరిజనులను అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తుందన్నారు. కానీవారిని నిషేధిత సంఘవిద్రోహ శక్తులు పెడదోవ పట్టిస్తున్నాయన్నారు. ఎవరైనా అలాంటివారు భయభ్రాంతులకు గురిచేసిన, మాయమాటలు చెప్పి పెడదోవ పట్టించిన పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.మారుమూల గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేయడం ద్వారా సామాన్య ప్రజలకు పోలీసుల అండ ఉందని తెలియచెప్పటమేనన్నారు. ఏజెన్సీ యువత చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉన్నత చదువులు చదువుకొని గ్రామాల అభివృద్ధికి సహకరించాలని అన్నారు.ఈవైద్య శిబిరంలో ఏఎస్ఎంలు 20 మంది, ఆశా వర్కర్లు 40 మంది, ల్యాబ్ టెక్నీషియన్లు ఆరుగురు పాల్గొని సేవలందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, మహబూబాద్ ఇన్చార్జి డిఎస్పి రమణబాబు, గూడూరు సీఐ యాసీన్, బయ్యారం సీఐ బాలాజీ, ఎస్సైలు ఉపేందర్, సతీష్, దిలీప్, రమాదేవి, పోలీస్ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ పనులలో వేగం పెంచండి

హన్మకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

నవతెలంగాణ-వరంగల్



స్మార్ట్‌సిటీ పనులలో వేగం పెంచాలని హన్మకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు.బుధవారం కుడా కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్మార్ట్‌సిటీ పనుల పురోగతిని కమిషనర్ ప్రావీణ్యతో కలిసి సమీక్షించి నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయుటకు తగు సూచనలు చేశారు. నగరానికి నాలుగు వైపులలో ఏర్పాటు చేస్తున్న ముఖ ద్వారాలు, భద్రకాళి బండ్‌లో ఫుడ్ కోర్ట్, మరుగుదొడ్ల, గ్రీనరీ, వడ్డేపల్లి బండ్ పై కొనసాగుతున్న రిటైనింగ్ వాల్, సియాస్క్, స్టైయిర్ కేస్, ఉర్సు వద్ద కొనసాగుతున్న గణేష్ నిమజ్జన ట్యాంక్, అజార హాస్పిటల్ వద్ద నిర్మిస్తున్న కల్వర్టు రీటైనింగ్ వాల్, ప్రెసిడెన్సీ స్కూల్ వద్ద కల్వర్టు పనులు, బాల సముద్రం, పోతననగర్‌లో కొనసాగుతున్న ద్వితీయ చెత్త తరలింపు కేంద్ర నిర్మాణ పనులు, అమ్మవారి పేటలో 150 ఎంఎల్డి కెపాసిటీతో ఏర్పాటు చేస్తున్న ఎఫ్ఎస్టిపి పనుల పురోగతి, 5 ఎంఎల్డి,15 ఎంఎల్డి సామర్థ్యంతో కొనసాగుతున్న ఎస్టిపి పనులు, బయో మైనింగ్ పనుల పురోగతిపై సుదీర్ఘంగా సమీక్షించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుత్తేదారులు మెన్ అండ్ మెటీరియల్ పెంచి అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేలా చూడాలని, పూర్తయిన పనులకు బిల్లుల చెల్లించడం జరుగుతుందని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సిటీ ప్లానర్ వెంకన్న, కుడా పిఓ అజిత్ రెడ్డి, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సిహెచ్ఓ శ్రీనివాసరావు, ఈఈలు రాజయ్య, బిఎల్ శ్రీనివాసరావు, డిసిపి ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాక్రేకు ఘన స్వాగతం

నవతెలంగాణ-గూడూరు

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మానిక్రావ్ తాక్రేకు గూడూరు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. బుధవారం రాత్రి గూడూరు మీదుగా ములుగు జిల్లా కేంద్రానికి వెళుతుండగా కాంగ్రెస్ శ్రేణులు శాలువాతో ఘనంగా సన్మానించారు.మానిక్రావ్ తాక్రే వెంట మాజీ కేంద్రమంత్రి బలరాం నాయక్ ఉన్నారు.గూడూర్ బ్లాక్ అధ్యక్షులు, గూడూరు సర్పంచ్ నునావత్ రమేష్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు కత్తి స్వామి, మైనార్టీ రాష్ట్ర నాయకులు యాకుబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.



విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి : డాక్టర్ భరత్ కుమార్

నవతెలంగాణ-వర్ధన్నపేట

విద్యార్థులు విద్యపై దృష్టి సారించి నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డాక్టర్ భరత్ కుమార్ అన్నారు. బుధవారం వర్ధన్నపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్ఎంసి చైర్మన్ ఆధ్వర్యంలో డాక్టర్ భరత్ తన సొంత ఖర్చులతో 100 మంది విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ భరత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే అర్హతగల ఉపాధ్యాయుల చేత నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందన్నారు. నేను చిన్ననాటి నుండి ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించి డాక్టర్ అయ్యానని తెలిపారు.మీరు విద్యార్థులందరూ లక్ష్యాలను ఎంచుకొని తదనుగుణంగా చదువుకొని మంచి విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు ఎల్లవేళలా తన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులు డాక్టర్ భరత్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నరసయ్య భ్యూలాహెూ రాజకుమారి, అనిత,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

నవతెలంగాణ-దంతాలపల్లి

మండలంలోని కుమ్మరి కుంట్ల గ్రామంలో ఎంపీపీ ఎస్ ప్రభుత్వ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చక్కని అలంకారణతో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠశాలలో తోటి స్నేహితులకు అర్థమయ్యే రీతిలో పాఠలను బోధించారు. అనంతరం జరిగిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రమౌళి మాట్లాడుతూ నిత్యజీవితంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు ఏవిధంగా పాటలను బోధిస్తారో ఈ స్వయం పాలన దినోత్సవం వల్ల విద్యార్థులకు తెలుస్తుందని, ఉపాధ్యాయుల పట్ల, ఉపాధ్యాయ వృత్తిపట్ల గౌరవభావం ఏర్పడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీను, మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

కబ్జా చెరలో ప్రభుత్వ భూమి

నవతెలంగాణ-చెన్నారావుపేట

మండల కేంద్రంలోని లింగగిరి గ్రామంలోని సర్వేనెంబర్ 289 లోని 13 ఎకరాల 10 గంటల కబ్జా చేరలో ఉన్న ప్రభుత్వ భూమినీ జిల్లా యంత్రాంగం స్పందించి త్వరగా సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని గుడిసెలు వేసుకున్న పేదవారికి 58 జీవో ప్రకారం పట్టాలు ఇచ్చి వారిని ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మండల తహసిల్దార్‌కు డిమాండ్లతో కూడిన లిఖిత పూర్వకమైన నివేదిక సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లింగగిరి గ్రామంలోని 289 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయ్యిందని, కొంతమంది వ్యక్తులు ఆ భూమిని కాచేయడం కోసం తీవ్ర ప్రయత్నాలను కొనసాగిస్తున్నారని, కొంత భూమిని అక్కడ ఉన్నటువంటి కొంత మంది వ్యక్తులు కబ్జా చేశారని, ప్రభుత్వం ప్రభుత్వ అధికార యంత్రాంగం కనీసం ఆ భూమి మీద దృష్టి పెట్టడం లేదని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేదలను సమీకరించి మూడు వందల మంది ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలు ఆ భూమిని ఆక్రమించి కాపాడుతున్నారని, ప్రభుత్వ భూమిని కాపాడడం చేతగాని అధికార యంత్రాంగం ఆ భూమిని కాపాడడం కోసం గుడిసెలు వేస్తే పోలీసుల చేత గుడిసెలను తొలగించాలని తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తుందని ఆయన అన్నారు.13 ఎకరాల 10గుంటల భూమికి హద్దులు నిర్ణయించకుండా ఆభూమిని వెలికి తీయకుండా రెవెన్యూ యంత్రాంగం చోద్యం చూస్తుందని, ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం యంత్రాంగానికి రెవెన్యూ యంత్రాంగానికి బాధ్యత లేదా అని ఆయన గుర్తు చేశారు. లక్షలాది రూపాయలు పెట్టి ఇంటి స్థలాలు కొనుక్కోలేక సొంత ఇల్లు కట్టుకోలేక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఈ విషయాలను ప్రభుత్వం మానవతా దృష్టితో ఆలోచించి అర్హులైన పేదలను గుర్తించి వారందరికీ 58 జీవో ప్రకారం ఇంటి స్థలాలను కేటాయించాలని గుడిసేవాసులపై దురుసుగా ప్రవర్తిస్తున్న అధికార యంత్రాంగానికి ప్రభుత్వం ద్వారా హెచ్చరిక చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు నమిండ్లస్వామి, మండల కార్యదర్శి మొగులూజుశారదా, మాదారం కేశవులు, నూనె మల్లికాంబ, స్వామి, రవి, శ్రీను పాల్గొన్నారు.

చరిత్రాత్మక దేవాలయాలను కాపాడుకోవాలి

త్రిదండి చిన్న జీయర్ స్వామి

నవతెలంగాణ-రాయపర్తి

చరిత్రత్మక దేవాలయాలను కాపాడుకోవాలి అని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి అన్నారు. బుధవారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, సతీమణి ఉష దయాకర్ రావుతో సన్నూరు స్వయం వ్యక్త శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల రామకృష్ణ చార్యులు పూర్ణకుంభం, పూలమాలలతో వారిని ఘనంగా స్వాగతించారు. స్థానికుల కోలాట ఆటలు, యాదవ రాజుల డోలు చప్పులు, చిన్నారుల నత్యాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఆయన ప్రవచనాలు చెప్పారు. ఆలయాలు బాగుంటేనే సమాజం బాగుంటుంది అన్నారు. స్వాతంత్ర్యానికి ముందు తర్వాత ఆలయాల భూములు అన్యాక్రాంతం అయ్యాయి అని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఆలయాలకు పూర్వ వైభవం వచ్చిందన్నారు. ఘన చరిత్ర కలిగిన వెంకటేశ్వర ఆలయానికి ప్రభుత్వం 10 కోట్ల రూపాయలు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. దేవాలయాలు బాగుంటేనే శాంతియుత సమాజం ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరిలో దైవం దాగుంటుందని ఒకరినొకరు గౌరవించుకున్నప్పుడే శాంతి పరిడవిల్లుతుందన్నారు. శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయాన్ని అనతి కాలంలోనే అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటిసి రంగు కుమార్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు బిర్లా సుధీర్ రెడ్డి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ సురేందర్ రావు, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి విషయంలో సైఫ్ వేధింపులు నిజమే

నిర్ధారించిన కేఎంసి ఆంటీ రాగింగ్ కమిటీ

నవతెలంగాణ-మట్టెవాడ

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కాకతీయ మెడికల్ కళాశాల పిజి మొదటి సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థిని దరావత్ ప్రీతి ఆత్మహత్య చేసుకున్న ఉదంతంలో ఆరోపణలు ఎదుర్కొని రిమాండ్ ఖైదీగా జైలుకు వెళ్లిన సీనియర్ వైద్య విద్యార్థి సైఫ్ వేధింపులు నిజమేనని కాకతీయ మెడికల్ కళాశాల పాలక కమిటీ (యాంటీ ర్యాగింగ్ కమిటీ) నిర్ధారించింది. ఢిల్లీలోని యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఆదేశాల మేరకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనలను అనుసరించి బుధవారం కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దివ్వెల మోహన్దాస్ అధ్యక్షతన 14 మంది వివిధ శాఖల నిపుణులతో కూడిన సభ్యులతో కూడిన యాంటీ ర్యాగింగ్ కమిటీ కాకతీయ మెడికల్ కళాశాలలో సమావేశం అయ్యారు. కాకతీయ మెడికల్ కళాశాలలోని అనస్తీసియా బోధకులతో ముఖాముఖిగా మాట్లాడి ఆత్మహత్య చేసుకున్న ప్రీతి వేధించిన సైఫ్‌కు సంబంధించిన వివరాలను కౌన్సిలింగ్ ఇచ్చిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రీతితో పాటుగా పీజీ చదువుతున్న అనస్త్రీషియా మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో పాటు సీనియర్ వైద్య విద్యార్థులను కళాశాలలో ప్రీతి సైఫ్‌ల మధ్య జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో చనిపోయిన వైద్య విద్యార్థిని ప్రీతి విషయంలో సీనియర్ విద్యార్థి సైఫ్ కావాలనే దురుద్దేశంతో డ్యూటీని సాగుగా చూపి వేధించడం చేసినట్లుగా కమిటీ సభ్యులు నిర్ధారణకు వచ్చారు. ఇదే విషయాన్ని నివేధికలో పొందుపరిచి పై అధికారులకు పంపించారు. నివేధికను అనుసరించి సైఫ్ పై ఎలాంటి చర్యలకు ఉపక్రమిస్తారో వేచి చూడాల్సిందే. ర్యాగింగ్ కమిటీలో సమావేశం అయిన వారిలో వరంగల్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బోనాల కిషన్, హన్మకొండ ఆర్డిఓ వాసుచంద్ర, ఫోరెన్సిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజా మాలిక్, పెర్మటాలజీ ప్రొఫెసర్ దామోదరి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అరూరి పరామర్శ

నవతెలంగాణ-ఐనవోలు

మండలం కొండపర్తి గ్రామానికి చెందిన గద్దల ప్రశాంత్, బొక్కల రాజు అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

12 శాతం పెరిగిన జీఎస్టీ వసూళ్లు

- ఫిబ్రవరిలో రూ.1,49,577 కోట్లు వసూళు
- కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ : జీఎస్టీ వసూళ్లు 12 శాతం పెరిగాయని, ఫిబ్రవరిలో రూ.1,49,577 కోట్లు వసూళు అయిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేసింది. సీ జీఎస్టీ రూ.27,662 కోట్లు, ఎస్‌జిఎస్‌టి రూ.34,915 కోట్లు, ఐజీఎస్టీ రూ.75,069 కోట్లు, సెస్ రూ.11,931 కోట్లు వసూళు అయినట్టు తెలిపిం ది. గతేడాది ఫిబ్రవరిలో వచ్చిన జీఎస్టీ ఆదాయం (రూ.1,33,026 కోట్లు) కంటే, ఈ ఏడాది ఫిబ్రవరిలో 12 శాతం జీఎస్టీ ఆదాయం పెరిగిందని పే ర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో రూ.3,557 కోట్లు వసూలు కాగా, అది గతేడాది (రూ.3,157 కోట్లు)తో పోల్చితే 13 శాతం పెరిగింది. తెలంగాణలో 4,424 కోట్లు వసూలు కాగా, అది గతేడాది (రూ.4,113 కోట్లు)తో పోల్చితే 8 శాతం పెరిగింది.

పెరిగిన నిరుద్యోగ రేటు

- ఫిబ్రవరిలో 7.45 శాతం నమోదు
- హర్యానాలో అత్యధికం...ఛత్తీస్‌గఢ్ అత్యల్పం

న్యూఢిల్లీ : దేశంలోని నిరుద్యోగ రేటు మళ్లీ పెరిగింది. ఫిబ్రవరిలో 7.45 శాతం నమోదు అయింది. ఈమేరకు బుధవారం సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దేశంలో 7.45 శాతం నిరుద్యోగ రేటు నమోదు అయింది. పట్టణ నిరుద్యోగ రేటు 7.93 శాతం కాగా, గ్రామీణ నిరుద్యోగం 7.23 శాతం నమోదు అయింది. జనవరిలో 7.14 శాతం నిరుద్యోగ రేటు ఉండగా, అది ఫిబ్రవరి నాటికి 7.45 శాతానికి పెరిగింది. దేశంలో అత్యధికంగా నిరుద్యోగ రేటు నమోదు అయిన రాష్ట్రాల్లో 29.4 శాతంతో హర్యానా మొదటి స్థానంలో నిలిచింది. 28.3. శాతంతో రాజస్థాన్ రెండో స్థానంలో నిలిచింది. 21 శాతంతో సిక్కిం, 17.1 శాతంతో జమ్మూ కాశ్మీర్, 16.8 శాతంతో జార్ఖండ్, 13.9 శాతంతో హిమాచల్ ప్రదేశ్, 12.3 శాతంతో బీహార్, 11.7 శాతంతో త్రిపుర, 11.1 శాతంతో గోవా, 8.6 శాతం ఢిల్లీ, అసోం, 8.2 శాతంతో పంజాబ్ తరువాత స్థానాల్లో నిలిచాయి. మిగిలిన రాష్ట్రాలన్నీ జాతీయ సగటు కంటే తక్కువ నిరుద్యోగ రేటును నమోదు చేసుకున్నాయి. 0.8 శాతంతో ఛత్తీస్‌గఢ్ అత్యల్ప నిరుద్యోగ రేటు నమోదు చేసుకుంది.

తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగం స్వల్పంగా..

తెలుగు రాష్ట్రాలల్లో ఆంధ్రప్రదేశ్‌లో 6.6 శాతంతో జాతీయ సగటు కంటే తక్కువ నిరుద్యోగ రేటు నమోదు అయింది. అయితే ఏపీలో జనవరి నెలలో 5.5 శాతం నిరుద్యోగ రేటు నమోదు కాగా, ఫిబ్రవరి నాటికి 6.6 శాతానికి పెరిగింది. తెలంగాణలో 5.8 శాతంతో జాతీయ సగటు కంటే తక్కువ నిరుద్యోగ రేటు నమోదు అయింది. అయితే గత నెల (జనవరి) కంటే ఇప్పుడు కాస్తా పెరిగింది. జనవరిలో 5.3 శాతం నిరుద్యోగ రేటు నమోదు కాగా, ఫిబ్రవరిలో 5.8 శాతానికి పెరిగింది.

రైతు ఆత్మహత్యలు వద్దు...మా దగ్గరికి రండి

- రాష్ట్ర రుణ ఉపశమన కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్లు విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వ్యవసాయంలో వచ్చిన నష్టాలతో అప్పులు తీర్చలేక క్షణికావేశంలో రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దనీ, తమను సంప్రదిస్తే, పరిష్కారమార్గాలు చూపుతామని తెలంగాణ రాష్ట్ర రుణ ఉపశమన కమీషన్ చైర్మెన్ నాగుర్ల వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాలతో రాష్ట్రంలో వ్యవసాయం వృద్ధి చెందిదనీ, రైతుల కోసం అనేక పథకాలు ఉన్నాయని చెప్పారు. వ్యవసాయ అవసరాల కోసం ప్రయివేటు, బ్యాంకుల నుంచి అప్పులు తీసుకొని, నష్టాలపాలై, అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్న ఐదు ఎకరాల లోపు రైతులు, గ్రామీణ చేతివృత్తిదారులు హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్‌లోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. బుధవారం తమ కార్యాలయంలో రుణ బాధిత రైతుల దరఖాస్తుల్ని పరిశీలించి, కోర్టు హాలులో పరిష్కరించినట్టు చెప్పారు. ఇతర వివరాలకు తమ కార్యాలయం నెంబర్ 040-2339 3532 ఫోన్ చేయాలని కోరారు.

వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ : బండి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రానున్న ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ వెల్లడించారు. బీజేపీ మద్దతు ఇవ్వడం వల్లే రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందనీ, కేసీఆర్ సీఎం అయ్యారని తెలిపారు.

బీఆర్ఎస్‌పై సీఎం కేసీఆర్ ఫోకస్

- నేషనల్ జనరల్ సెక్రెటరీగా హిమాన్షు తివారీ
- మహారాష్ట్ర డివిజన్ కో ఆర్డినేటర్ల నియామకం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ విస్తరణపై సీఎం కేసీఆర్ ఫోకస్ చేశారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో భారీ సభ బహిరంగ నిర్వహించిన ఆయన...ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్ర అధ్యక్షుడిని నియమించిన సంగతి తెలిసిందే. తాజాగా నేషనల్ జనరల్ సెక్రటరీగా హిమాన్షు తివారీని నియమించారు. బుధవారం ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ మహారాష్ట్ర డివిజన్ కోఆర్డినేటర్లను ప్రకటించారు. ఇతర రాష్ట్రాల్లో పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా పలు రాష్ట్రాల్లో పార్టీ నేతలను నియమిస్తున్నారు. ఇటీవలే మహారాష్ట్ర బీఆర్ఎస్ కిసాన్ సెల్ అధ్యక్షుడిగా మాణిక్ కదమ్‌ను నియమించిన పార్టీ అధినేత...తాజాగా ఆ రాష్ట్ర డివిజన్ కోఆర్డినేటర్లను నియమించారు. నాసిక్ డివిజన్‌కు దశరథ సావంత్, పుణె డివిజన్‌కు బాలసాహెబ్ జైరాం దేశ్‌ముఖ్, ముంబై డివిజన్‌కు విజయ్‌తనాజీ మోహితే, ఔరంగాబాద్ డివిజన్‌కు సోమ్‌నాథ్ థోరట్, నాగ్‌పూర్ డివిజన్‌కు ద్యానేష్ వాకుడ్కర్, అమరావతి డివిజన్‌కు నిఖిల్ దేశ్‌ముఖ్‌ను కోఆర్డినేటర్లుగా నియమించారు.

నేటి నుంచి ప్రజా రవాణా సంస్థల కబడ్డీ టోర్నమెంట్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అఖిల భారత ప్రజా రవాణా సంస్థల కబడ్డీ టోర్నమెంట్-2023 హకీంపేటలోని టీఎస్ఆర్టీసీ ట్రాన్స్‌పోర్ట్ అకాడమీలో గురువారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్(ఏఎస్ఆర్టీయూ) ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ఈ టోర్నమెంట్‌కు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) ఆతిథ్యం ఇస్తోంది. ఆర్టీసీ ఉద్యోగులకు మానసిక ఉల్లాసంతో పాటు చక్కటి ఆరోగ్యం లభించేందుకు ఏఎస్ఆర్టీయూ ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నదని టీఎస్ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్దన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనర్ తెలిపారు. ఈ కబడ్డీ టోర్నమెంట్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ మహారాష్ట్ర, హర్యానా ఆర్టీసీలతో పాటు నవీ ముంబై, బహణ్ ముంబై, పుణే మహానగర్ పరివాహన్, బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లు పాల్గొంటున్నాయని వివరించారు. కబడ్డీ ట్రోఫీ కోసం మొత్తంగా 9 జట్లు తలపడనున్నాయని పేర్కొన్నారు. ఈ పోటీలను గురువారం ఉదయం 9.30 గంటలకు ఏపీఎస్ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారక తిరుమలరావు ప్రారంభిస్తారు.

సారా అలీఖాన్‌తో షాప్సీ యొక్క తాజా ప్రచారం

నవతెలంగాణ : భారత్ యొక్క అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న హైపర్‌వాల్యూ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ షాప్సీ బై ఫ్లిప్‌కార్ట్ నేడు తమ నూతన ప్రచారంను తమ బ్రాండ్ ప్రచారకర్త సారా అలీఖాన్‌తో కలిసి విడదల చేసింది. ఈ ప్రచారానిన ప్రధానంగా, ఈ ప్లాట్‌ఫామ్ యొక్క సరసమైన ధరలు మరియు విస్తృత శ్రేణి ఉత్పత్తులు మరీ ముఖ్యంగా విలువను కోరుకునే వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని తీర్చిదిద్దారు. ఈ టీవీసీని భారతీయ కుటుంబాలు, తల్లిదండ్రులు తమ పిల్లలు షాపింగ్ కోసం ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టడాన్ని సహించరు అనే నేపథ్యంతో తీర్చిదిద్దారు. ఈ ప్రచారంలో ఏ విధంగా ఆన్‌లైన్‌లో షాప్సీపై షాపింగ్ చేయడం అనేది అత్యంత అందుబాటు ధరలో ఉంటుందనేది తెలపడంతో పాటుగా కుర్తీలు, చీరలు, వాచీలు, గృహ ఉత్పత్తుల విభాగాలలో అత్యుత్తమ విలువను పొందవచ్చునేది తెలుపుతుంది. సారా అలీఖాన్ కథానాయికగా కనిపించే ఈ ప్రచార చిత్రం ద్వారా భారత్ వినియోగదారుల కోసం అత్యంత అందుబాటుధరలలోని షాపింగ్ గమ్యస్థానంగా షాప్సీ నిలుస్తుందనేది వెల్లడిస్తారు.

సిలిండర్‌కు మోడీ బొమ్మ వేయండి

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌కు సబితా విజ్ఞప్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



రేషన్‌షాపుల్లో మోడీ బొమ్మ వేయనందుకు బాధపడిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్...సిలిండర్ ధర పెంచడంతో ప్రజలు బాధపడుతున్నారనీ, ఆ ధరలు పెంచిందోవరో తెలియాలంటే వాటిపై మోడీ బొమ్మ వేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సూచించారు. బుధవారం అసెంబ్లీలో బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ సురభి వాణిదేవిలతో కలిసి సబితా విలేకర్లతో మాట్లాడారు. ఎనిమిదేండ్లుగా మోడీ ప్రభుత్వం ఏదైనా మంచి చేస్తుందేమో అని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. మంచి చేయకపోగా ధరలు విపరీతంగా పెంచేస్తున్నారని విమర్శించారు. తాజాగా సిలిండర్ ధర రూ. 50 రూపాయలు పెంచారని గుర్తు చేశారు. త్వరలోనే మహిళా దినోత్సవం రానున్న నేపథ్యంలో మోడీ సిలిండర్ ధర పెంచి మహిళలకు కానుక ఇచ్చారని ఎద్దేవా చేశారు. బీజేపీ అంటే ప్రజల జేబులు ఖాళీ చేసే పార్టీగా మారిందన్నారు. ధరలు పెంచడం... ప్రజలను ముంచడం బీజేపీ విధానంగా మారిందని విమర్శించారు. ఆదానీ ఆస్తులు కరిగిపోతున్నాయనీ, ఇప్పుడు ధరలు పెంచి ప్రజల ఆస్తులు కూడా కరిగిపోయేలా చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. మహిళలపై మోడీ వివక్షకు సిలిండర్ ధరల పెంపు ఓ ఉదాహరణ అని తెలిపారు. ప్రజలు గ్యాస్ పొయ్యి నుంచి మళ్లీ కట్టెల పొయ్యికి మళ్లేలా ధరలు పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలు మోడీని దేవుడు అంటున్నారనీ, ధరలు పెంచుతున్నందుకు మోడీ దేవుడిలా కనపడుతున్నారా? అని ప్రశ్నించారు. మహిళలు వంటింటికి వెళ్లాలంటే భయపడే పరిస్థితి తెచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వానికి మహిళలే చరమ గీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. మహిళలు బీజేపీకి వ్యతిరేకంగా సంఘటితం కావాలనీ, గురు, శుక్రవారాల్లో నిరసనలు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

సాత్విక్ ఆత్మహత్య...ఆ ఆరోపణలన్నింటిపై విచారణ జరిపిస్తాం

విద్యార్థి సాత్విక్ ఆత్మహత్య బాధాకరమని.. ఈ ఘటనపై విచారణకు ఆదేశించినట్లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడికి గురి చేయవద్దని స్పష్టం చేశారు. ఒత్తిడి ఉండకూడదనే ఎంసెట్‌లో ఇంటర్ వెయిటేజీ తీసేయాలని ముఖ్యమంత్రి చెబుతున్నారని తెలిపారు. సాత్విక్ ఆత్మహత్య విషయంలో వస్తున్న ఆరోపణలన్నింటిపై విచారణ జరిపిస్తామన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.

ఒకేసారి 'ఇంటింటికీ టీడీపీ' ప్రారంభించాలి

- టెలికాన్ఫరెన్స్‌లో కాసాని దిశానిర్దేశం

నవతెలంగాణ - హైదరాబాద్



తెలంగాణ అంతటా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని వచ్చే పది రోజుల పాటు ఉద్యమస్థాయిలో విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ నేతలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అమలుచేసిన అభివద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలనీ, తద్వారా తిరిగి వారి ఆశీర్వాదం పొందాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం నుంచి ప్రారంభమైన ఇంటింటికీ తెలుగుదేశం కార్యకమం కొనసాగింపుపై కాసాని పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల నేతలతో మాట్లాడుతూ ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సక్సెస్ చేయాలని చెప్పారు. అన్ని పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో కార్యక్రమాన్ని ప్రారంభించారా ? లేదా అని నాయకులను ఆరా తీశారు. మంగళవారం ఖమ్మం పార్లమెంటు పరిధిలోని ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. బుధవారం మహబూబ్‌నగర్ , మల్కాజ్‌గిరి, మహబూబాబాద్, చేవెళ్ల, కరీంనగర్, నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో పలు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. కుత్బుల్లాపూర్, ఖమ్మం, సత్తుపల్లి, మధిర, వైరా, పినపాక, వికారాబాద్, షాద్‌నగర్, కరీంనగర్ కార్పోరేషన్, ఆర్మూర్ తదితర అసెంబ్లీ నియోజకవర్గాలో పార్టీ నాయకులు ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. ఇదే క్రమంలో అన్నివర్గాల ప్రజలను పార్టీలోకి అహ్వానించి చేర్చుకోవాలనీ, భారీగా పార్టీ సభ్యత్వాలను నమోదు చేయాలని సూచించారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం ప్రధాన లక్ష్యమైన పార్టీ పునర్ నిర్మాణం దిశగా గ్రామ వార్డు స్థాయి నుంచి మండల పార్టీ కమిటీలను తప్పనిసరిగా నియామకం చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ సజావుగా జరిగేలా పార్లమెంటు పరిశీలకులు, అసెంబ్లీ కో-ఆర్డినేటర్లు మండల స్థాయి నాయకులతో సమన్వయం చేసుకోవాలని కోరారు.

కల్తీపై కొరడా

- విత్తనాలు, నూనెలు కల్తీ చేస్తే పీడీ యాక్ట్
- 'విజయ' ఉత్పత్తుల మార్కెటింగ్ పెంచండి
- వ్యవసాయశాఖపై సీఎస్ సమీక్ష

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



రాష్ట్రంలో నకిలీ విత్తనాల మార్కెటింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి అధికారులను ఆదేశించారు. అలాగే నకిలీ వంటనూనెల తయారీ, విక్రయాలపై దృష్టి సారించాలనీ, అక్రమాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్‌తో పాటు చట్టపరంగా కేసులు నమోదు చేసి అరెస్టులు చేయాలని చెప్పారు. నకిలీ విత్తనాలు మార్కెట్ చేస్తున్న 551 మందిని అరెస్ట్ చేసి 347 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. వీరిలో 16 మందిపై పీడీ చట్టం కేసులు పెట్టి, 11,872 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. బుధవారంనాడిక్కడి బీఆర్కే భవన్‌లో వ్యవసాయ శాఖపై ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఉద్యానవన శాఖ కమీషనర్ హనుమంతరావు, మార్కెటింగ్, సహకారశాఖ, ఆయిల్ ఫెడ్ , హాకా, గిడ్డంగులు, ఆగ్రోస్ విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో వివిధ నూనె ఉత్పత్తుల కంపెనీలతో పాటు కల్తీ నూనెలు చెలామణిలో ఉన్నాయనీ, వీటిని నిరోధించాలని ఆదేశించారు. ప్రజారోగ్యం దృష్ట్యా కల్తీ రహిత విజయ నూనె ఉత్పత్తుల మార్కెటింగ్‌ను విస్తృతం చేయాలని చెప్పారు. వ్యవసాయ రంగాన్ని పారిశ్రామిక రంగంతో అనుసంధానం చేయాలనీ, పండ్లను సేంద్రియ పద్ధతిలో మాగపెట్టడం, వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులకు క్యాంపస్ నియామకాలను కల్పించడం లాంటి వినూత్న విధానాలు అమలు చేయాలని అన్నారు. రైతులకు సాగునీటి సౌకర్యం, రైతు బంధు, యాంత్రీకరణ, రైతుభీమా, 24 గంటల విద్యుత్ సరఫరా, వ్యవసాయోత్పత్తుల కొనుగోళ్లు తదితర అంశాల అమల్లో ఎక్కడా లోటుపాట్లు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో కోటి ఇరవై లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందనీ, 56.37 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వివరించారు. అగ్రి స్టార్టప్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, డిజిటల్ సర్వీసుల అందుబాటు కోసం చీఫ్ సెక్రటరీ చైర్ పర్సన్‌గా స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేశామనీ, దీనిలో వ్యవసాయ శాఖ కార్యదర్శి, రెవిన్యూ శాఖ కార్యదర్శి, ఐటి శాఖ కార్యదర్శి ఉంటారని తెలిపారు. కూరగాయల పెంపకంపై రైతులను ప్రోత్సహించాలని సూచించారు.

భైరి నరేష్‌పై దాడికి పాల్పడ్డ దుండగులను

కఠినంగా శిక్షించాలి : తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు భైరి నరేష్‌పై బీజేపీ, ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్, హిందూవాహిని కార్యకర్తలు మూకుమ్మడిగా పోలీస్ వాహనంలోకి చొరబడి విచక్షణారహితంగా దాడిచేయడాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. దాడికి పాల్పడ్డ ఆ దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరింది. నరేష్‌కు రక్షణ కల్పించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్ధాంతాలు, నమ్మకాలను చట్టానికి లోబడి ప్రచారం చేసుకునే హక్కు పౌరులకు రాజ్యాంగం కల్పించిందని పేర్కొన్నారు. హన్మకొండ ఆదర్శ లా కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న నరేష్ అంబేద్కర్ భవన్‌లో విద్యార్థుల ఫ్రెషర్స్ పార్టీలో పాల్గొనేందుకు వెళ్లారని తెలిపారు. బీజేపీ, దాని అనుబంధ సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడ గుమికూడిన విషయాన్ని నరేష్ గమనించి పోలీసుల రక్షణ కోరాడని వివరించారు. వారి రక్షణతో పోలీస్ వాహనంలో ఉండగానే, దాన్ని అడ్డగించి విచక్షణారహితంగా దాడి చేయడంతో నరేష్ గాయాల పాలయ్యారని పేర్కొన్నారు. పోలీసులు అడ్డుకోకపోతే నరేష్ ప్రాణాలకే ముప్పు కలిగేదని తెలిపారు. ఈ కాలంలో మతోన్మాదుల దాడులు, అరాచకాలు పేట్రేగుతున్నాయని విమర్శించారు. భౌతికంగా దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే ఈ తరహా దాడులను ప్రజాస్వామ్యవాదులంతా ప్రతిఘటించాలని కోరారు. గతంలో ఆయన చేసిన వ్యాఖ్యల పట్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే దానికి క్షమాపణ కూడా కోరిన నరేష్‌పై ఈ రకంగా వెంటాడి, వేటాడి దాడికి పూనుకోవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

భైరి నరేష్‌కు తగిన రక్షణ కల్పించాలి : స్వేచ్ఛ జేఏసీ

భైరి నరేష్‌కు తగిన రక్షణ కల్పించాలని స్వేచ్ఛ జేఏసీ డిమాండ్ చేసింది. ఆయనపై పోలీసుల సమక్షంలో మతోన్మాదుల దాడి చేయడం అప్రజా స్వామికం, రాజ్యాంగ వ్యతిరేకమంటూ ఖండించింది. వందకు పైగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా, పౌర సంఘాలతో ఏర్పడిన స్వేచ్ఛ జేఏసీ కన్వీనర్ టి.రమేష్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఆడుతున్న రాజకీయ వికృత క్రీడనే ఈ మతోన్మాదం మూకదాడులని పేర్కొన్నారు. వీటిని ప్రజాస్వామ్యవాదులందరూ తీవ్రంగా ఖండించాలని కోరారు. రాజ్యాంగ రక్షణ, ప్రజాస్వామ్య రక్షణ నేడు ప్రజల బాధ్యతగా మారిందని అభిప్రాయపడ్డారు. ఉన్మాద శక్తులకు తోడ్పడే విధంగా హేతువాదులు, నాస్తికులు, భౌతికవాదులు, అంబేద్కర్ వాదులు వ్యవహరించకుండా అత్యంత జాగ్రత్తతో మాట్లాడాలని సూచించారు. ప్రభుత్వం ఇలాంటి ఘటన పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తే మతోన్మాదులను సమర్థించినట్టేనని స్పష్టం చేశారు. పోలీసులు తమ ఆధీనంలో, తమ వాహనంలో ఉన్న వ్యక్తికి రక్షణ కల్పించ లేకపోతే ఇక రాష్ట్రాన్నేం కాపాడుతారు? అని ప్రశ్నించారు. ప్రయాణంలో ఉన్న పోలీస్ వాహనాన్ని పట్టుమని పదిమంది కూడా లేని గుంపు ఆపి, అంతసేపు కొట్టటం, బట్టలు తొలగించటం జరుగుతున్నా పోలీసులు లాఠీ కూడా ఉపయోగించకుండా కాలయాపన చేయటం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తమ రక్షణలో ఉన్న వ్యక్తిని ఒక నేరస్త గుంపుకు అప్పగించిన పోలీసులపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీజేపీ సర్కార్...పేదల పాలిట గుదిబండ : మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదల పాలిట గుదిబండగా మారిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే గ్యాస్ ధర పెరిగిందని ఆందోళన చెందుతున్న ప్రజలపై మరోసారి రూ.50 భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ఒకరిద్దర్ని పోషిస్తున్నదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 2న నియోజవర్గం, 3న మండల కేంద్రాల్లో ధర్నాలు, ఆందోళనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను కాపాడండి


- మంత్రి సబితకు ఏఐడీఎస్‌వో,పీఎస్ఎస్‌సీ వినతి

నవతెలంగాణ - హైదరాబాద్

రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను కాపాడాలని ఏఐడీఎస్‌వో, పీఎస్ఎస్‌సీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని బుధవారం ఆయా సంఘాల నాయకులు జె మల్లేష్‌రాజ్, నితీష్, నాగరాజ్, అభిషేక్, నేహ కలిసి వినతిపత్రం సమర్పించారు. పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజినీరింగ్ విద్యను షిఫ్ట్ పద్ధతిలో ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. పాలిటెక్నిక్ విద్యలో విద్యా ప్రమాణాలను దిగజార్చే విధంగా ఓపెన్ బుక్ విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ విద్యావిధానం-2020లో భాగంగా పాలిటెక్నిక్ విద్యావ్యవస్థ ఉనికికే ప్రశ్నార్థకంగా తయారు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు.

మూడ్రోజుల్లో విద్యుత్‌శాఖ సీఎమ్‌డీలతో భేటీ : మంత్రి జగదీశ్‌రెడ్డి వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణపై చర్చించేందుకు మూడ్రోజుల్లో సీఎమ్‌డీలతో భేటీ అయ్యి, చర్చిస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ (టీఎస్‌పిఈజేఏసీ) ఆధ్వర్యంలో చైర్మెన్ సాయిబాబు, కన్వీనర్ రత్నాకరరావు, కో చైర్మెన్ శ్రీధర్, కో కన్వీనర్ బీసీ రెడ్డి తదితరులు మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్పు, ఆర్టిజన్ల సమస్యలపై కూడా సీఎమ్‌డీలతో చర్చిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మెన్లు గోవర్ధన్, వజీర్, అనిల్‌కుమార్, తులసి నాగరాణి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

దేశంలో సిటీ బ్యాంక్ కనుమరుగు

- యాక్సిస్ బ్యాంక్‌లో విలీనం పూర్తి

న్యూఢిల్లీ : భారత్‌లోని సిటీ బ్యాంక్ కార్యకలాపాలు పూర్తిగా యాక్సిస్ బ్యాంక్ చేతిలోకి వెళ్లాయి. ఇకపై సిటీ బ్యాంక్ శాఖలను పూర్తిగా యాక్సిస్ బ్యాంక్ రీబ్రాండింగ్ చేయనుంది. దీంతో సిటీ బ్యాంక్ కనుమరుగు కానుంది. గతేడాది రూ.11,600 కోట్లకు సిటీ బ్యాంక్‌ను యాక్సిస్ బ్యాంక్ కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. తాజాగా విలిన ప్రక్రియ పూర్తి అయ్యింది. దీంతో మార్చి 1 నుంచి భారత్‌లోని సిటీ బ్యాంక్‌కు సంబంధించిన గృహ, వ్యక్తిగత, క్రెడిట్ కార్డ్ రుణాలు, సేవింగ్ ఖాతాలు తదితర సేవలు యాక్సిస్ బ్యాంక్ పరిధిలోకి వచ్చాయి. 1902లో కోల్‌కతా కేంద్రంగా సిటీ గ్రూపు భారత్‌లో తన వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించగా.. వందేళ్లకు పైగా సేవలను అందించింది. భారత్ సహా 13 దేశాల్లో తమ కార్యకలాపాలు రద్దు చేసుకోబోతున్నట్లు 2021లో సిటీ బ్యాంక్ ప్రకటించింది. ప్రస్తుత సిటీ గ్రూపునకు సంబంధించిన అన్ని రకాల ఖాతాదారులు యథాతథంగా సేవలు పొందవచ్చని యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. దేశంలోని 18 నగరాల్లో ఏడు కార్యాలయాలు, 21 శాఖలు, 49 ఎటిఎంలు ఉన్నాయి. 30 లక్షల ఖాతాదారులుండగా.. మరో 25 లక్షల సిటీ బ్యాంక్ క్రెడిట్ కార్డులను జారీ చేసింది.

భారత్‌లో సాంసంగ్ కొత్త PC లైన్‌అప్, Galaxy Book3 సిరీస్

నవతెలంగాణ - హైదరాబాద్ : సాంసంగ్ కొత్త PC లైన్‌అప్, Galaxy Book3 Pro 360, Galaxy Book3 Pro మరియు Galaxy Book3 360, ఫిబ్రవరి 24, 2023 నుండి విక్రయంలోకి వచ్చాయి. అంతరాయంలేని బహుళ-పరికరాల కనెక్టివిటీ వారి ఉత్పాదకత మరియు సృజనని ఒక స్థాయి పైకి తీసుకెళ్ళడానికి ప్రీమియమ్ హార్డ్‌వేర్ కావల్సిన వారికి Galaxy Book3 సిరీస్ రూపొందించబడింది. ఈ అంతా-కొత్తదైన Galaxy Book3 సిరీస్, samsung.com, amazon.in ఎంచుకోబడ్డ రిటైల్ ఔట్‌లెట్స్‌లో అందుబాటులో ఉంది.

బహుళ-పరికర ప్రపంచంలో కనెక్టెడ్‌గా ఉండే పరికరాల కొరకు మా వినియోగదారుల ఆకాంక్షలని అవసరాలని మనస్సులో పెట్టుకుని క్రింది స్థాయి నుంచి Galaxy Book3 సిరీస్ నిర్మించబడింది. కీలక పరిశ్రమ భాగస్వాముల సహకారంతో, వినియోగదారులు పని మరియు పనితీరుని సృజనాత్మక పనులను పరికరాలంతటా మరియు ఆపరేటింగ్ సిస్టమ్స్ అంతటా చేసుకునే బహుళ-పరికర కనెక్టివిటీ సామర్థ్యానివ్వడానికి ఒక బెంచ్‌మార్క్‌ని Galaxy Book3 సిరీస్ సెట్ చేస్తుంది. ఆపరేటింగ్ సిస్టమ్ అంతటా అంతరాయంలేని ఫోన్-టూ-PC కనెక్టివిటీ కొరకు కనెక్టెడ్ అనుభవాన్ని యుజర్స్‌కి Galaxy Book3 సిరీస్ అందిస్తుంది.

దక్షిణాదిలో తొలి రీజినల్ రెఫరెన్స్ ల్యాబ్ ఏర్పాటు

- ఏడాదిలో 200 లుపిమిత్రల ఏర్పాటు
- లూపిన్ డయాగ్నోస్టిక్స్ వెల్లడి

హైదరాబాద్ : అంతర్జాతీయ ఫార్మా కంపెనీ లుపిన్ లిమిటెడ్ (లుపిన్) తమ నూతన ప్రాంతీయ రెఫరెన్స్ లేబరేటరీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లూపిన్ లిమిటెడ్ కమ్యూనికేషన్ అండ్ సస్టెయినిబిలిటీ గ్లోబల్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ శ్వేత ముంజల్‌తో కలిసి ఆ కంపెనీ సిఇఒ రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం తమ సంస్థకు 380కు పైగా లుపి మిత్రా (లుపిన్ యొక్క ఫ్రాంచైజీ కలెక్షన్ కేంద్రాలు), 23 లేబరేటరీలు ఉన్నాయన్నారు. 24వ లాబరేటరీని బాలానగర్‌లో ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం 2023-24 ముగింపు నాటికి దక్షిణాదిలో 200 లుపి మిత్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వచ్చే ఏడాదిలోగా విజయవాడలోనూ ఒక్క లేబరేటరీని ఏర్పాటు చేయనున్నామన్నారు. చికిత్సలో ప్రస్తుతం రోగ నిర్ధారణ పరీక్షలు అత్యంత కీలకంగా మారాయన్నారు. తమ ల్యాబ్‌ల్లో అత్యంత ఖచ్చితత్వంతో కూడిన పరీక్షా ఫలితాలను అందించేందుకు ఉన్నత ప్రక్రియలను అనుసరిస్తామన్నారు.

ఇండియాలో శామ్‌సంగ్ గెలాక్సీ S23 సీరీస్

నవతెలంగాణ - హైదరాబాద్ శామ్‌సంగ్ వారి అత్యంత ఇటీవలి ఫ్లాగ్‌షిప్ స్మార్ట్ ఫోన్ సీరీస్ అయిన గెలాక్సీ S23 సీరీస్, ఫిబ్రవరి 24, 2023 నుండి అమ్మకానికి వెళుతోంది. గెలాక్సీ S23 అల్ట్రా, గెలాక్సీ S23, గెలాక్సీ S23 ఉపకరణాలు గణనీయంగా అతితక్కువ పర్యావరణ ప్రభావాన్ని కలిగి ఉండి అత్యుత్తమ శ్రేణి వినూత్న పరిజ్ఞానముతో ఈ తరానికి సంబంధించిన నవ్యతతో ఉన్నాయి. కొత్త గెలాక్సీ S23 సీరీస్ స్మార్ట్ ఫోన్లను కొనుగోలు చేయాలని చూస్తున్న కస్టమర్లు నేటి నుండి వాటిని Samsung.com ఎంపిక చేయబడిన రిటెయిల్ ఔట్‌లెట్ల నుండి కొనుగోలు చేసుకోవచ్చు. గెలాక్సీ S23 అల్ట్రా, ఐతిహాసిక సునిశితత్వంతో చిత్రాలను గ్రాహ్యత చేసుకోగల అడాప్టివ్ పిక్సెల్స్ తో సరికొత్త 200MP సెన్సార్ తో వస్తుంది. సూపర్ క్వాడ్ పిక్సెల్ AF తో, వెనుకవైపు కెమెరా 50% వేగంగా ఫోకస్ చేయగలుగుతుంది. గెలాక్సీ S23 సీరీస్ పై ఫ్రంట్ కెమెరా ఇప్పుడు నైటోగ్రఫీతో పాటుగా డ్యుయల్ పిక్సెల్ ఆటో ఫోకస్ టెక్నాలజీతో వస్తుంది, అది తక్కువ లైటింగ్ ఉన్న పరిస్థితుల్లో కూడా ఫ్రంట్ కెమెరా నుండి షుటింగ్ చేసుకునే వీలు కలిగిస్తుంది.

తన 5జి నెట్‌వర్క్‌లో 10 మిలియన్ల ప్రత్యేక వినియోగదారులను అధిగమించిన ఎయిర్‌టెల్

నవతెలంగాణ- హైదరాబాద్ : భారతదేశంలో ప్రముఖ టెలికమ్యూనికేషన్స్ సర్వీస్ ప్రొవైడర్ భారతీ ఎయిర్‌టెల్ ("ఎయిర్‌టెల్") నేడు తన నెట్‌వర్క్‌లో 10 మిలియన్ల ప్రత్యేకమైన 5జి యూజర్ మార్క్‌ను అధిగమించానని వెల్లడించింది. అక్టోబర్ 2022లో దేశంలో 5జి సేవలను అందుబాటులోకి తెచ్చిన మొదటి సర్వీస్ ప్రొవైడర్ ఎయిర్‌టెల్. నేడు, దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఎయిర్‌టెల్ 5జి ప్లస్ అందుబాటులో ఉంది. మార్చి 2024 చివరి నాటికి ఎయిర్‌టెల్ 5జి సేవలను ప్రతి పట్టణం, కీలకమైన గ్రామీణ ప్రాంతాలలో అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కంపెనీ సన్నాహాలు చేసుకుంటోంది. నవంబర్ 2022లో, వాణిజ్యపరంగా ప్రారంభించిన 30రోజులలోనే తన నెట్‌వర్క్‌లో 1 మిలియన్ ప్రత్యేక వినియోగదారులను సొంతం చేసుకున్న మొదటి మరియు ఏకైక ఆపరేటర్‌గా ఎయిర్‌టెల్ అవతరించింది.

భారతదేశంలో మొదటి క్లౌడ్ కూలింగ్ ఫ్యాన్‌ను విడుదల చేసిన ఓరియెంట్ ఎలక్ట్రిక్

నవతెలంగాణ - హైదరాబాద్ 2.4 బిలియన్ డాలర్ల విలువతో విస్తృత ఉత్పత్తుల శ్రేణి కలిగిన సి.కె.బిర్లా గ్రూపులోని ఓరియెంట్ ఎలక్ట్రిక్ లిమిటెడ్ క్లౌడ్‌చిల్ సాంకేతికత కలిగిన వినూత్న తరహా కూలింగ్ క్లౌడ్ 3 ఫ్యాన్‌ను విడుదల చేసింది. ఓరియెంట్ క్లౌడ్ 3 చల్లని గాలిని అందించడమే కాకుండా, చుట్టుపక్కల ప్రదేశాన్ని కూడా చల్లబరుస్తుంది. దీనితో ఏడాది మొత్తం వేడి ఉష్ణోగ్రతను ఎదుర్కొనే భారతీయ నివాసాలకు ఇది ఉత్తమ ఎంపికగా నిలువనుంది. విలక్షణమైన డిజైన్ కలిగిన ఓరియెంట్ క్లౌడ్ 3 కూలింగ్ ఫ్యాన్ 4.5-లీటరు నీటి ట్యాంకును కలిగి ఉండగా, నీటిని 8 గంటల వరకు ఉంచుకుని, అడ్డకుంలు లేని మరియు పరిణామకారిగా చల్లదనాన్ని అందిస్తుంది. ఈ ఫ్యాను గాలి ఉష్ణోగ్రతను 12 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ జీవనశైలి కూలింగ్ పరిష్కరణ విడుదలతో ఓరియెంట్ ఎలక్ట్రిక్ తన ఆలోచనాత్మక నాయకత్వాన్ని మరోసారి ధ్రువీకరిస్తూ, వినియోగదారుల ఆకాంక్షలతో కూడిన అవసరాలనూ పరిష్కరిస్తోంది.

నెక్సన్ ఈవీ కే2కే రికార్డు

నవతెలంగాణ - హైదరాబాద్ : భారతదేశ అగ్రగామి ఆటోమొబైల్ తయారీ సంస్థ, భారతదేశ ఈవీ విప్లవంలో అ గ్రగామి అయిన టాటా మోటార్స్ నేడిక్కడ శ్రీ నగర్ నుంచి కన్యాకుమారి దా కా తన ఎలక్ట్రిక్ ఎస్ యూవీ -నెక్సన్ ఈవీ ఛాలెంజింగ్ జర్నీని ప్రకటించింది. ఫి బ్రవరి 25 న నెక్సన్ ఈవీ ప్రయాణం ప్రారంభం కానుంది. నాలుగు రోజుల పాటు నాన్-స్టాప్ గా 4000 కి.మీ. మేర ఈ ప్రయాణం సాగనుంది. (వాహనం ఛార్జిం గ్ కోసం మాత్రమే ప్రయాణం నిలిపివేయబడుతుంది). ఈవీ ప్రయాణంలో వేగవంతమైన కే2కే రికార్డు సృష్టించేం దుకు ఈ ప్రయత్నం జరుగుతోంది. ఒత్తిడి లేని అనుభూతిని అందించేందుకు వీలుగా, టాటా మోటార్స్ తన నె క్సన్ ఈవీ శ్రేణిని 453 కి.మీ.కు మెరుగుపర్చింది. టాటా పవర్ దేశవ్యాప్తంగా హైవే చార్జింగ్ మౌలిక వసతులను మెరుగుపరుస్తోంది, తద్వారా ప్రజలు చార్జింగ్ వసతులను సులభంగా యాక్సెస్ చేసేందుకు వీలు కలుగుతుంది.